CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 60 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 11 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 60 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 11JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## సినీ ఇండస్ట్రీని పట్టించుకోవడం మానేశా..

### టికెట్ల ధరల పెంపు జీవోలతో నాకు సంబంధం లేదు!

- 'రాజాసాబ్' టిక్కెట్ ధరల పెంపు జీవో.. మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు
- టిక్కెట్ ధరల పెంపునకు తాను అనుమతి ఇవ్వలేదన్న మంత్రి
- పుష్ప-2 తర్వాత ఎప్పుడూ ధరల పెంపునకు అనుమతివ్వలేదని వెల్లడి
- సినిమా పరిశ్రమను పట్టించుకోవడం మానివేశానన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి






**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సినిమా టికెట్ల ధరల పెంపుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సంక్రాంతి పెద్ద సినిమాల విడుదల వేళ.. టికెట్ రేట్ల పెంపు అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి క్లారిటీ ఇచ్చారు. శనివారం ( జనవరి 10, 2026 ) విలేకరులతో మాట్లాడుతూ.. సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన రేట్ల వ్యవహారాలను తాను పట్టించుకోవడం మానేశానని స్పష్టం చేశారు.

**టికెట్ల పెంపు.. నా సంతకం లేదు!**

గత కొంతకాలంగా పెద్ద సినిమాల విడుదలకు ముందు టికెట్ ధరలు పెంచుతూ ప్రభుత్వం జీవోలు జారీ చేస్తోంది. అయితే, ఈ ప్రక్రియతో తనకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి వెల్లడించారు. 'పుష్ప 2' సినిమా విడుదల సమయం నుంచే నేను చెబుతున్నాను. బెనిఫిట్ షోలు లేదా రేట్ల పెంపు ఫైలు నా దగ్గరకు తీసుకురావద్దని అధికారులకు స్పష్టం చేశాను. ప్రస్తుతం సంక్రాంతి సినిమాలకు సంబంధించి ఏ ఫైలు కూడా నా వద్దకు రాలేదు, నేను దేనిపైనా సంతకం చేయలేదు అని ఆయన విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు.

**సంధ్యా థియేటర్ ఘటనతో కలత..**

అల్లు అర్జున్ సినిమా 'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్యా థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగి ఒక మహిళ మరణించిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి అన్నారు. ఆ ఘటన తర్వాత బెనిఫిట్ షోలకు పర్మిషన్ ఎందుకు ఇచ్చానా అనిపించింది. అందుకే ఇకపై ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఆ ప్రమాదంలో బాధితులకు ప్రతీక్ ఫౌండేషన్ తరపున రూ. 25 లక్షల చెక్ అందించాం. గాయపడిన బాలుడిని చదివించే బాధ్యతను కూడా తీసుకున్నాను అని కోమటిరెడ్డి వివరించారు. సినిమా టికెట్ల ధరల పెంపు అనేది సామాన్య ప్రేక్షకుడిపై భారం మోపడమేనని మంత్రి అభిప్రాయపడ్డారు. పేద కళాకారులు, సినిమా కార్మికుల సమస్యలు ఉంటే తప్పకుండా పరిష్కరిస్తానని, కానీ కేవలం లాభాల కోసం రేట్లు పెంచే అంశాల్లో తాను జోక్యం చేసుకోనని చెప్పారు. నా సొంత నియోజకవర్గం నల్గొండ అభివృద్ధి పనులపై దృష్టి సారించాను. సినీ పరిశ్రమ రేట్లు, బెనిఫిట్ షోల విషయంలో అసెంబ్లీలో చెప్పిన మాటకే కట్టుబడి ఉన్నాను అని ఆయన మరోసారి స్పష్టం చేశారు. మంత్రి వ్యాఖ్యలతో ఇప్పుడు టాలీవుడ్‌లో మరో సారి చర్చనీయాంశంగా మారింది

## మదురోలా పుతిన్‌ను కూడా పట్టుకుంటారా?

### జెలెన్‌స్కీ వ్యాఖ్యలపై ట్రంప్ ఏమన్నారంటే..!

- వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను అరెస్ట్ చేసిన అమెరికా
- పుతిన్‌కు కూడా ఇదే గతి పట్టాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సూచన
- జెలెన్‌స్కీ వ్యాఖ్యలను తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- పుతిన్‌ను అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదన్న ట్రంప్

వివరాలు 2లో..



## నటుడు విజయ్‌కు సీబీఐ సమన్లు.. ప్రచార వాహనం సీజ్

- కరూర్ సభలో తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు ముమ్మరం
- నటుడు విజయ్‌కు సమన్లు జారీ.. 12న ఢిల్లీలో విచారణ
- విజయ్ ప్రచార వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు
- ఇప్పటికే పలువురు టీవీకే నేతలు, జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించిన సీబీఐ



**పెన్ పవర్ డెస్క్:**తమిళ సినీ నటుడు, రాజకీయ నేత విజయ్ చుట్టూ కరూర్ తొక్కిసలాట కేసులో ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 12న ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని కేంద్ర దర్యాప్తు

వివరాలు 2లో..

## నేను డాక్టర్‌ను కాకపోవచ్చు.. కానీ 'సోషల్ డాక్టర్'ను

- పాఠశాల విద్యార్థులకు వైద్యులు సీపీఆర్ నేర్పిస్తే, వారు ఎన్నో ప్రాణాలు కాపాడుతారు
- హైదరాబాద్‌లో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు
- తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే సోషల్ డాక్టర్‌ని అన్న సీఎం
- ప్రజారోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్::** నేను వైద్యుడిని కాదు కానీ సోషల్ డాక్టర్?ని అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం (జనవరి 10) హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఫెలోస్ ఇండియా సదస్సు జరిగింది. ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్, ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ గెస్ట్?గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైఫ్ సెన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మనుషులు, సమాజంపై వైద్యులు తమ బాధ్యతను ఎప్పటికీ మరిచిపోవద్దని సూచించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం

వివరాలు 2లో..

## హైదరాబాద్-విజయవాడ హైవేపై పండుగ రద్దీ.. ఈ రూట్లలో వెళ్తే బెటర్ అంటున్న పోలీసులు

- సంక్రాంతి పండుగ వేళ విజయవాడ హైవేపై భారీ ట్రాఫిక్ జామ్
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారికి నాగార్జునసాగర్ హైవే మార్గం సూచన
- విజయవాడ, ఖమ్మం వెళ్లేవారు భువనగిరి మీదుగా వెళ్లాలని తెలిపిన పోలీసులు
- ఆదివారం చౌటుప్పల్ సంతతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళుతున్న ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (చీఎ-65) కిక్కిరిసిపోయింది. శనివారం ఉదయం

వివరాలు 2లో..

## మియాపూర్ లో రూ.3 వేల కోట్లకు పైగా విలువైన భూమికి హైడ్రా రక్షణ

- మియాపూర్‌లో రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం
- సర్వే నంబర్ 44లో 15 ఎకరాలకు పైగా భూమిని కాపాడిన హైడ్రా
- తప్పుడు పత్రాలతో కబ్జాకు యత్నించినట్లు అధికారుల నిర్ధారణ
- ఆక్రమణల తొలగింపు.. భూమి చుట్టూ ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు
- కబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:**రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. శేరిలింగంపల్లి మండలం, మక్తా మహబూబ్‌పేటలోని సర్వే నంబర్ 44లో ఉన్న సుమారు రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి కబ్జాకు గురవుతోందని గతంలోనే హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు గతంలోనే ఐదు ఎకరాలను స్వాధీనం చేసుకుని, చెరువు కట్టపై నిర్మించిన 18 అక్రమ షెట్టర్లను తొలగించారు. అయితే, ఇదే భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, సంబంధిత సబ్-రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు గురయ్యారనే వార్తల నేపథ్యంలో హైడ్రా అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. ఈ విచారణలో, సర్వే నంబర్ 159కి చెందిన పత్రాలను ఉపయోగించి సర్వే నంబర్ 44లోని మొత్తం 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఎకరంన్నర భూమిని కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తాజాగా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిన హైడ్రా, ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేసింది.

## జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తాం.. గతంలో కంటే ఎక్కువగానే అక్రిడిటేషన్ కార్డులు ఇస్తాం




**హైదరాబాద్ పెన్ పవర్:**జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి ఆ వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్నివిధాలా అండదండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏ ఒక్కరి గౌరవాన్ని తగ్గించాలని గాని, చిన్నబుచ్చాలనిగాని తమ ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని స్పష్టం చేశారు. జీవో 252 పై శనివారం (జనవరి 10) సచివాలయంలోని తన కార్యాలయంలో 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. సమావేశంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. జీవో 252లో

వివరాలు 2లో..

## పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన

**హైదరాబాద్ పెన్ పవర్:** అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ మధ్య విమర్శలు ప్రతి విమర్శలు, కౌంటర్లు రీ కౌంటర్లతో తెలంగాణ పాలిటిక్స్ కాకరేపుతున్నాయి. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకున్న కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే జోరు చూపించాలని వ్యూహాలు రచిస్తోంది. మరోవైపు సర్పంచ్ ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ కూడా పురపాలక ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది.

పార్టీ గుర్తుతో జరిగే ఎన్నికలు కావడంతో మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా మూడు పార్టీలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. త్వరలో జరగబోయే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని

వివరాలు 2లో..



## వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు




- మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో కథనం
- వాస్తవాలకు దూరంగా వార్తలు వస్తున్నాయన్న మహేశ్ గౌడ్
- నిరాధార వార్తలు ప్రచురించడం మానేయాలని హితవు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణకు చెందిన ఓ మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో ప్రసారమైన కథనం సంచలనం రేకెత్తించింది. ఈ కథనంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# వెనిజువెలా చమురు రంగం అమెరికా చేతుల్లోకి

వెనిజువెలా చమురు రంగంలోకి వెంటనే తిరిగి ప్రవేశించాలంటూ అమెరికా చమురు దిగ్గజ కంపెనీలకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. వెనిజువెలాలో నిర్లక్ష్యానికి గురైన మౌలిక వసతులను సరిచేసి, అక్కడి విస్తారమైన చమురు నిల్వలను పూర్తిగా వినియోగించుకోవాలన్నదే లక్ష్యమని ఆయన చెప్పారు. ఇందుకు కోసం 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సమీకరించేందుకు వైట్ హౌస్ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇటీవల అమెరికా సైనిక దాడిలో వెనిజువెలా మాజీ అధ్యక్షుడు నికోలాస్ మదురోను అదుపులోకి తీసుకున్న తర్వాత, ట్రంప్ ఈ చర్యను అమెరికాకు ఆర్థిక అవకాశంగా చూపుతున్నారు. వెనిజులా చమురు తరలిస్తున్న ట్యాంకర్లను అమెరికా స్వాధీనం చేసుకుంది.

**చమురు అమ్మకాలను...**

గతంలో ఆంక్షలు ఎదుర్కొన్న 3 కోట్ల నుంచి 5 కోట్ల బ్యారెళ్ల వెనిజువెలా ముడి చమురు అమ్మకాలను అమెరికానే చేపడుతుందని ట్రంప్ చెప్పారు. ఈ అమ్మకాలను ప్రపంచవ్యాప్తంగా నిరవధికంగా నియంత్రించే యోచన ఉందన్నారు. వైట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో ప్రధాన చమురు కంపెనీల ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేసినప్పటికీ, గత అనుభవాల దృష్ట్యా జాగ్రత్త అవసరమని తెలిపారు. "ప్రస్తుతం వెనిజువెలాలో ఉన్న వాణిజ్య వ్యవస్థలు, చట్టపరమైన చట్రాలు పెట్టుబడులకు అనుకూలంగా లేవు," అని అమెరికాలో అతిపెద్ద చమురు సంస్థ ఎక్సాన్‌మొబిల్ సీఈవో డారెన్ వుడ్స్ చెప్పారు. సమావేశంలో ట్రంప్ స్వయంగా జోక్యం చేసుకుని కంపెనీలకు భద్రతపై హామీ ఇచ్చారు. "మీకు పూర్తి భద్రత ఉంటుంది. మీరు వెనిజువెలాతో కాదు నేరుగా మా ప్రభుత్వంతోనే వ్యవహరిస్తారు," అని చెప్పారు. భద్రతా హామీ వెనిజువెలా నాయకులు, ప్రజలతో కలిసి పని చేయడం ద్వారా వస్తుందని, అమెరికా సైన్యాన్ని అక్కడ మోహరించే ఆలోచన లేదని ట్రంప్ తెలిపారు.

**చైనా.. రష్యా...ఆక్రమించేవని...**

అవసరమైతే కంపెనీలే కొంత భద్రత ఏర్పాటు చేస్తాయని కూడా అన్నారు. ఎక్సాన్‌మొబిల్ గతంలో వెనిజులాలో తన ఆస్తులు రెండుసార్లు స్వాధీనం చేసుకున్న విషయాన్ని గుర్తు చేసింది. పరిస్థితిని అధ్యయనం చేసేందుకు బృందాన్ని పంపుతామని వుడ్స్ చెప్పారు. మదురోను తొలగించి వెనిజులా చమురు రంగంపై అమెరికా పర్యవేక్షణ అవసరమని ట్రంప్ మరో కారణం చెప్పారు. తాము ఇది చేయకపోతే చైనా లేదా రష్యా చేసేవని అన్నారు. మరొకవైపు అమెరికావెనిజువెలా దేశాలు దౌత్య సంబంధాల పునరుద్ధరణ అవకాశాలపై చర్చలు జరుపుతున్నట్లు వెల్లడైంది. కరాకాస్‌లో అమెరికా దౌత్య కార్యాలయం పునఃప్రారంభంపై అధ్యయనానికి అమెరికా బృందం అక్కడికి వెళ్లినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ట్రంప్ వచ్చే వారం వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మాచాడోను కలవనున్నట్లు ప్రకటించారు. అలాగే కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోతో వచ్చే నెల సమావేశం ఉంటుందని తెలిపారు.

# జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తం..

## గతంలో కంటే ఎక్కువగానే అక్రిడిటేషన్ కార్డులు ఇస్తం

- మొదటి పేజి తరువాయి

మార్పులు చేర్పులు చేస్తామని హామీ ఇచ్చారు.

అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. గతంలో ఉన్న సుమారు 23వేల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య కంటే ఈ సారి ఇచ్చే కార్డుల సంఖ్య ఎక్కువ ఉంటుందని వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటివరుసలో ఉందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే సదుద్దేశంతో శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడం జరిగిందని తెలిపారు.

ఇందుకోసమే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని అంతేగాక దేశ వ్యాప్తంగా ఉన్ననియమ నిబంధనలను పరిశీలించడం జరిగిందని ఫలితంగా కొత్త కార్డుల మంజూరులో కొంత జాప్యం జరిగిందని అన్నారు. మీడియా కార్డుకు, అక్రిడిటేషన్ కార్డుకు ఎలాంటి వ్యత్యాసం లేదని.. అక్రిడిటేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పరంగా అందే ప్రతి ప్రయోజనం మీడియా కార్డుదారులకు కూడా అందుతాయని క్లారిటీ ఇచ్చారు. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని మరోమారు స్పష్టం చేశారు. తాము అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో ఎటువంటి భేషజాలకు పోవడం లేదని కానీ ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గాను ప్రభుత్వ పరంగా సర్క్యులేషన్, ఇతర సంబంధిత వివరాలను ఖచ్చితంగా సేకరిస్తామని, ఛార్టెడ్ అకౌంటెంట్ సర్టిఫికేట్ల పరిశీలన కూడా చేస్తామని దీనివలన అసలైన పత్రికలు, పాత్రికేయలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో మండలానికో విలేకరి ప్రాతిపదికన గాక జనాభా వారీగా అక్రిడిటేషన్‌లు మంజూరు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంలో కూడా ఆలోచిస్తామని, దీనిపై పాత్రికేయ సంఘాలు స్పందించాలని అన్నారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామన్నారు. క్రీడా, సాంస్కృతిక, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల పాత్రికేయులకు అక్రిడిటేషన్ సౌకర్యం తప్పక ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రత్యేక కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోని తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే డిజిటల్ మీడియా కార్డులు మంజూరు చేశామని తెలియజేశారు. సమావేశంలో పలువురు పాత్రికేయ సంఘాల ప్రతినిధులు ఇండ్ల స్థలాలు, పెన్షన్, బస్‌పాసులు, పాత్రికేయులకు బీమా తదితర అంశాలను ప్రస్తావించగా మంత్రి పొంగులేటి వాటిపై క్లారిటీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశాన్ని పరిష్కరించి.. జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించడం జరిగిందన్నారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని కొట్టివేయడంతో సమస్య మొదటికి వచ్చిందని అయినా కూడా ఇండ్ల స్థలాల విషయంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఎటువంటి కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు

# వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు

- మొదటి పేజి తరువాయి

తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండించారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని, వాస్తవాలకు దూరంగా ఇలాంటి వార్తలు వస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి మంత్రులు, అధికారులు ఈ స్థాయికి చేరుకుంటారని, అలాంటి వారిపై నిరాధారమైన వార్తలు ప్రచురించడం మానేయాలని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మహేశ్ కుమార్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

అంతేకాకుండా, శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నిస్తూ, రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని, ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మేము రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమయ్యారని, కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్ రావు బాధపడుతున్నారని అన్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు సాధించామని, కంటోన్మెంట్,

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించామని... మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోందని అన్నారు.

# నేను డాక్టర్‌ను కాకపోవచ్చు.. కానీ 'సోషల్ డాక్టర్'ను

- మొదటి పేజి తరువాయి

అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. వైద్యులు అధునాతన సాంకేతికతను అప్ గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. గుండె జబ్బులను నివారించే మిషన్?లో మనం భాగస్వాములం అవుదామని పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు మనం కలిసి పని చేద్దామని కోరారు. విద్యార్థులకు సీపీఆర్ నేర్పేందుకు ముందుకు వస్తే చాలా మంది ప్రాణాలను కాపాడగలమని అన్నారు. క్వాలిటీ ఆఫ్ హెల్త్ కేర్ కోసం అందరూ కృషి చేయాలని.. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమం కావాలని సూచించారు.

# మదురోలా పుతిన్‌ను కూడా పట్టుకుంటారా?

వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బలగాలు అనూహ్య రీతిలో అరెస్ట్ చేయడం అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కారకాస్‌లోని ఆయన నివాసంపై గత వారం మెరుపుదాడి చేసి, మదురోను పట్టుకుని న్యూయార్క్ జైలుకు తరలించారు. ఈ ఘటన అమెరికా-రష్యా సంబంధాలపై కొత్త చర్చకు దారితీసింది. మదురో అరెస్ట్‌ను ఉద్దేశించి, "ఒక నియంతతో ఇలాగే వ్యవహరించాలి, తదుపరి ఏం చేయాలో అమెరికాకు తెలుసు" అంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అయితే, జెలెన్‌స్కీ అభిప్రాయంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విభేదించారు. పుతిన్‌ను అరెస్ట్ చేయాల్సిన అవసరం రాదని స్పష్టం చేశారు. "పుతిన్ విషయంలో నేను చాలా నిరాశకు గురయ్యాను. కానీ, ఆయనతో మాకు ఎప్పుడూ మంచి సంబంధాలే ఉన్నాయి. ఆయన్ను బలవంతంగా పట్టుకోవాల్సిన అవసరం వస్తుందని నేను అనుకోవడం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఆపలేకపోయినందుకు విచారం వ్యక్తం చేస్తూ, తాను ఇప్పటికే 8 యుద్ధాలను పరిష్కరించానని గుర్తుచేశారు. "గత నెలలోనే 31,000 మంది చనిపోయారు. వారిలో చాలామంది రష్యా సైనికులే. రష్యా ఆర్థిక వ్యవస్థ కూడా బలహీనపడింది. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని భావిస్తున్నాను" అని ట్రంప్ తెలిపారు. గత వారం అర్ధరాత్రి కారకాస్ నగరంపై అమెరికా యుద్ధ విమానాలు ఆకస్మికంగా వైమానిక దాడులు జరిపాయి. ఆ వెంటనే రంగంలోకి దిగిన అమెరికా అత్యంత రహస్య దళం 'డెల్టా ఫోర్స్', నిద్రిస్తున్న మదురోను అదుపులోకి తీసుకుంది. అక్కడి నుంచి ఆయన్ను యూఎస్ఎస్ జిమా అనే భారీ యుద్ధ నౌక ద్వారా న్యూయార్క్‌కు తరలించారు. ప్రస్తుతం ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెనెజువెలా అధ్యక్ష బాధ్యతలు చేపట్టగా, ఆ దేశ చమురు ఎగుమతులపై పట్టు సాధించేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది.

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన

- మొదటి పేజి తరువాయి

డిసైడ్ అయ్యింది. తెలంగాణలో జనసేన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ హైకమాండ్ ప్రకటించింది. ఈ మేరకు శనివారం (జనవరి 10) అధికారిక ప్రకటన విడుదల చేసింది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా కమిటీలు ఏర్పాటు చేయాలని జనసేన అగ్ర నాయకత్వం నిర్ణయించింది. మున్సిపల్ ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నందున ప్రతీ జనసైనికుడు, వీరమహిళ ఉత్సాహంగా ఎన్నికల ప్రచారానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. త్వరలో ఎన్నికల కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించింది. ఇప్పటికే మూడు పార్టీల మధ్య ట్రయాంగిల్ ఫైట్ నెలకొన్న వేళ జనసేన బరిలోకి దిగుతుండటంతో తెలంగాణ పాలిటిక్స్ మరింత రసవత్తరంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇస్తూ వస్తోన్న జనసేన.. ఈసారి ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడం చర్చనీయాంశంగా మారింది. జనసేన ఎంట్రీతో ఓట్ బ్యాంక్ చీలి.. ఏదో ఒక పార్టీకి భారీ డ్యామేజ్ తప్పదంటున్నారు పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్

# హైదరాబాద్-విజయవాడ హైవేపై పండుగ రద్దీ.. ఈ రూట్లలో వెళ్తే బెటర్ అంటున్న పోలీసులు

- మొదటి పేజి తరువాయి

నుంచే రహదారిపై వాహనాలు బారులు తీరాయి. ముఖ్యంగా చౌటుప్పల్ పట్టణం, పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పండుగ సెలవులు మొదలవడంతో వేలాది మంది ఒకేసారి బయలుదేరడం, దీనికితోడు హైవేపై జరుగుతున్న నిర్మాణ పనులు కూడా తోడవడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే వాహనదారులు విజయవాడ హైవేకు బదులుగా నాగార్జునసాగర్ హైవే మీదుగా ప్రయాణించడం మేలని పోలీసులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నుంచి బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకుని సాగర్ హైవేలోకి ప్రవేశించవచ్చు. ఈ మార్గం కాస్త దూరం ఎక్కువైనా, ట్రాఫిక్ లేకుండా సాఫీగా ప్రయాణం సాగించవచ్చని చెబుతున్నారు. సాధారణ మార్గంలో పంతంగి టోల్‌ప్లాజా వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి మీదుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్ వద్ద ఎగ్జిట్ తీసుకుని వరంగల్ హైవేపైకి చేరుకుని, అక్కడి నుంచి భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. చిట్యాల నుంచి నార్కట్‌పల్లిని దాటితే ట్రాఫిక్ కష్టాలు చాలా వరకు తగ్గుతాయని వివరిస్తున్నారు.

అంతేకాకుండా ఆదివారం చౌటుప్పల్‌లో జరిగే వారంతపు సంతతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పండుగ రద్దీకి సంత కూడా తోడైతే పరిస్థితి తీవ్రంగా మారుతుందని, కాబట్టి ఆదివారం ప్రయాణించే వారు కచ్చితంగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. వాహనదారులు ఓపికతో వ్యవహరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

# అలా చేస్తే ట్రంప్‌కు కూడా మద్దతిస్తా: ఉద్ధవ్ థాకరేతో పొత్తుపై రాజ్ థాకరే కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మహారాష్ట్ర, మరాఠీ భాషాభివృద్ధికి సహకరిస్తే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సైతం మద్దతు ఇవ్వడానికి వెనుకాడబోనని మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ థాకరే స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు తనకు ముఖ్యమని ఆయన ఉద్ఘాటించారు. దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత బీఎంసీ ఎన్నికల కోసం ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ కలిసి పనిచేయనున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్ థాకరే ఆంగ్ల మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, మరాఠీ ప్రజల సంక్షేమం, మరాఠీ భాష పరిరక్షణ, బలమైన మహారాష్ట్ర అనే అంశాలు తనకు అత్యంత ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఈ లక్ష్యాలను సాధించడానికి ఎవరితోనైనా కలిసి పనిచేస్తామని ఆయన అన్నారు. మరాఠీని శాస్త్రీయ భాషగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, భాష పరిరక్షణ, అభివృద్ధి కోసం ఎలాంటి ఆర్థిక సహాయం అందించడం లేదని ఆయన విమర్శించారు. ఉద్ధవ్ థాకరే పార్టీతో పొత్తు గురించి స్పందిస్తూ, మరాఠీ అంశమే తమ మధ్య పొత్తుకు ప్రధాన కారణమని రాజ్ థాకరే వెల్లడించారు. మహారాష్ట్రను బలోపేతం చేయడానికి ట్రంప్ వంటి వ్యక్తికి కూడా మద్దతు

ఇవ్వడానికి తాను సంకోచించనని ఆయన నొక్కి చెప్పారు. ఎన్నికలల్లో ఓడిపోయినప్పటికీ, మరాఠీ గుర్తింపు కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నానని ఆయన తెలిపారు. బాల్ థాక్రే అందించిన విలువలకు కట్టుబడి ఉన్నానని, తనను 'కట్టర్ మరాఠీ' అని పిలుస్తారని, ఆ విషయంలో తాను ఎప్పటికీ వెనక్కి తగ్గబోనని రాజ్ థాకరే తేల్చి చెప్పారు.

# నటుడు విజయ్‌కు సీబీఐ సమన్లు.. ప్రచార వాహనం సీజ్

- మొదటి పేజి తరువాయి

సంస్థ (సీబీఐ) ఆయనకు సమన్లు జారీ చేసింది. గతేడాది జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది మృతి చెందిన నేపథ్యంలో సీబీఐ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో భాగంగా విజయ్ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించిన బస్సును కూడా సీబీఐ అధికారులు తాజాగా స్వాధీనం చేసుకున్నారు. సభ జరిగిన రోజు వాహనం ప్రయాణ వివరాలు, అనుమతులు, సమయపాలన వంటి అంశాలను నిర్ధారించుకునేందుకు వాహనాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను కూడా ప్రశ్నించి వివరాలు సేకరిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) నిర్వహించిన బహిరంగ సభలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా జనం తరలిరావడం, జన నియంత్రణ ఏర్పాట్లలో వైఫల్యం కారణంగా తీవ్ర తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. నిష్పక్షపాత విచారణ కోసం ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి బదిలీ చేసింది.

అప్పటి నుంచి దర్యాప్తు ముమ్మరం చేసిన సీబీఐ, నవంబర్ 25న పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఇతర ముఖ్య నేతలను విచారించింది. డిసెంబర్ 4న కరూర్ జిల్లా కలెక్టర్ తంగవేలంను కూడా రెండు గంటల పాటు ప్రశ్నించి, సభకు ఇచ్చిన అనుమతులపై ఆరా తీసింది. ఇప్పుడు నేరుగా విజయ్‌ను విచారించడం ద్వారా సభ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై కీలక సమాచారం రాబట్టి, బాధ్యులను గుర్తించాలని సీబీఐ భావిస్తోంది.

# మహిళా ఐఏఎస్ ఆఫీసర్లపై అనుచిత.. అసభ్యకర ప్రచారం... మహిళా మంత్రి సీరియస్..




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారులపై అసభ్య, అనుచిత ప్రచారంపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళలపై ద్వేషం, అవమానంతో కూడిన ప్రచారానికి సమాజం మొత్తం వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరం ఉందని, మహిళల గౌరవం ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.తెలంగాణలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తోందని, అటువంటి పరిస్థితుల్లో మహిళా అధికారులను కించపరిచే వ్యాఖ్యలను, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రచారాన్ని సహించబోమని మంత్రి స్పష్టం చేశారు.మహిళలు ఉన్నత స్థాయికి చేరితే తట్టుకోలేని ఫ్యూడల్ మానసిక స్థితే.. దుష్ప్రచారాలకు కారణమంటూ... మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజాసేవలో నిమగ్నమైన మహిళా ఐఏఎస్ అధికారుల గౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని .. వారి వెనుక రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా నిలుస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. మహిళా అధికారులను దూషించి.. అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు.




# ప్రయాణమే పెద్ద పండగ

**హైదరాబాద్ పెన్ పవర్:** భాగ్యనగర వాసులు సంక్రాంతి పర్వదినాన్ని సొంతూళ్లలో జరుపుకొనేందుకు పయనమవడంతో దారులన్నీ బారులు తీరాయి. పిల్లలకు పండగ సెలవులు, ఉద్యోగులకు రెండు రోజుల వారాంతపు సెలవులు కలిసి రావడంతో ఉదయం నుంచే పల్లెబాట పట్టారు. దీంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారుల్లో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. శుక్ర, శనివారాల్లో సుమారు 3 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లినట్లు పోలీసుల అంచనా. పలు సిటీ సర్వీసులను విజయవాడ, వరంగల్, వికారాబాద్ తదితర జిల్లాలకు కేటాయించారు. దీంతో నగరవాసులు సరిపడా బస్సులు లేక ఇబ్బందులుపడ్డారు. బస్సుల సమాచారం తెలుసుకునేందుకు ఆర్టీసీ ‘గమ్యం’ యాప్‌ను లక్షల మంది వినియోగిస్తున్నారు. అయితే సంక్రాంతి వంటి కీలక సమయంలో ఈ యాప్ మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంత ప్రయత్నించినా ‘నో సిటీ సర్వీస్’ అనే ఎర్రర్ రావడంతో అసహనం వ్యక్తం చేశారు.






## ‘క్యూ’.. చుక్.. చుక్.. రైలు

శనివారం ఫలక్‌నుమా, విశాఖ, గోదావరి, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లతోపాటు అన్ని ప్రధాన రైళ్లలో ఇసుకేస్తే రాలనంతగా ప్రయాణికుల రద్దీ నెలకొంది. దీంతో రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నారు.

## విమాన టికెట్లకూ రెక్కలు

ప్రయాణికుల రద్దీని చూసి విమానయాన సంస్థలూ ఈ నెల 11 నుంచి 14 వరకు టికెట్ ధరలను ఒక్కసారిగా మూడింతలు పెంచేశాయి. ముఖ్యంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడ, విశాఖ, తిరుపతికి వెళ్లే విమానాల టికెట్ల ధరలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో విజయవాడ, వైజాగ్‌లకు రూ.2,500 నుంచి రూ.3,500 మధ్య ఉంటుండగా.. ఆదివారం ధర రూ.9 వేలు ఉంది. తిరుగు ప్రయాణంలోనూ ఇదే తరహాలో రేట్లు కనిపిస్తున్నాయి.

# విద్యా నగర్ కాలనీలో 4 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం..

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి

గత 2 సంవత్సరాలలో విద్యా నగర్ అభివృద్ధికి 12 కోట్ల రూపాయలు మంజూరు

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి ఒకటవ డివిజన్ విద్యానగర్ లో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి





**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 10** విద్యానగర్ కాలనీలో 4 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైయిన్ ల నిర్మాణం చేపట్టామని, వచ్చే సీజన్ నాటికి ఒక మీటర్ కూడా గ్యాప్ లేకుండా పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంత్రి, శనివారం ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి ఒకటవ డివిజన్ విద్యానగర్ లో పర్యటించి 4 కోట్ల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యానగర్ కాలనీలో 4 కోట్ల రూపాయలు విలువ గల 20 సిసి రోడ్లు, 13 సిసి డ్రైయిన్ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. విద్యానగర్ కాలనీ ఏర్పడి 10 నుంచి 15 సంవత్సరాలు గడిచినా గత పాలకులు గంపెడు కాంక్రీట్ అభివృద్ధి పనులు చేపట్టలేదని, ప్రజల ఆశీర్వాదంతో వచ్చిన ప్రజా ప్రభుత్వం గత 2 సంవత్సరాలలో 12 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు మంజూరు చేశామని అన్నారు.వచ్చే సీజన్ నాటికి ఒక మీటర్ ఖాళీ లేకుండా విద్యానగర్ కాలనీలో సిసి రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తామన్నారు. పేదలకు సంక్షేమం అందించడంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డులు జారీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూనే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. గ్రామాలు, పట్టణాలలో మౌళిక వసతుల కల్పన, సాగు నీరు, త్రాగునీటి సరఫరా పనులు ప్రాధాన్యతతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ 4 కోట్ల రూపాయల విలువ గల 3.2 కిమి సిసి రోడ్లు, 1.5 కిలో మీటర్ల డ్రైయిన్ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఖమ్మం ఒకటవ డివిజన్ లో 9 కోట్ల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని, సాచురేషన్ పద్ధతిలో డివిజన్ మొత్తం సిసి రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటవ డివిజన్ కార్పొరేటర్ తేజావత్ హుస్సేన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, ఆర్డీఓ నరసింహా రావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం అర్బన్ మండల తహసిల్దార్ సైదులు, మునిసిపల్ ఇంజనీర్లు, ఎన్పిడిసిఎల్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రాబోయే మూడు రోజులు వణుకుడే

## శీతల గాలులతో జనం అవస్థలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో శీతల గాలులు ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి నుంచి ఉదయం వరకు చలి పంజా విసురుతుంటే.. ఉదయం 8–11 గంటల మధ్య, తిరిగి సాయంత్రం 5–7 గంటల మధ్య శీతల గాలులు వణికిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పలుచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.9 డిగ్రీల సెల్సియస్, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో 7 డిగ్రీల సెల్సియస్ ఉండగా.. 12 జిల్లాల్లో 10 డిగ్రీల లోపు, ఎనిమిది జిల్లాల్లో 10.1–11 మధ్య, మిగిలిన జిల్లాల్లో 11.1–14 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. రాష్ట్రం వైపు తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి దిగువ స్థాయి గాలులు వీస్తుండటంతో రానున్న మూడు రోజుల్లో చలితో పాటు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణశాఖ తెలిపింది.




# హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపుతాం

**హుస్నాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో ఎప్పుడైనా జిల్లాల సరిహద్దుల మార్పులు, చేర్పులు చేపడితే హుస్నాబాద్ ప్రాంతాన్ని కరీంనగర్ జిల్లాలో తప్పకుండా కలుపుతామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో శనివారం అర్బన్ ఫారెస్ట్ పార్క్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాల పునర్విభజన సమయంలో ఇక్కడి ప్రజలు వద్దంటున్నా హుస్నాబాద్‌ను బలవంతంగా సిద్దిపేట జిల్లాలో కలిపారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో హుస్నాబాద్‌కు వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానికుల ఆకాంక్ష మేరకు ఈ ప్రాంతాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ప్రకటించారన్నారు. స్థానిక శాసనసభ్యుడిగా తాను ఈ విషయాన్ని ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.




# మోదీ ఫొటో పెట్టాల్సిందే

**హైదరాబాద్ పెన్ పవర్:** రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ఉచితంగా ఇచ్చే 5 కిలోల బియ్యంపై పూర్తి రాయితీ కేంద్రమే భరిస్తోందని, బియ్యం సంచులపై ప్రధాని మోదీ ఫొటో పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో నూతన సంవత్సరం డైరీని పార్టీ శ్రేణులు వెంకట్‌రెడ్డి, వేముల అశోక్, పరమేశ్వర్, ఎన్‌వీ సుభాష్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం రామచందర్‌రావు మాట్లాడుతూ.. ‘గ్రామీణ నిరుపేదలకు జీవనోపాధిని బలోపేతం చేసే ఉద్దేశంతో ‘వీబీ-జీ రామ్ జీ’ చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చింది. ఈ పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాజపాకు ప్రజల నుంచి ఆదరణ రాబోతోందని తెలిసి కాంగ్రెస్ భయపడుతోంది’ అని పేర్కొన్నారు. అనంతరం జరిగిన భాజపా లీగల్ సెల్ సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అనేకచోట్ల ఓటరు జాబితా తారుమారు చేస్తున్నారని, ఒకవర్గానికి మాత్రమే లబ్ధి చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని రామచందర్‌రావు ఆరోపించారు.

# క్రమశిక్షణ సమన్వయంతో ఐక్యంగా పనిచేస్తే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు సునాయాసం అవుతుంది





**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 10** అశ్వారావుపేట పేరాయిగూడెం గుర్రాలచెరువు గ్రామపంచాయతీలతో కలిపి నూతన మున్సిపాలిటీగా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రం అవతరించిన నేపథ్యంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు

ఈ సందర్భంగా అశ్వారావుపేట శ్రీ శ్రీ సత్యసాయి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు మున్సిపల్ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు

ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు ముఖ్యంగా పేద మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడుతున్న పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా పార్టీకి బలమైన మద్దతు ఏర్పడుతుందని తెలిపారు అలాగే కార్యకర్తల ఐక్యత క్రమశిక్షణ సమన్వయంతో కూడిన పని తీరే విజయానికి మూలమని పేర్కొన్నారు ప్రతి వార్డు స్థాయిలో బూత్ కమిటీలను బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందనే నమ్మకాన్ని కల్పించాలని అన్నారు నూతన మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అశ్వారావుపేట ప్రజల ఆశీర్వాదాలతో ఘన విజయం సాధిస్తామని ఎమ్మెల్యే గారు ధీమా వ్యక్తం చేశారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## బిట్స్ పిలాని యంగ్ అలుమ్ని అచీవర్స్ అవార్డు- 2026 అందుకున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





హైదరాబాద్ బిట్స్ పిలాని గ్లోబల్ సమ్మిట్ లో అలుమ్ని అచీవర్స్ అవార్డును జిల్లా కలెక్టర్ కు ప్రధానం చేసిన మంత్రి శ్రీధర్ బాబు









ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 10

ప్రపంచ స్థాయి విద్యా సంస్థ బిట్స్ పిలాని అందించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యంగ్ అలమ్నస్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ వై ఏ ఏ 2026 ను ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అందుకున్నారు. శనివారం హైదరాబాద్ క్యాంపస్ బిట్స్ పిలాన్ ఇన్స్టిట్యూట్ నందు జరిగిన గ్లోబల్ సమ్మిట్ లో యంగ్ అలమ్నస్ అచీవ్‌మెంట్ అవార్డ్ 2026 వై ఏ ఏ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర సమాచార, సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతులమీదుగా అందుకున్నారు. యువ వయసులోనే పరిపాలనా రంగంలో అసాధారణ ప్రతిభను ప్రదర్శిస్తూ, ప్రజాసేవలో నూతన ఆలోచనలతో కూడిన పాలన అందిస్తున్నందుకు గాను ఈ అరుదైన గౌరవానికి ఆయనను ఎంపిక చేసినట్లు బిట్స్ పిలాని అలుమ్ని రిలేషన్స్ కమిటి అధికారికంగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బిట్స్ పిలాని ప్రతి సంవత్సరం అత్యంత కఠినమైన ఎంపిక ప్రక్రియ ద్వారా కొద్ది మంది అలుమ్నీలకే ఈ అవార్డును ప్రదానం చేస్తుంది. విద్యాభ్యాసం పూర్తయ్యాక తక్కువ కాలంలోనే తమ రంగాల్లో విశేష విజయాలు సాధించి, సంస్థకు గర్వకారణంగా నిలిచిన అలుమ్నీలను గుర్తించి ఈ అవార్డును బిట్స్ పిలాని వారు అందిస్తున్నారు.

# మెరుగైన నైపుణ్యాలతోనే యువతకు అవకాశాలు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్







**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 10:** వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ పోతేనే యువత తమ భవిష్యత్తును అభివృద్ధి పథంలోకి తీసుకురాగలరని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.

శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో లెర్నెన్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే ఎంఆర్ఎఫ్ (మార్ఫ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి నాఫస్ స్కీమ్ ద్వారా అప్రెంటిస్‌షిప్ శిక్షణతో పాటు, రేన్ (మద్రాస్) లిమిటెడ్ సంస్థ ద్వారా సిఎంసి మిషన్లపై అప్రెంటిస్‌షిప్ మరియు బ్యాచిలర్ / డిప్లొమా ఇన్‌వోకేషనల్ కోర్సుల్లో రెండు సంవత్సరాల శిక్షణ కోసం నిర్వహించిన ఓరియెంటేషన్ & సెలక్షన్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నైపుణ్యాలు ఉంటేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించాలనే లక్ష్యంతోనే ఈ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అప్రెంటిస్‌షిప్ శిక్షణలో ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్ సౌకర్యం, 100 శాతం ప్లేస్‌మెంట్ సపోర్ట్ అందిస్తున్నట్లు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మల్టీ స్కిల్స్ అవసరమని, యువత నిరంతరం నేర్చుకునే దృక్పథాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. యువత తమ లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి అనుభవాలను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తాను పేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగానని తెలిపారు. తన తండ్రి ఐటీఐ చదివారని, కుటుంబంలో పెద్దగా చదువుకున్న వారు ఎవరూ లేరని అన్నారు. తాను ఈ స్థితికి చేరుకోవడానికి ఎన్నో పనులు చేశానని, ఎంతో కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఉంటాయని, వాటికి భయపడి ఒకేచోట కూర్చుంటే విజయం దక్కదని అన్నారు. కష్టాలను అధిగమించి ఓర్పుతో ముందుకు వెళ్లిన వారే విజయతీరానికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఈ అప్రెంటిస్‌షిప్‌లో మంచిగా శిక్షణ తీసుకొని, యువత ఉద్యోగాలను సాధించి జిల్లాకు, తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సెలక్షన్ ప్రోగ్రామ్‌కు హాజరుకాలేకపోయిన అభ్యర్థుల కోసం జనవరి 21న మరోసారి ట్రైనింగ్ & సెలక్షన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సెలక్షన్‌లో ఎంపిక కాలేకపోయినా అభ్యర్థులు నిరాశ చెందకుండా, మరింతగా ప్రిపేర్ అయి భవిష్యత్తులో ఇంకా మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 107 మంది యువకులు హాజరుకాగా, వీరిలో 92 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించి, వారిలో 57 మందిని వివిధ ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇందులో మార్ఫ్. కంపెనీకి 39 మంది, రనే(మద్రాస్ లిమిటెడ్ కంపెనీకి 14 మంది,టైచి కంపెనీకి 4 మంది యువకులు ఎంపికయ్యారని తెలిపారు. మార్ఫ్ కంపెనీలో శిక్షణ కాలంలో మొదటి సంవత్సరంలో నెలకు రూ. 17,500, రెండో సంవత్సరంలో రూ. 18,500, మూడో సంవత్సరంలో రూ. 19,500 స్టైపెండ్ అందజేయబడుతుందని తెలిపారు. ఇందులో వసతి సౌకర్యం కోసం రూ. 1,000, క్యాంటీన్ సదుపాయం కోసం రూ. 350, బస్ సౌకర్యం కోసం రూ. 500గా మొత్తం రూ. 1,850 మినహాయించి మిగిలిన మొత్తాన్ని స్టైపెండ్ రూపంలో యువతకు చెల్లించబడుతుందని వివరించారు. రానే (మద్రాస్) కంపెనీ వారు శిక్షణ కాలంలో మొదటి సంవత్సరంలో నెలకు రూ. 15,200, రెండో సంవత్సరంలో రూ. 16,200 స్టైపెండ్ అందజేస్తారని, శిక్షణ పూర్తయిన అనంతరం ఎంపికైన యువతకు ప్రారంభ జీతంగా నెలకు రూ. 22,000 చెల్లించబడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్ఫ్ కంపెనీ సూపర్‌వైజర్ అమృత్ రాజు, రానే మద్రాస్ కంపెనీ నుండి రిక్రూట్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ బిస్వజిట్ ఖుంటియా, సెర్ప్ నుండి బి.నీలయ్య, ఏపిఎం లు ఎల్.వెంకయ్య, జి. ప్రసాద్ రెడ్డి, ఏ. నాగేశ్వర రావు, ఈ.డి.యం కలెక్టరేట్ టెక్నికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్య నాయకులతో భేటీ అయిన కేటీఆర్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులుతో, సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.





**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 10** రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల సన్నద్ధత పై ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు మరియు పార్టీ సీనియర్ నేత, శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు దిశానిర్దేశం చేశారు ఉమ్మడి ఖమ్మం నాయకులతో కలసి ఈ సమావేశంలో భాగంలో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు పాల్గొన్నారు

## నూతనంగా ఎన్నికైన సర్పంచులు అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి విజయవంతం అవుతుంది





**ఉమ్మడిఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 10** ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈ దమ్మపేట మండల కేంద్రంలో జరుగుతున్న సెంటర్ లైటింగ్ పనులను పరిశీలించారు ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండేందుకు సెంట్రల్ లైటింగ్ పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు అదేవిధంగా ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి ఆధ్వర్యంలో గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు

అనంతరం బాలరాజుగూడెం గ్రామంలో కీసరి కిరణ్ ప్రమీల దంపతుల కుమార్తె నాగచైత్ర నూతన వస్త్రాలంకరణ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## భద్రాద్రి కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలని ఘనంగా సన్మానించిన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత రావు



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 10:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులుగా తోట దేవి ప్రసన్న నియమితులైన సందర్భంగా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీత రావు శాలువా మరియు పూల బుకేతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమం ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హెడ్ క్వార్టర్‌లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీత రావు మాట్లాడుతూమహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను విజయవంతంగా అమలు చేయడంలో మహిళా కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలన్నారు. అదే విధంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించిన బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మహిళలు అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ కమిటీ సభ్యులు, నూతన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పంజాగుట్ట దుర్గ భవాని ఆలయంలో కేంద్రమంత్రి బండి పూజలు



**హైదరాబాద్:** హైదరాబాద్ పంజాగుట్టలోని శ్రీ దుర్గ భవాని దేవాలయంలో కొలువైన పరమ శివుడికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహాశివుడి 12 జ్యోతిర్లింగ క్షేత్రాల్లో మొట్టమొదటిదైన గుజరాత్ సోమ్ నాథ్ పై దాడి జరిగి ఈ ఏడు వెయ్యేళ్లు అవుతుంది. వెయ్యేళ్లుగా అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్న ఈ మహిమాన్విత క్షేత్రం భారత అధ్యాత్మికత, నాగరికత, వారసత్వ వైభవోపేతానికి సజీవ సాక్షిగా నిలబడింది. అంతేకాదు, ఈ ఆలయ పునర్నిర్మాణం జరిగి ఈ ఏడాది 75 సంవత్సరాలు అవుతుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ ఏడాదిని 'సోమనాథ్ స్వాభిమాన పర్వం'గా ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి పూజలు నిర్వహించారు.

## ఉపాధీ హామీ పథకం పేరు మార్పు దారుణం

**హైదరాబాద్ పెన్ పవర్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చిన కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 20 నుండి పది రోజులపాటు సికింద్రాబాద్ లోని పలు ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివిధ కార్యక్రమాల ద్వారా నిరసన చేపట్టనున్నట్లు వెల్లడించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి వి బి జి రాం జీ పేరుతో చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. గ్రామీణ ప్రజల కోసం 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాన్ని ప్రజల నుండి దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త కుట్రకు తెరలేపిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా మహాత్మా గాంధీ పేరును తొలగించిందని ఆరోపించారు. ప్రజల హక్కులను కాలరాస్తూ, బడుగు బలహీన వర్గాలకు భంగం కలిగే విధంగా ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చి తీరని అన్యాయం చేస్తుందని అన్నారు. గ్రామసభ, ప్రజల అభీష్టం మేరకు కాకుండా కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లను నియమించి వారికి అనుగుణంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. నూతన చట్టాన్ని తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దుచేసి పాత చట్టాన్ని అమలుపరిచే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

## శనకానికి చేప చర్మంతో ఆరుదైన సర్జరీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఓ కుక్కకు చేప స్కిన్ తో అరుదైన సర్జరీని వెటర్నరీ డాక్టర్లు విజయవంతంగా పూర్తి చేశారు. స్కిన్ గ్రాఫ్టింగ్ టెక్నీక్ తో కుక్క కాలిన చర్మం స్థానంలో తలాఫియా ఫిష్ స్కిన్ తో రీప్లేస్ చేసి , కుక్కకు కొత్త జీవితాన్ని ఇచ్చారు. 50శాతం కాలిన గాయాలతో తీవ్ర అస్వస్థత గురై బాధపడుతున్న గోల్డీ అనే పెంపుడు కుక్కకు చికిత్సను విజయవంతంగా నిర్వహించడం భారతీయ పశువైద్యంలో ఒక నూతన ఆవిష్కరణ అని వెటర్నరీ డాక్టర్ వెంకట్ అన్నారు. తెలంగాణలో మొదటి శాస్త్ర ప్రయోగం విజయవంతం అవ్వడం పట్ల ఈ చికిత్స కు సంబంధించిన వివరాలను బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ వెంకట్ యాదవ్, డా. షిరీన్ షెరీన్ లు వెల్లడించారు. నగరంలో ఈసీఐఎల్ చెందిన కుక్క సంరక్షకుడు రాఘవ గత ఏడాది అక్టోబర్ లో కాలిన గాయాలతో ఉన్న గోల్డీను తమ హాస్పిటల్ కు తీసుకొచ్చారని తెలిపారు. మూడు నెలల వ్యవధిలో వైద్య పరీక్షల చేసి పెట్ ప్రాణాన్ని కాపాడినట్లు వారు తెలిపారు. వినూత్నంగా అత్యాధునిక పునరుత్పత్తి పద్ధతులను అవలంబించి ప్రాసెస్ చేయబడిన తలాఫియా చేప చర్మాన్ని కుక్క గాయపడిన ప్రాంతాలపై (అంటుకట్టే విధానంతో) అమర్చినట్లు వివరించారు. ఈ చర్మ వైద్యాన్ని వేగవంతం చేయడంతోపాటు నొప్పిని తగ్గించి ఇన్ఫెక్షన్ను నివారిస్తుందని పేర్కొన్నారు. తద్వారా సహజ కణజాల పునరుత్పత్తికి దోహదపడుతుందని చెప్పారు. సహజ కొల్లాజెన్, ఒమేగా కొవ్వు ఆమ్లాలు బయో యాక్టివ్ సమ్మేళనాలతో సమృద్ధిగా ఉన్న ఈ చేప చర్మం తాత్కాలిక చర్మ ప్రత్యామ్నాయంగా పనిచేస్తుందని తెలిపారు. ఇప్పుడు కుక్క పూర్తి ఆరోగ్యంగా ఉందని... చర్మం సహజంగా ఉందన్నారు.

## కొర్రెముల ఏకశిలా వెంచర్ లో ఉద్రిక్తత

**మేడ్చల్: పెన్ పవర్:** ఘట్కేసర్ మండల రెవెన్యూ పరిధి కొర్రెముల లోని ఏకశిలా వెంచర్ లో మరోసారి ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది..1985లో వేసిన ఏకశిలా లేఅవుట్ లో వందలాది మంది మధ్యతరగతి ప్రజలు కొన్న ప్లాట్లపై కన్నేసి, అధికారుల అండతో సర్వే చేసేందుకు కబ్జాదారుడు ప్రయత్నించడంతో ప్లాట్ ఓనర్లు ఏకశిలా వెంచర్ వద్దకి వచ్చి ఆందోళన చేపట్టారు.ఏకశిలా వెంచర్ ప్లాట్ ఓనర్లకు, ఏకశిలలో భూములు కొన్న వెంకటేష్ కి మధ్య భూ తగాదాలు గత కొన్ని సంవత్సరాలుగా నడుస్తున్నాయి.

ఈ విషయంలో గతంలో ఎంపీ ఈటెల రాజేందర్ జోక్యం చేసుకొని ప్లాట్ ఓనర్లకు మద్దతుగా నిలిచి వెంకటేష్ అనుచరులపై చేయించుకున్నారు. కేసులు కూడా జరిగాయి. చట్టబద్ధంగా కొనుక్కున్న భూముల్లో అక్రమంగా సర్వే చేయడం ఏంటని ప్రశ్నించిన ప్లాట్లు కొన్న బాధితులు..కొర్రెముల పరిధిలోని సర్వే నంబర్లు 739 నుండి 749 వరకు ఉన్న సుమారు 10 సర్వే నంబర్లలో 1985లోనే ఏకశిలా లేఅవుట్ ఏర్పాటైంది. అప్పటి నుంచి వందలాది మంది మధ్యతరగతి ప్రజలు ప్లాట్లు కొని నేడు రోడ్డున పడ్డారు. తాజాగా వ్యవసాయ భూమిగా ఈ భూముల్లో ఏడి సర్వే నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ప్లాట్ ఓనర్లు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పనులను అడ్డుకున్నారు. ఈ భూమి అగ్రికల్చర్ ల్యాండ్ కాదని, ఇది రెసిడెన్షియల్ లేఅవుట్ అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇప్పటికే స్పష్టం చేసినట్లు తెలుస్తుంది. వెంకటేష్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కొంతమంది అధికారుల అండదండలతో విషయంలో ఈ విలువైన భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా నలుగుతున్న ఈ వివాదంపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి, అమాయక ప్లాట్ ఓనర్లకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు..

## నాచారం రాఘవేంద్ర నగర్ లో ముగ్గుల పోటీలు

**నాచారం: పెన్ పవర్:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గం నాచారం రాఘవేంద్ర నగర్ లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. హైదరాబాద్ నాచారం రాఘవేంద్ర నగర్ లో ఉప్పల్ బిజెపి మహిళ మోర్చా కన్వీనర్ అంబాల అనితారెడ్డి సమీక్షంలో నాచారం డిజన్ ప్రధాన కార్యదర్శి ఉదయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి సాంప్రదాయాన్ని గుర్తు చేసుకుంటూ సంక్రాంతి పండుగను అంటే రంగుల పండుగ అని మహిళలు వేసిన ముగ్గులు అందర్నీ ఆకట్టుకున్నారు. మొదటి ముగ్గురికి బహుమతులు అందజేశారు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే మేఘ రెడ్డి

**వనపర్తి. పెన్ పవర్:** నేడు ఇందిరమ్మ రాజ్యంలో సామాన్యులకు అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.దీ=ూ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.పెబ్బేరు మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డిలు.నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్క నిరుపేదకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం పెబ్బేరు పట్టణంలోని =ూం గార్డెన్స్ లో నిర్వహించిన మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డి తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పెబ్బేరు పట్టణంలోని 12 వార్డులకు సంబంధించిన నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ విజయభావుటను ఎగురవేయాలని వారు సూచించారు.చిన్న చిన్న మనస్పర్ధలతో ఎవరికివారు ముందుకెళ్తే నష్టపోతామని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని వారు సూచించారు.పొరపాటున ఎవరైనా గెలిస్తే వారు కుర్చీలో కూర్చొని ఉన్నప్పుడు మనం కిటికీలోంచి చూడాల్సిన పరిస్థితి వస్తుందని దానిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు.పెబ్బేరు మండలం ఆసియా ఖండంలోనే



పేరెన్నిక మండలమని కోట్ల రూపాయల ఆదాయం వచ్చే సంత ఉందని అలాంటి సంతను కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కొందరి ప్రయత్నాలను తిప్పుకొట్టి త్వరలోనే తిప్పికొట్టి కోట్ల రూపాయ విలువచేసే సంతా భూమిని కాపాడుకుందామని వారు అన్నారు.రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో పెబ్బేరు మునిసిపాలిటీలోని 12 వార్డులకు 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయకేతనం ఎగురవేశాల అందరు కలిసికట్టుగా పని చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి , ధనలక్ష్మి, పెబ్బేరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకట్రాములుయాదవ్, దయాకర్ రెడ్డి, రాజశేఖర్, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, సత్యం, పెబ్బేరు మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణమే పెద్ద పండగ

**హైదరాబాద్-విజయవాడ హైవేపై కిటకిట**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీని చూస్తే భాగ్యనగరం ఖాళీ అవుతోందా అన్నట్టుంది. నాలుగైదు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా నుంచి శుక్రవారం రాత్రి 12 నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు దాదాపు 21 వేలు, శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 22 వేల వరకు వాహనాలు విజయవాడ వైపు ప్రయాణించినట్లు సిబ్బంది చెప్పారు. ఈ లెక్కన గంటకు సుమారు 2,700 వాహనాలు వెళ్తున్నాయి. సాధారణ రోజుల్లో రెండు వైపులా కలిపి దాదాపు 40 వేల వాహనాలు వెళ్తాయి. గతేడాది ఎదురైన రద్దీ అనుభవాల దృష్ట్యా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. చిట్యాలలో పనులు చేస్తున్న దారిపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి దానిపై నుంచి వాహనాలను పంపిస్తున్నారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం వైపు వెళ్లాల్సిన వాహనాలను సూర్యాపేట మండలం టేకుమట్లలోని సూర్యాపేట-ఖమ్మం 365బీబీ హైవే వైపు మళ్లించారు. సూర్యాపేట ఎస్పీ నరసింహ, డీఎస్పీ ప్రసన్నకుమార్ డ్రోన్ కెమెరాతో రహదారిపై వాహనాల వేగాన్ని, రద్దీని పర్యవేక్షిస్తున్నారు. సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని ఎస్పీ నరసింహ.. గులాబీ పువ్వులు ఇచ్చి వాహనదారులకు శుభాకాంక్షలు చెప్పారు.

**విజయవాడ హైవేపై ఏదైనా సమస్యా?**

**1033కి ఫోన్ చేస్తే తక్షణ పరిష్కారం**

సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి రద్దీగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో వాహనం అకస్మాత్తుగా ఆగిపోయినా, రోడ్డు ప్రమాదం జరిగినా, ఇంధనం అయిపోయినా, టైరు పంక్చరైనా వెంటనే 1033 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే పరిష్కారం లభిస్తుంది. రోడ్డు ప్రమాదం జరిగితే వెంటనే ఘటనాస్థలికి అంబులెన్సును పంపించి క్షతగాత్రులను

సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తారు. రోడ్డుపై అడ్డంగా వాహనం నిలిచిపోతే క్రేన్ సాయంతో పక్కకు తరలిస్తారు. మార్గం మధ్యలో వాహనంలో ఇంధనం అయిపోతే పెట్రోలింగ్ వాహన సిబ్బంది 5 లీటర్ల పెట్రోల్ లేదా డీజిల్ తెచ్చి ఇస్తారు. ఇంధనం ధరను వాహనదారుడు చెల్లించాల్సి ఉంటుంది. వాహనం టైరు పంక్చరైనా సిబ్బంది సహాయసహకారాలు అందిస్తారు. ఈ సేవలన్నీ ఉచితంగానే లభిస్తాయి. వాహనదారుడు 1033కు ఫోన్ చేసిన 20-25 నిమిషాల్లోపే ఘటనా స్థలికి పెట్రోలింగ్, రెస్క్యూ సిబ్బంది చేరుకుని సమస్యను పరిష్కరిస్తారు. ఈ టోల్ ఫ్రీ నంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

# ప్రేమాయణం కథనాలపై ఐఏఎస్ అధికారుల ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో, అధికార వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న ఓ టీవీ వార్తా కథనంపై అటు ఐఏఎస్ అధికారుల సంఘం, ఇటు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రంగా స్పందించారు. ఒక రాష్ట్ర మంత్రికి , ఒక మహిళా ఐఏఎస్ అధికారికి మధ్య ప్రేమాయణం సాగుతోందంటూ ప్రముఖ వార్తా సంస్థ ప్రసారం చేసిన కథనంపై తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ మేరకు సంఘం ఒక బహిరంగ లేఖను విడుదల చేస్తూ, సదరు వార్తా సంస్థ యాజమాన్యం తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఎంతో కష్టపడి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన మహిళా అధికారుల పట్ల ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని, ఇది అత్యంత గర్హనీయమని సంఘం పేర్కొంది.మంత్రి సిఫార్సుతోనే సదరు మహిళా అధికారికి ప్రత్యేక పోస్టింగ్‌లు లభించాయన్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఐఏఎస్ అధికారుల సంఘం స్పష్టం చేసింది. అధికారుల బదిలీలు మరియు పోస్టింగ్‌లు పూర్తిగా పరిపాలనాపరమైన నిర్ణయాలని, వాటికి వ్యక్తిగత సంబంధాలను ఆపాదించడం జర్నలిజం నైతికతకే విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేసింది. నైతికత లేని ఇలాంటి జర్నలిజం వల్ల సివిల్ సర్వెంట్లకు మరియు సమాజానికి చెడ్డ పేరు వస్తుందని, వెంటనే ఆ కథనాన్ని వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని ఆ చానల్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఆరోపణలు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కూడా ఇబ్బంది పెట్టాయి. ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నన్ను ఏమైనా అనండి, నాపై రాజకీయ విమర్శలు చేయండి.. కానీ ఒక మహిళా అధికారిని ఈ వివాదంలోకి లాగి ఆమె పరువు తీయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారులను బదిలీ చేసే అధికారం కేవలం ముఖ్యమంత్రికి మాత్రమే ఉంటుందని గుర్తు చేస్తూ, తన కొడుకుని కోల్పోయిన బాధలో ఉన్న తనను , తన కుటుంబాన్ని ఇలాంటి అసత్య కథనాలతో మరింత వేదనకు గురిచేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారుతెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన చరిత్ర తనదని, అద్దె ఇంట్లో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న తనపై ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయడం దురదృష్టకరమని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయాను.. ఇప్పటికైనా ఇలాంటి రాతలు ఆపండి, పైన దేవుడు ఉన్నాడు అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ఈ వివాదం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

**వైరల్ కథనాలపై చర్యలు తప్పవు**

తెలంగాణలోని పలువురు ఐఏఎస్‌లపై వస్తున్న వార్తలను ఐఏఎస్‌ల అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. నిరాధారమైన వాటిని ప్రసారం చేయడం సరికాదని దీని వల్ల అధికారుల ఆత్మ గౌరవానికి భంగం వాటిల్లుతుందని అభిప్రాయపడింది. మహిళా అధికారుల పోస్టింగ్స్, వారి వ్యక్తిగత జీవితాలపై వస్తున్న కథనాలను పూర్తిగా ఖండిస్తున్నట్టు పేర్కొంది. ఇలాంటి వాటిని ప్రసారం చేసినవారిపై, సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం సర్క్యులేట్ అవుతున్న వాటిని తొలగించాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణారావు, కార్యదర్శి జయేష్ రంజన్ పేరుతో ఓ ప్రకటన విడుదలైంది. ఇందులో చాలా అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో ఐఏఎస్ అధికారులను టార్గెట్ చేస్తూ వస్తున్న వార్తలు తీవ్రంగా బాధిస్తున్నాయని వెల్లడించారు. అధికారుల వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చేస్తున్న తప్పుడు ప్రసారం కారణంగా ప్రజల్లో చులకనభావన ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అధికారుల పని తీరుపై కూడా ప్రభావం చూపుతుందనే ఆందోళన ఈ ప్రెస్‌నోట్‌లో కనిపిస్తోంది. మహిళా అధికారులను కావాలనే టార్గెట్ చేస్తున్నట్టు అనిపిస్తోందని ఇది మంచిది కాదని హితవుపలికారు. తమ విధి నిర్వాహణలో చాలా నిబద్ధతో పని చేస్తున్నారని ప్రజలకు మేలు చేయాలని ఆలోచనతో ఉన్నారని స్పష్టం చేశారు. అలాంటి వారిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ వార్తలు రాయడం , వార్టి పోస్టింగ్స్‌పై అపోహలు సృష్టించడం సరికాదన్నారు.

ఇలాంటి వ్యక్తిగత ఉల్లంఘన కిందికి వస్తాయని హెచ్చరించారు. ఇందులో మహిళలను కించపరిచేలా నెరేషన్ ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటివి రాసేటప్పుడు వారి వాదన కూడా వినకుండానే ఇష్టం వచ్చినట్టు ప్రసారం చేస్తున్నారని దీన్ని అసోషియేషన్ ఖండిస్తుందని అన్నారు. ఇలాంటివి తప్పుడు వార్తల ప్రసారం చేయడం, వాటిని వైరల్ చేయడం వల్ల సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్తాయని అసోసియేషన్ అభిప్రాయపడింది. అందుకే వెంటనే వాటిని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఇప్పుడు ఈ కంటెంట్‌ను ప్రసారం చేసిన వారిపై, వైరల్ చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. న్యాయపోరాటం చేస్తామని అన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటివి ప్రసారం చేసిన వాళ్లు షేర్ చేసిన వాళ్లకు న్యాయపరమైన చిక్కులు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.

# బెట్టింగ్ ఎస్ ఐ అరెస్ట్..

**హైదరాబాద్ పెన్ పవర్:**

సమాజంలో శాంతిభద్రతలను కాపాడవలసిన చేతులే నేరాలకు పాల్పడితే. రక్షణ కవచమే భక్షిస్తే ఏమవుతుందో అంబర్‌పేట ఎస్సై భాను ప్రకాష్ రెడ్డి ఉదయం నిరూపిస్తుంది. ఒక బాధ్యతాయుతమైన పోలీసు అధికారిగా ఉండి, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన స్థానంలో కూర్చొని, స్వయంగా దొంగతనాలకు, అక్రమాలకు పాల్పడి నేడు చంచల్‌గూడ జైలు ఊచలు లెక్క పెడుతున్న పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లోనే సంచలనంగా మారింది. ఈ కేసులో వెలుగు చూస్తున్న నిజాలు పోలీసు శాఖను సైతం విస్మయానికి గురి చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో కీలకమైన అంశం బెట్టింగ్. భాను ప్రకాష్ రెడ్డి గత కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైనట్టు ప్రాథమిక విచారణలో తేలింది. జూదం కారణంగా చేసిన అప్పులు తీర్చుకోవడానికి ఆయన ఒక అత్యంత దారుణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. వివిధ కేసుల్లో పోలీసులు రికవరీ చేసిన నగదు, బంగారాన్ని బాధితులకు లేదా కోర్టుకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ ఆయన తన సొంతానికి వాడుకున్నాడు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయకుండా లేదా తప్పుడు లెక్కలు చూపిస్తూ, వాటిని బయట తాకట్టు పెట్టి, అప్పులు తీర్చుకోవడానికి ప్రయత్నించాడు. రక్షక భటుడు దొంగగా మారిన ఈ తీరుపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. భాను ప్రకాష్ రెడ్డిపై ఉన్న మరో ప్రధాన ఆరోపణ సర్వీస్ రివాల్వర్ అదృశ్యం. పోలీసులకు ప్రభుత్వం ఇచ్చే ఆయుధం అత్యంత పవిత్రమైంది. బాధ్యతాయుతమైంది. అయితే తన రివాల్వర్‌ను భాను ప్రకాష్ రెడ్డి పోగొట్టుకున్నాడు. ఇది పోలీసుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. మొదట పోలీసు విచారణలో ఆయన పరస్పర విరుద్ధమైన స్టేట్‌మెంట్‌లు ఇచ్చినట్టు తెలుస్తోంది. రైలులో ప్రయాణిస్తున్న సమయంలో తన గన్ ఎక్కడో పడిపోయిందని ఆయన అధికారులకు చెప్పాడు. అయితే ఆ గన్ కోసం ఎంత వెతికినా ఆ ఆచూకీ లభించలేదని ఆయన స్వయంగా అంగీకరించాడు. అసలు ఆ గన్ నిజంగానే పోయిందా, లేదా దాన్ని కూడా ఎక్కడైనా తాకట్టు పెట్టారా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల విచారణలో భాను ప్రకాష్ రెడ్డి అక్రమాలు ఆధారాలతో నిరూపణ అయ్యింది. దీంతో వెంటనే పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అత్యంత విషాదకరమైన, విస్మయకరమైన మలుపు ఆయన కెరీర్, భాను ప్రకాష్ రెడ్డి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన గ్రూప్ -2 పరీక్షలల్లో ఉత్తీర్ణత సాధించి, మంచి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తెలంగాణ పోలీసు శాఖ నుంచి రిలీవ్ అయి, ఏపీలో కొత్త హోదాలో చేరాలని ఆయన ఇప్పటికే ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఒక గౌరవప్రదమైన హోదా నుంచి అంతకంటే మెరుగైన హోదాలోకి వెళ్లాల్సిన వ్యక్తి కేవలం బెట్టింగ్ వ్యసనం వల్ల జీవితాన్ని చేతులారా నాశనం చేసుకున్నాడు. ఇప్పుడు అరెస్టు కావడంతో ఆయన కొత్త ఉద్యోగం వచ్చే అవకాశం దాదాపుగా మూసుకుపోయినట్టే.

# మంత్రుల ప్రేమ వ్యవహారం...

**హైదరాబాద్, జనవరి 10, పెన్ పవర్:**
10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అలాగని జనాలు వన్ సైడ్ విక్టరీని కాంగ్రెస్ పార్టీకి అందించలేదు. గులాబీ పార్టీ బలమైన ప్రతిపక్షంగా ఇప్పటికీ ఉంది. పార్లమెంటు ఎన్నికల్లో 0 సీట్లు వచ్చినప్పటికీ.. సర్పంచ్ ఎన్నికలలో సత్తా చూపించలేకపోయినప్పటికీడ సోషల్ మీడియాలో మాత్రం కాంగ్రెస్ పార్టీ గులాబీ పార్టీ కంటే అత్యంత బలంగా ఉంది. వాస్తవానికి ఈ విషయంలో రేవంత్ రెడ్డి ఒక విఫల ముఖ్యమంత్రి. ఇక మిగతా మంత్రుల సంగతి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.నేటి కాలంలో సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ఆరోపణకు అధికార పార్టీ నుంచి కౌంటర్ ఉండాల్సిందే. అవసరమైతే ఆ కౌంటర్ చాలా సాలిడ్ గా ఉండాలి. దీనికోసం అనేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వం నుంచి అమలవుతున్న పథకాలను పకడ్బందీగా ప్రచారం చేసుకోవాలి. అదే సమయంలో గులాబీ పార్టీ చేసే విష ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి. కానీ ఇది అధికార కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చేతకావడం లేదు. పైగా ఆ పార్టీ సోషల్ మీడియా వింగ్ అత్యంత దారుణమైన ప్రదర్శన చేస్తోంది. కౌంటర్ ఇవ్వడం కాదు కదా కనీసం.. తనను తాను కాపాడుకోవడం కూడా ఆ పార్టీకి, ఆ ఆ పార్టీ సోషల్ మీడియాకు ఏమాత్రం చేతకావడం లేదు.తాజాగా గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియా తెలంగాణ మంత్రుల మీద విష ప్రచారం మొదలుపెట్టింది. ఏకంగా ఆ మంత్రులు తమ స్థాయిని మర్చిపోయి, తమ వయసును మర్చిపోయి ప్రేమ వ్యవహారాలు సాగిస్తున్నారని బాంబు పేల్చింది. ఇటీవల సెక్రటేరియట్లో ఓ అధికారి షాడో గా వ్యవహరిస్తున్నారని..
పై స్థాయిలో అండదండలు ఉండడంతో క్యాబినెట్ స్థాయిలో ప్రోటోకాల్ ఇస్తున్నామని చెబుతున్నారని రాజ్ టీవీ ఒక సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. దానిని మర్చిపోకముందే ఎన్టీవీ నల్గొండకు సంబంధించిన ఓ మంత్రికి వ్యవహారాన్ని కథనం రూపంలో ప్రసారం చేసింది. నల్గొండ జిల్లా చెందిన ఓ మంత్రి.. ఓ కలెక్టర్ విషయంలో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించారని.. ఆమెతో ప్రేమ వ్యవహారం కూడా సాగించారని.. ఎన్టీవీ ఆ కథనంలో
ప్రసారం చేసింది. అయితే ఆ ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి ఆ కలెక్టర్ ను ప్రభుత్వం బదిలీ చేయించిందని ఎన్ టీవీ ప్రసారం చేసిన కథనంలో పేర్కొంది.రాజ్ టీవీ, ఎన్ టివి ప్రసారం చేసిన కథనాలను గులాబీ పార్టీ సోషల్ మీడియా తనకు అనుకూలంగా మార్చుకుంది. ఈ కథనాలకు కాస్త మసాలా జోడించి ఆ పార్టీ సోషల్ మీడియా అడ్డగోలుగా ప్రచారం చేయడం మొదలుపెట్టింది. తెలంగాణ రాష్ట్రంలో మంత్రులు ప్రేమ వ్యవహారాలలో మునిగి
తేలుతున్నారని.. ఏకంగా సెక్రటేరియట్లో ఓ అధికారి తనకు పై స్థాయి అండ ఉందని ప్రచారం చేసుకుంటున్నారని.. అందువల్లే అధికారులు ఆమెకు క్యాబినెట్ స్థాయి ప్రోటోకాల్ ఇస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.మరోవైపు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ మంత్రి మహిళా అధికారులను వేధిస్తున్నారని.. కనీసం సీనియర్ మహిళా విలేకరులను కూడా వదిలిపెట్టడం లేదని.. ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవాలు ఎలా ఉన్నప్పటికీ గులాబీ పార్టీ సోషల్ మీడియా మాత్రం విపరీతంగా ప్రచారం మొదలుపెట్టింది. మరి దీనికి కాంగ్రెస్ పార్టీ ఎలాంటి కౌంటర్ ఇస్తుంది? అనే ప్రశ్నకు ఇప్పుడు సమాధానం లభించాల్సి ఉంది.

# కమలం వైపు.. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు



**నల్గొండ, జనవరి 10, పెన్ పవర్:**
రాబోయే ఎన్నికల వరకు మరింత బలపడి అధికారంలోకి రావాలని కలలు కంటున్న కమలనాథులు..దక్షిణ తెలంగాణలో పేరున్న నేతలను పార్టీలో చేర్చుకోవాలని భావిస్తున్నారట. ఇందులో భాగంగా నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఫోకస్ పెట్టిందట బీజేపీ. ఆ ఇద్దరు కూడా గతంలో బీజేపీలో పనిచేసిన ఎమ్మెల్యేలే అంటూ గాసిప్స్ చక్కర్లు కొడుతున్నాయ్.ఉత్తర తెలంగాణలో బీజేపీ స్ట్రాంగ్‌గా ఉంది. నార్త్ తెలంగాణలో మూడు ఎంపీ సీట్లు, ఏడు ఎమ్మెల్యే సీట్లు గెలుచుకున్న కమలనాథులు..గ్రాడ్యుయేషన్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్నారు. మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లోనూ ఉత్తర తెలంగాణలో గతం కంటే ఎక్కువ స్థానాలే గెలుచుకున్నారు.దక్షిణ తెలంగాణలో ఒకరిద్దరు మినహా.. బీజేపీకి పెద్దగా పట్టున్న లీడర్లు లేరన్న అభిప్రాయం ఉంది. పైగా క్యాడర్ కూడా స్ట్రాంగ్ లేదని భావిస్తున్నారట. ఈ క్రమంలో దక్షిణ తెలంగాణలో కాస్త పేరున్న, ప్రజాబలం ఉన్న లీడర్లను..చేర్చుకుంటే..రాబోయే ఎన్నికల్లో సత్తా చాటొచ్చని ప్లాన్ చేస్తున్నారట. తెలంగాణలో అధికారంలోకి
రావాలంటే..దక్షిణ తెలంగాణ జిల్లాలైన నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో కూడా బలపడాలని లెక్కలు వేసుకుంటున్నారట కాషాయ నేతలు.ఈ క్రమంలో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఫోకస్ పెట్టారట బీజేపీ లీడర్లు. దక్షిణ తెలంగాణకు చెందిన ఇద్దరు శాసనసభ్యులు..బీజేపీ స్టేట్ లీడర్లతో టచ్‌లో ఉంటున్నారట. నల్లగొండకు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే, పాలమూరుకు చెందిన మరో హస్తం పార్టీ ఎమ్మెల్యే..కొన్ని రోజులుగా వాళ్ల సొంత పార్టీ పెద్దలపై అసంతృప్తిగా ఉన్నారట. అడిగిన పనులు చేసి పెట్టడం లేదని..కోరుకున్న పదవులు ఇవ్వట్లేదని నిరుత్సాహంగా ఉన్నారట.ఈ క్రమంలోనే వాళ్లు అప్పుడప్పుడు సొంత పార్టీపై, సీఎం రేవంత్‌పై అసంతృప్తి గళం వినిపిస్తున్నారట. అలా కాంగ్రెస్ పార్టీలో కంఫర్ట్‌గా లేని
ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపైన కన్నేసిన కమలనాథులు తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారట.హైదరాబాద్ జంట నగరాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ బీజేపీ ఎంపీ.. దక్షిణ తెలంగాణకు చెందిన మరో బీజేపీ మహిళా నాయకురాలు.. ఆ ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు టచ్‌లోకి వెళ్లినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.హస్తం పార్టీలో అసంతృప్తిగా ఉన్న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలతో.. తమకు ఉన్న సాన్నిహిత్యం, పరిచయాలతో కమలం గూటికి చేర్చే ప్రయత్నం చేస్తున్నారట. అయితే బీజేపీలోకి ఎవరైనా వస్తే పార్టీ సంప్రదాయం ప్రకారం వారు పార్టీతో పాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రావాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు కొందరు బీజేపీ లీడర్లు.దీంతో సరైన సమయంలో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు సరైన నిర్ణయం తీసుకుంటారన్న టాక్ వినిపిస్తోంది.
ఒకవేళ ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నది నిజమే అయితే..వాళు కమలం గూటికి రావాలనుకుంటే మాత్రం..రాష్ట్రంలో పొలిటికల్ సినారియో మారిపోవడం ఖాయమన్న చర్చ జరుగుతోంది.

# ఖమ్మం, తాడేపల్లిలో పోస్టర్ల కలకలం

**ఖమ్మం, జనవరి 10, పెన్ పవర్:**
లేటెస్ట్‌గా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చేసిన వ్యాఖ్యలు మరింత ఇంట్రెస్టింగ్‌గా మారాయి. వైసీపీ క్యాడర్.. తెలంగాణలో కేసీఆర్ గెలవాలని కోరుకుంటారని.. బీఆర్ఎస్ క్యాడర్ ఏపీలో జగన్ అధికారంలోకిరావాలని కోరుకుంటారని చెప్పారు. దీనికి ఆయన ఒక ఈక్వేషన్ కూడా చెప్పి చర్చకు దారి తీశారు. అదే దుష్మన్ కా దుష్మన్ అప్నా దోస్త్ అనే పాయింట్ తప్ప..వేరే కారణాలు ఏమి ఉండవంటూ ఆయన ఆసక్తికరవ్యాఖ్యలు చేశారు. నిజానికి తెలంగాణలో రేవంత్ సీఎం అయినప్పుడు కాంగ్రెస్ ర్యాలీల్లో ..రేవంత్ ఇంటి దగ్గర టీడీపీ జెండాలు కనిపించాయి. మరోవైపు జగన్ పర్యటనల్లో కేసీఆర్, కేటీఆర్ ఫోటోలు కనిపించడం కూడాపొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.లేటెస్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం పర్యటనలో..వైసీపీ జెండాలు కనిపించాయి. కేటీఆర్ ర్యాలీలో వైసీపీ ఫ్లాగ్స్‌తో, జగన్ నినాదాలతో సందడి చేశారు ఫ్యాన్ పార్టీఅభిమానులు. ఖమ్మం జిల్లాలో వైసీపీకి పట్టుంది. టీడీపీకి కూడా క్యాస్ట్ ఈక్వేషన్స్ పరంగా మంచి బలమే ఉంది. ఇప్పుడు ఖమ్మం జిల్లాలో ఇటు కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న నేతలు..అటు బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్ననేతలు వైసీపీ, టీడీపీ నుంచి వచ్చిన వారే. 2014లో ఖమ్మంలో మూడు ఎమ్మెల్యేలు సహా, ఒక ఎంపీ సీటును గెలుచుకుంది వైసీపీ. టీడీపీ కూడా ఖమ్మంలో ఒక సీటును, 2018లో రెండు సీట్లను గెలుచుకుం ది.సీట్ల పరంగానే కాదు..వైసీపీ, టీడీపీ అభిమానులు కూడా ఖమ్మం జిల్లాలో డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్నారు.అయితే రేవంత్ ఆల్రెడీ చంద్రబాబుతో కలిసి పని చేసిన నేతగా..వాళ్లిద్దరూ ఒక్కటే అన్న భావనతో..గత ఎన్నికల్లోతెలంగాణలో టీడీపీ క్యాడర్ ఔట్‌రైట్‌గా కాంగ్రెస్‌కు సపోర్ట్ చేసిందన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు రాబోతున్న వేళ కేటీఆర్ ఖమ్మం పర్యటనలో వైసీపీ ఫ్లాగ్స్ కనిపించడం చర్చకు దారితీస్తోంది.ఖమ్మంలో వైసీపీ క్యాడర్, జగన్ అభిమానులు బీఆర్ఎస్ వెంట మద్దతుగా నిలిస్తే..పోటీ మరోలా ఉంటుందన్న అంచనాలున్నాయి. అటు ఏపీ మాజీ సీఎం జగన్ కార్యక్రమాల ఫ్లెక్సీల్లో కేసీఆర్, కేటీఆర్ ఫోటోలు. బీఆర్ఎస్‌కార్యక్రమాల్లో వైఎస్ జగన్ ఫ్లెక్సీలు, వైసీపీ జెండాలు కనిపించడంతో తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అసలేం జరుగుతోందన్నది హాట్ టాపిక్‌గా మారింది. గతేడాది నవంబ ర్‌లో వైఎస్ జగన్ హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టుకువచ్చిన
సందర్భంగా అభిమానులు ఆయనకు భారీ ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీబీఐ కోర్టు దగ్గర ఓ అభిమాని ప్రదర్శించిన ఫ్లెక్సీలో జగన్‌తో పాటు కేటీఆర్ ఫోటోను ఉంచారు. జగన్ కోర్టు నుంచి లోటస్‌పాండ్ కు వెళ్లే క్రమంలో వైసీపీ జెండాలతో పాటు అక్కడక్కడ బీఆర్ఎస్ జెండాలు కూడా కనిపించాయి.జగన్
పుట్టిన రోజు కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యింది. జగన్ బర్త్ డే సందర్భంగా తాడేపల్లిలో కేసీఆర్, కేటీఆర్,జగన్‌తో కూడిన ఫ్లెక్సీ వెలిసింది. అది కూడా రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపింది. ఇక ఇటు తెలంగాణ సీఎం రేవంత్..అటు ఏపీ సీఎం చంద్రబాబు దోస్తీ అనే ప్రచారం ఓవైపు..జగన్, కేసీఆర్ మిత్రులంటూ కాంగ్రెస్ విమర్శలురె గ్యులర్ అయిపోయాయి. ఇలా తెలంగాణ సెంట్రిక్‌గా టీడీపీ వర్సెస్ వైసీపీ..బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ రాజకీయండనెక్ట్ లెవల్ హీట్‌ను క్రియేట్ చేస్తోంది.

# స్మశాన సుందరీకరణ పనులు కలగానే మిగిలేనా?

చస్తే పూడ్చడానికి, కాల్చడానికి స్థలం లేదు నడవాలంటే రోడ్డు లేదు
నిజాం చెరువు ట్యాంక్ బండ్ కలగానే మిగిలేనా ?




**మహబూబాబాద్, పెన్ పవర్:** జీవించి ఉన్నప్పుడు ప్రజలు చెల్లించే పన్నులు ప్రభుత్వానికి కావాలి కానీ మరణించిన ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం ఉండే విధంగా పూడ్చడానికి కాల్చడానికి కిలోమీటర్ల దూరం చూసినా స్థలం కూడా ఉండని దుస్థితి మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది.మహబూబాబాద్ పట్టణంలో బస్టాండ్ సమీపంలో ఉన్న నిజాం చెరువు (నీలం చెరువు) శిఖం భూములలో తరతరాల నుండి వస్తున్న స్మశాన వాటిక మరియు ప్రజల అవసరాల నిమిత్తం కేటాయించిన నిజాం చెరువు ప్రక్కన నుండి బస్టాండ్ రైల్వే గేట్ కలిపే నెక్లెస్ రోడ్డు హైకోర్టు వెడల్పు తగ్గిస్తూ రిజిస్ట్రేషన్ భూములు కలిగిన వారికి ఇచ్చిన తీర్పు తో నెక్లెస్ రోడ్డు నిర్మాణం జరిగి సంవత్సరములు గడుస్తున్నా ప్రజలు వినియోగించుకోకుండా కొందరు భూ కబ్జాదారులు రెవిన్యూ రిజిస్ట్రేషన్ సంబంధిత అధికారులను తైలాలతో మచ్చిక చేసుకుని సుమారుగా 100 సంవత్సరం ల నుండి ఆస్తులు కనిపించే విధముగా నకిలీ పత్రాలు సృష్టించి నిజాం చెరువు రెండు భాగాలను వేరు చేసే విధముగా ప్రయాణించే నక్లెస్ రోడ్డు రాకపోకలను నిలిపివేసి తరతరాల నుండి స్మశాన వాటిక వినియోగంలో ఉన్న నిజాం చెరువు లోతట్టు ప్రాంతాన్ని కొందరు కబ్జాదారులు ప్లాట్స్ గా మార్చి అమ్మకం అమ్మడం జరుగుతుంది. మహబూబాబాద్ జిల్లా మొత్తం ఇదే పరిస్థితి, పట్టణంలో ప్రజలందరికీ అందుబాటు దూరంలో ఉన్న నిజాం చెరువు స్మశాన వాటిక, స్థానిక ప్రజలు అన్ని కుల మతస్తులు వినియోగించుకునే స్మశాన వాటికను పునరుద్ధరించి స్మశాన వాటిక సుందరీ కరణ పనులలో భాగంగా వేచి ఉండేందుకు షెడ్లు, దినకర్మలకు గదులు, నిద్రించే స్థలాలు, నీటి సరఫరా గదులు, విద్యుత్, భద్రత సిబ్బంది, ఎలక్ట్రానికల్ దహన కేంద్రం అమర్చి ప్రజలందరికీ స్మశాన వాటిక వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలందరూ అధికారులందరికీ విజ్ఞప్తిని తెలియపరుస్తూ, గతంలో నుండి ప్రభుత్వాలు స్మశాన వాటికల సుందరి కరణ పనులకు కేటాయించి విడుదల చేసిన నిధులు స్థానిక అధికారులు కాసులకు కక్కృతులు పడుతూ వాటిని దుర్వినియోగపరిచారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తూ జిల్లా అధికార యంత్రాంగం ఆ యొక్క నిధుల జాబితా పున పరిశీలన చేసి స్మశాన వాటికల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని కోరుతూ,

# విద్యార్థి, యువజన నాయకులపై అక్రమ కేసులు రౌడీషీట్లు ఎత్తివేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**“రెడ్ బుక్” పాలనలో ప్రజాస్వామ్య హక్కులను హరించడం సిగ్గుచేటు అని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే విద్యార్థి, యువజన నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, రౌడీషీట్లు తెరవడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వారు పేర్కొన్నారు.
విశాఖపట్నంలో ఏఐఎస్ఎఫ్ఏఐవైఎఫ్ నాయకులపై పెట్టిన రౌడీషీట్లు, కడపలో పలువురు ప్రజా సంఘ నాయకులపై అమలు చేసిన పీడీ యాక్ట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఉరితాళ్లు మెడలో వేసుకుని, చేతులకు సంకెళ్లతో, నల్లజెండాలు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు.ఈ కార్యక్రమం ఉద్దేశించి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘ నాయకులు రెడ్డి పోగు ప్రశాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర తదితరులు మాట్లాడుతూ 2024 ఎన్నికల వాగ్దానాల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాలు అడిగితే అక్రమ కేసులు పెట్టడం, ఉద్యమాలను అణిచివేయడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని అన్నారు. ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చేసిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని, తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న విద్యార్థియువజన సంఘ నాయకులను అణిచివేయడానికి ప్రయత్నించడం తగదని వారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యమాల పేరుతో పెట్టిన అన్ని అక్రమ కేసులు, రౌడీషీట్లు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.
అధికారం తమ చేతిలో ఉందని పోలీస్ వ్యవస్థను ఉపయోగించి ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని ప్రయత్నిస్తే, గ్రామ స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తం వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులను అరెస్టు చేయడానికి రాష్ట్రంలో ఉన్న జైళ్లు కూడా సరిపోవని వారు వ్యాఖ్యానించారు, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యాన్ని వీడి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు డి. నజీర్ అహ్మద్, పాణ్యం నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు నాయకులు దుర్గాప్రసాద్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌతమ్, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి కటారీకొండ సాయి, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు, బిసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్, నగర కార్యదర్శి అశోక్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మునిస్వామి, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు హనోక్, నగర నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.


# నవ కంటోన్మెంట్ నిర్మాణ బాట మోండా డివిజన్ లోని కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్:పెన్ పవర్:**నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం మోండా డివిజన్ పరిధిలోని టౌన్ ఇంప్రూవ్ మెంట్ ట్రస్ట్ ( ౧ౠ), సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ౘవీజ),బలరామ్ బ్లాక్స్ లలో జీహెచ్‌ఎంసి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల వాసులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఈ పర్యటనలో కాలనీ లో బస్తీ దవాఖానా, లైబ్రరీ అవసరం ఉన్న దృష్ట్యా కాలనీలో ఉన్న +నవీజ స్థలంలో ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి నిధులు కేటాయించి, అధికారులతో మాట్లాడి నిర్మాణం చేపిస్తానని అన్నారు. కాలనీలో అవసరమైన అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తన వెంట పర్యటనలో ఉన్న అధికారులకు చెప్పారు.ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన తమ సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలపడంతో ఎమ్మెల్యేగా ఇది తన బాధ్యత అని వారితో చెప్పారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే శ్రీగణేష్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, సంకి రవీందర్, సంతోష్ యాదవ్, అరవింద్ యాదవ్, వేణుగోపాల చారి, కాలనీ పెద్దలు రషీద్, రాజు, సాయిబాబా, అశోక్ తదితరులు ఉన్నారు.

# కిక్కిరిస జూబీఎస్

**సికింద్రాబాద్: పెన్ పవర్:**సికింద్రాబాద్ జేబీఎస్ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది.. సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించడంతో నగరవాసులు వారి గ్రామాలకు వెళ్లేందుకు జేబీఎస్ బస్టాండ్ కు చేరుకుంటున్నారు.. ఒక్కసారిగా ప్రయాణికుల రద్దీ పెరగడంతో బస్సుల కొరకు గంటల తరబడి ప్రయాణికులు ఎదురు చూడవలసి వస్తుంది.. బస్సులో సీట్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు... రద్దీకి తగ్గట్టుగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల అవస్థలు అంతా ఇంతా కాదు

# ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి....



**గోదావరిఖని: పెన్ పవర్:**రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన ప్రజలు పండుగలు, సెలవులు, వివాహాలు తదితర సందర్భాల్లో ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని,చోరీలు మరియు ఇతర నేరాలు జరగకుండా స్వీయ రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో సూచించారు.ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే ముందు తలుపులు,కిటికీలు, గేట్లు సక్రమంగా మూసి ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పూర్తిగా పరిశీలించుకోవాలని తెలిపారు.అలాగే ఇళ్లలో లేదా ఇంటి పరిసర ప్రాంతాల్లో అమర్చిన సీసీటీవీ కెమెరాలు సరిగా పనిచేస్తున్నాయా, రికార్డింగ్ జరుగుతోందా,నైట్ విజన్ సదుపాయం సక్రమంగా ఉందా అనే అంశాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు.సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తే నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయాన్ని కలిగించడంతో పాటు,ఏదైనా అనుకోని ఘటన జరిగినా నిందితులను గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడుతాయని సీపీ పేర్కొన్నారు. ఇంటర్నెట్ సదుపాయం కలిగిన సీసీటీవీ కెమెరాలైతే మొబైల్ ఫోన్ యాప్ ద్వారా లైవ్ ఫుటేజ్ వీక్షించే విధంగా ముందుగానే సెటప్ చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా,ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే విషయాన్ని పొరుగువారికి లేదా నమ్మకమైన వ్యక్తికి ముందుగా తెలియజేయడం, అవసరమైతే సంప్రదింపు ఫోన్ నంబర్ ఇవ్వడం భద్రతకు మరింత దోహదపడుతుందని తెలిపారు.రాత్రి సమయాల్లో ఇంటి వెలుపల లైట్లు వెలిగేలా టైమర్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఇల్లు ఖాళీగా ఉందనే అనుమానం కలగకుండా ఉంటుందని వివరించారు.

## రాజాసాబ్ అంచనాలు తలకిందులు

**హైదరాబాద్, జనవరి 10, పెన్ పవర్:** ంబల్ స్టార్ ప్రభాస్ హీరో గా నటించిన 'రాజా సాబ్' చిత్రం నిన్న ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ విడుదలై నెగిటివ్ టాక్ ని సొంతం చేసుకుంది. ఆ నెగిటివ్ టాక్ ప్రభావం నూన్, మ్యాట్నీ షోస్ మీద చాలా బలంగా పడింది కానీ, ఫస్ట్ షోస్ నుండి కాస్త పికప్ అయ్యాయి. ఇక సెకండ్ షోస్ అయితే అన్ని సెంటర్స్ లో దుమ్ము దులిపేసింది. ఫ్లాప్ టాక్ వల్ల ఘోరమైన డిజాస్టర్ ఓపెనింగ్స్ వస్తాయని అంతా అనుకున్నారు కానీ, ప్రభాస్ పరువు నిలబెట్టే ఓపెనింగ్ ని చివరికి సొంతం చేసుకుంది. ముఖ్యంగా నైజాం ప్రాంతం లో ఈ చిత్రం చాలా డీసెంట్ వసూళ్లను నమోదు చేసుకుంది. ప్రీమియర్ షోస్ భారీగా లేకపోవడం ఈ సినిమాకు చాలా ప్లస్ అయ్యింది ఈ ప్రాంతంలో. ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఈ చిత్రానికి గ్రాస్ వసూళ్లు వచ్చాయో ఒకసారి చూద్దాం.ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం చూస్తే ఈ చిత్రానికి నైజాం ప్రాంతం లో మొదటి రోజు 18.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. షేర్ వసూళ్లు దాదాపుగా 12 కోట్ల రూపాయిల వరకు ఉంటుందని అంచనా. అదే విధంగా ఆంధ్రా + సీడెడ్ ప్రాంతం నుండి 34 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. ఓవరాల్ గా తెలుగు రాష్ట్రాల నుండి 52.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు, 34 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. వచ్చిన టాక్ కి ఇది చాలా డీసెంట్ షేర్ వసూళ్లు అనే చెప్పాలి. ఇక ఓవర్సీస్ ప్రాంతం నుండి ఈ చిత్రానికి కేవలం 27 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళు మాత్రమే వచ్చాయి. అదే విధంగా కర్ణాటక ప్రాంతం నుండి 6 కోట్లు, రెస్ట్ ఆఫ్ ఇండియా నుండి 8 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి.ఓవరాల్ వరల్డ్ వైడ్ గా ఈ చిత్రానికి 93.6 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు నమోదు అయ్యింది. తెలుగు రాష్ట్రాల్లో రామ్ చరణ్ 'గేమ్ చేంజర్', పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకంటే తక్కువ ఓపెనింగ్ వసూళ్లు వచ్చాయి కానీ , ఓవర్సీస్ ప్రాంతం లో ఆ రెండు సినిమాల కంటే డీసెంట్ వసూళ్లను నమోదు చేసుకోవడం తో ప్రభాస్ పరువుని నిలబెట్టే రేంజ్ ఓపెనింగ్ దక్కింది. ఆయన అభిమానులకు మొదటి రోజు వంద కోట్ల గ్రాస్ మిస్ అయ్యామే అనే బాధ ఉంటుంది కానీ, ఈ టాక్ తో కూడా ఈ రేంజ్ గ్రాస్ ని రాబట్టినందుకు ప్రభాస్ స్టార్ స్టేటస్ ని చూసి గర్వపడొచ్చు అనే చెప్పాలి.

## అఘోరి రోజు ఆదాయం 30 వేలు...

**హైదరాబాద్, జనవరి 10, పెన్ పవర్:** శవ్యాప్తంగా సంచలనం రేపిన 'అఘోరీ శ్రీనివాస్' ని అంత తేలికగా మర్చిపోగలమా?..మగవాడు అయినప్పటికీ లేడీ అఘోరీ గా మారి, మాయ మాటలు చెప్పి, అమాయకులను మోసం చేసి కోట్ల రూపాయిల సంపాదన అతి తక్కువ సమయం లోనే సంపాదించాడు. అంతే కాదు, ఇతను ఆడవాళ్లను లొంగదీసుకోవడం లో కూడా నేర్పరి. శ్రీ వర్షిణి అనే అందమైన అమ్మాయిని మాయ మాటలు చెప్పి తన వెంట తిరిగేలా చేసాడు. రెండు నెలల పాటు ఆ అమ్మాయి అతనితో కలిసి ప్రయాణం చేసింది. కుటుంబ సభ్యులు వర్షిణి కోసం వెతకాని ప్రదేశం అంటూ లేదు. అంతలా మాయ చేసి తన వెంట తీసుకొని వెళ్ళిపోయాడు. అయితే ఎట్టకేలకు అఘోరి శ్రీనివాస్ దుర్మార్గాలను గమనించిన పోలీసులు అతన్ని అదుపులో తీసుకున్నారు. అయితే రెండు నెలల పాటు అతనితో కలిసి తిరిగి శ్రీ వర్షిణి అనే అమ్మాయి, రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూ ఇచ్చింది.

ఈ ఇంటర్వ్యూ లో ఆమె మాట్లాడిన మాటలు చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. ఆమె మాట్లాడుతూ 'రెండు నెలల పాటు నేను అతనితోనే ఉన్నాను. దేవాలయాలకు బాగా తిప్పేవాడు, అక్కడ ప్రసాదాలు తీసుకోవడం, పడుకోవాలని అనుకుంటే ఎక్కడైనా పెట్రోల్ బంక్ వద్ద కారు ఆపేసి నిద్రపోవడం వంటివి చేసేవాడు. మంచి ఫేమ్ ఉన్న వ్యక్తి కాబట్టి, భక్తులు ఆయన కారు స్టిక్కరింగ్ ని చూసే వచ్చేవాళ్ళు. ఒక్కొక్కరు 500 , లేదా వెయ్యి రూపాయిలు ఇవ్వడం, కారు కి పెట్రోల్ ఫుల్ ట్యాంక్ చేయించడం, ఫుడ్ తినిపించడం, ఖరీదైన బట్టలు పెట్టడం వంటివి చేసేవారు. అలా రోడ్డు మీద వెళ్తున్న సమయం లో అతనికి ఎవరో ఒకరు ఎంతో కొంత డబ్బులు ఇస్తూనే ఉండేవాళ్ళు. అలా రోజుకి అతను పాతిక నుండి 30 వేల రూపాయిలు సంపాదించేవాడు. పెట్రోల్ ఫ్రీనే, డబ్బు ఫ్రీనే, ఆహారం ఫ్రీనే, ఇంకేమి ఉంది చల్లగా పూజ పెట్టుకొని పాడుకోవడమే అతను చేసే పని' అంటూ చెప్పుకొచ్చింది.

ఇంత జరుగుతుంటే మీకు అతన్ని ఎప్పుడు ప్రశ్నించాలని అనిపించలేదా అని యాంకర్ అడిగిన ప్రశ్నకు, వర్షిణి సమాధానం చెప్తూ 'ఆశ్రమాన్ని నిర్మించాలని అనేవాడు. నేను అతన్ని అప్పట్లో గుడ్డిగా నమ్మేసాను, ఒక ట్రాన్స్ లోకి వెళ్ళిపోయాను. అతనే లోకం అంటూ తిరిగాను కదా, అందుకే అన్నీ నమ్మేదాన్ని' అంటూ చెప్పుకొచ్చింది. మీ కుటుంబ సభ్యులు నిన్ను అతి కష్టం మీద వెతికి మూడు వారాల తర్వాత ఇంటికి తిరిగి తీసుకొచ్చారు కదా, అప్పుడు మళ్లీ మీరెందుకు పారిపోయారు అని యాంకర్ అడగ్గా 'దాదాపుగా పారిపోయాను అనే అనుకోండి, కానీ మధ్యలో కొంతమంది ఉన్నారు. వాళ్ళ వల్లే నేను వెళ్లాల్సి వచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది.

## టోల్ గేట్ల దగ్గర వాహనాల రద్దీ

**చౌటుప్పల్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగ వేళ జనాలు పట్నం నుంచి పల్లె బాట పడుతున్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ గేట్ వద్ద సేమ్ సీన్. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపైనా భారీగా వాహనాల రద్దీ వుంది. టోల్ గేట్లను దాటేందుకు రెండు గంటల సమయం పడుతోంది. టోల్, ట్రాఫిక్ సిబ్బంది ట్రాఫిక్ ని క్లియర్ చేయలేకపోతున్నారు.

## అంబర్పేట్ ఎస్ ఐ భాను ప్రకాష్ రెడ్డి అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** అంబర్ పేట పోలీసు స్టేషన్ లో ఎస్సై గా పని చేస్తున్న భాను ప్రకాష్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. భాను ప్రకాష్ రెడ్డి బెట్టింగ్ అప్పులు తీర్చేందుకు రికవరీ సొత్తు కాజేసి తాకట్టు పెట్టిన విషయం తెలిసిందే. తన సర్వీస్ రివాల్వర్ ను ఎక్కడో పోగొట్టుకున్నాడు. ట్రైన్ లో ప్రయాణిస్తున్న సందర్భంలో రివాల్వర్ పోయిందని స్టేట్మెంట్ ఇచ్చాడు. ఎంత వెతికినా గన్ కనిపించలేదని చెప్పాడు. భాను ప్రకాష్ రెడ్డి ఏపీ లో గ్రూప్2 ఉద్యోగం పొందాడు. ఇక్కడ రిలీవ్ చేయాలని రిక్వెస్ట్ పెట్టుకున్నాడు.

## ఒకే రోజు..ఒకే ఊరిలో మూడు దొంగతనాలు

**మేడ్చల్: పెన్ పవర్:**ఒకే రోజు ఒకే ఊరిలో ఓ దుండగుడు మూడు చోట్ల దొంగతనాలకు పాల్పడి అందినకాడికి నగదును దోచుకెళ్ళిన సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపూర్లో చోటుచేసుకున్నాయి. గ్రామంలోని మూడు చోట్ల ఒకే రోజు దొంగతనం జరగగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. లక్ష్మాపూర్ లో కిరాణ దుకాణం, ఎరువుల దుకాణం, ఆలయ హుండీని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని దుండగుడు షట్టర్ల తాళాలు పగులగొట్టి అందినకాడికి నగదు దోచుకెళ్లాడు. లక్ష్మాపూర్లో కిరాణా దుకాణం యజమాని గురువారం రాత్రి షాపు మూసి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో దుండగుడు షట్టర్ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లాడు. ఫర్టిలైజర్ దుకాణం తాళాలు పగలగొట్టి సుమారు 40 వేల వరకు నగదు దోచుకెళ్లాడు. గ్రామపంచాయతీ ముందు ఉన్న శివాలయంలోని హుండీని పగులగొట్టి అందులోని డబ్బులను తీసుకుని, హుండీని కాళీ ప్రదేశంలో పడేసి వెళ్లాడు. ఉదయం షాపులు తెరవడానికి వచ్చిన యజమానులు తాళాలు విరిగివుండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగతనానికి గురైన దేవాలయం ఉండిని పరిశీలించారు. గ్రామంలో చోరీకి పాల్పడిన సంఘటనలు కొన్ని సీసీ కెమెరాలు దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చెక్ డ్యామ్ గోడను కూల్చివేసిన ఇసుక మాఫియా

**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:** ఇసుక మాఫియా మరో ఘాతుకానికి ఒడిగట్టింది. సిరిసిల్ల జిల్లాలో చెక్ డ్యామ్ రక్షణ గోడను కూల్చివేసింది. వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో మూలవాగుపై ఉన్న చెక్ డ్యామ్ రక్షణ గోడ ధ్వంసం చేసింది. ఇసుక తరలింపు కోసమే చెక్ డ్యామ్ రక్షణ గోడను కూల్చారని స్థానికుల అనుమానం. ఈ గోడ కూలడం వల్ల వర్షాకాలంలో అధిక వరద వచ్చి ఒడ్డును కూల్చే ప్రమాదం ఉందని ఆందోళన లో స్థానికులున్నారు.
జేసీబీ తగిలి రక్షణ గోడ కూలిపోయిందని గ్రామ సర్పంచ్ సమాధానం
అధికారులు స్పందిస్తూ గోడను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తప్పవని అంటున్నారు.

# ఆ ఐదుగురు ఎవరు...

**హైదరాబాద్, జనవరి 10, పెన్ పవర్:**
తెలంగాణ క్యాబినెట్లో..ఇప్పుడు ఒకటే చర్చ. అమాత్యులపై ఆరోపణలు..వివాదాలతో..ఎవరి సీటుకు ఎసరు వస్తుందనేది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటిదాకా ఖాళీగా ఉన్న రెండు బెర్తులపైనే ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలకు..ఇప్పుడు ఖాళీ కాబోయే బెర్తులూ కూడా ఊరిస్తున్నాయట. దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్ మంత్రి ఓ మహిళా అధికారితో నడిపిన..నడుపుతున్న వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. ఎక్కడ చూసినా ఆ మంత్రెవరు..? ఆ అధికారెవరన్న చర్చే. ఆయన తెరచాటు వ్యవహారాలు..సర్కార్కు బ్యాడ్ నేమ్ తెచ్చిపెడుతున్నాయట. సదరు మంత్రి కారణంగా ఇద్దరు మహిళా అధికారుల బదిలీలు కూడా జరిగాయటపార్టీలో అందరికన్నా తానే సీనియర్ అని చెప్పుకునే ఆ సదరు అమాత్యుల వారికి సంబంధించిన పూర్తి డేటా..ఇంటలిజెన్స్ రిపోర్టు ఢిల్లీకి కూడా చేరిపోయిందట. దీంతో గత అసెంబ్లీ సమావేశాల్లో ఒంటికాలిపై లేచిన ఆ అమాత్యుడు..ఈ సెషన్లో పూర్తిగా సైలెంట్ అయిపోయారట. ఈ నేపథ్యంలోనే ఆయన కుర్చీకి ఎసరు తప్పదనే ప్రచారం జరుగుతోంది.ఇక దక్షిణ తెలంగాణకే చెందిన మరో సీనియర్ మంత్రిది ఇదే పరిస్థితిఅంటున్నారు. ఎన్నికల ముందే హస్తం గూటికి చేరి..ఇప్పుడు అమాత్యులుగా ఉన్న ఆ మంత్రిగారికి కూడా ఉద్వాసన తప్పదంటున్నారు. ఆర్టీఐ ద్వారా తన శాఖలోని అధికారుల దందాలను ఆ మంత్రే బయట పెట్టడమే కారణమనే టాక్ నడుస్తోంది. వీరిద్దరూ తెలంగాణ ఉద్యమానికి తామే బ్రాండ్ అంబాసిడర్లం అని కూడా చెప్పుకునే నేతలే కావడం మరో విశేషం.ఇక మరో ఉత్తర తెలంగాణ మంత్రిది ఇంకో కథ. హైదరాబాద్లో అంతా తానై
చక్రం తిప్పుతున్న సదరు మంత్రి చేష్టలు..సర్కార్కు హెడెక్గా మారాయట. మహిళా అధికారులు, నేతలతో జోక్లు..వింత పలుకులతో ఆయన తీరు చర్చనీయాంశంగా మారిందంటున్నారు. సదరు మంత్రి తీరుపైఇప్పటికే కొందరు అధికారులు..సీఎంవో దృష్టికి తీసుకెళ్లారట. ఇది చాలదన్నట్లు..ఇటీవల ఒకరిద్దరు మహిళా జర్నలిస్టులతో కూడా ఆయన సన్నిహితంగా ఉంటూ..వాట్సప్ కాల్స్..ఇన్స్టాలో మెస్సేజ్లు పెడుతూటీనేజర్గా మారిపోయారన్న గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారంతో సదరు అమాత్యులవారికి ఉద్వాసన తప్పదన్న గుసగుసలు సెక్రటేరియట్లో రచ్చ రంబోలా చేస్తున్నాయి.ఇంకో సీనియర్ మంత్రిపై కూడాడచిలిపి చేష్టలు, కరప్షన్ అలిగేషన్స్తో గందరగోళం నెలకొందట. సమైఖ్య రాష్ట్రంలోనే..సీనియర్ మోస్ట్ నేతగా ఉన్న ఆయనకు ఓ టైప్ ఆఫ్ డ్యాషింగ్ లీడర్గా పేరుంది. ఈ సదరు మంత్రితో సూటిగా మాట్లాడాలంటే..అధికారులే కాదు..తోటి లీడర్స్ కూడా జంకుతుంటారు. తన అనుకున్న వారిపై ట్రాన్స్ఫర్స్ గాలి సోకకుండా.. ప్రొటెక్టర్గా ఉంటుంటడం వెనుక ఏవో మతలబులున్నాయనే టాక్ నడుస్తోంది.అవినీతి ఆరోపణలు పెరిగిపోవడంతో ఆయనపై కూడా రిపోర్టులు రెడీ అయ్యాయని తెలుస్తోంది.ఉత్తర తెంగాణకు చెందిన మరో సీనియర్ మహిళా మంత్రి పదవి కూడా..క్యాబినెట్ విస్తరణలో గల్లంతు అవడం పక్కాఅంటున్నారు. సర్కార్ ఏర్పడిన కొత్తలో ఈ సీనియర్ మంత్రి నోటి మాటతో రేవంత్ సర్కార్కు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడగా..తన ఇంటి మనిషి అవినీతి వ్యవహారాన్ని వెనుకేసుకుని రావడం అప్పట్లో చర్చనీయాంశంగా
మారింది. అది ఇప్పటికీ విపక్షాలకు అస్త్రంగా ఉంటూనే వస్తోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఆ మహిళా మంత్రిని క్యాబినెట్ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు మహిళామంత్రికి విస్తరణ మాట వింటే చాలు కంటి మీద కునుకు రావడం లేదట.ఐదుగురు మంత్రులకు ఉద్వాసన పలికితే..అప్పుడు కేబినెట్ లో ఖాళీ బెర్తుల సంఖ్య ఆరుకు చేరనుంది. అటు అజారుద్దీన్ స్థానం కూడాఊగిసలాటలోనే ఉండటంతో కేబినెట్ లో బెర్తుల కోసం దాదాపు డజన్ మంది కాపు కాసుకుని కూర్చున్నారట. ఇప్పటికే ఈ లిస్ట్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి,ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు తొలిసారి ఎన్నికై అసెంబ్లీ లోపలా, బయట.. ఫైర్ బ్రాండ్ లీడర్లుగా ఎస్టాబ్లిష్ అవుతున్నమరికొందరు యువ ఎమ్మెల్యేలకు కూడా అదృష్టం కలిసి రావచ్చని టాక్ నడుస్తోంది.

# తిట్ల దండకంలో తండ్రినే మించిపోతున్న కేటీఆర్?

**హైదరాబాద్, జనవరి 10, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు ప్రజా సమస్యల చర్చ కంటే.. వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలమే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ఉద్యమ సెగతో రగిలిన తెలంగాణ గడ్డపై ఇప్పుడు రాజకీయకక్షలు బూతుల పర్వాలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరి ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. తన తండ్రి కేసీఆర్ వేసిన తిట్ల బాటలో నడుస్తూ.. ఇప్పుడు ఆయననే
మించిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వాడిన భాష ఒక ఆయుధంగా పనిచేసింది. సమైక్య పాలకులను ఉద్దేశించి ఆయన వాడిన పిచ్చోళ్లు, దెబ్బకు దెయ్యంవదులుతది వంటి పదాలు అప్పట్లో ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అయితే, అధికారం వచ్చాక కూడా అదే ధోరణి కొనసాగడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. చివరకు 2024 ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికలసంఘం కూడా కేసీఆర్ వాడిన అన్ పార్లమెంటరీ భాషపై సీరియస్ అయ్యి నోటీసులు ఇచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు చెక్ పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అదేభాషా యుద్ధాన్ని కొనసాగిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా గానీ, బహిరంగ సభల్లో గానీ బీఆర్ఎస్ నేతలపై విరుచుకుపడుతున్నారు. 2025 డిసెంబర్ నాటి అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ రెడ్డి వాడినకొన్ని పదాలు సభ్య సమాజాన్ని విస్మయానికి గురిచేశాయి. అలాగే సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేసేవారిని బట్టలు ఊడదీసి పరేడ్ చేస్తాం అనడం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రికి తగదనిరాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.విదేశాల్లో చదువుకుని, కార్పొరేట్ శైలిలో రాజకీయాలు చేస్తారని పేరున్న కేటీఆర్.. ఓటమి తర్వాత పూర్తిస్థాయిలో రూటు మార్చారు. రేవంత్ రెడ్డి



విమర్శలకు కౌంటర్ ఇచ్చేక్రమంలో ఆయన కూడా సంయమనం కోల్పోతున్నారు. తాజాగా ఖమ్మంలో కేటీఆర్ వాడిన పదజాలం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలను కేటీఆర్ అసభ్యపదజాలంతో దూషించారు. రేవంత్రెడ్డిని గూండాగిరి చేస్తున్నారని విమర్శిస్తూనే, కేటీఆర్ కూడా అదే స్థాయి పదజాలంతో విరుచుకుపడుతున్నారు. ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ వ్యక్తిగత దూషణలకు దిగడం కేటీఆర్ ఇమేజ్కు డ్యామేజ్కలిగిస్తోందనే వాదన వినిపిస్తోంది.రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ, అవి లక్ష్మణ రేఖను దాటకూడదు. "రేవంత్ తిడుతున్నారు కాబట్టి మేము కూడా తిడతాం" అని బీఆర్ఎస్ సమర్థించుకోవడంఆ పార్టీ నైతికతను దెబ్బతీస్తుంది. కేటీఆర్ లాంటి విద్యావంతుడైన నాయకుడు ఈ తిట్ల సంస్కృతికి చరమగీతం పాడి, ఒక కొత్త తరహా రాజకీయాలకు నాంది పలకాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, అధికార–ప్రతిపక్షాలమధ్య జరుగుతున్న ఈ బూతుల యుద్ధంలో అసలైన ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుంది. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. వారు నేతల నోటి వెంట తిట్లు కాదు.. తమ సమస్యలకు పరిష్కారాలుకోరుకుంటున్నారు. ఈ నిజాన్ని నాయకులు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

# కాంగ్రెస్ గూటికేనా...

**హైదరాబాద్, జనవరి 10, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసనమండలి వేదికగా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెనుప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాజీనామాను ఆమోదించాల్సిందేనని ఆమె నిండు సభలో పట్టుబట్టడం, మండలి ఛైర్మన్ దాన్ని పునరాలోచించుకోవాలని సూచించడం వంటి పరిణామాలు ఒక పొలిటికల్ థ్రిల్లర్ నుతలపిస్తున్నాయి. అయితే, ఈ రాజీనామా వెనుక కేవలం అసంతృప్తి మాత్రమే ఉందా? లేక దీని వెనుక ఒక భారీ రాజకీయ వ్యూహం దాగి ఉందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిందిశాసనమండలిలో కవితప్రవర్తించిన తీరు బీఆర్ఎస్ శ్రేణులను సైతం విస్మయానికి గురిచేసింది. తన రాజీనామా లేఖను ఆమోదించాలని ఆమె ఛైర్మన్ ను కోరగా, తొందరపడవద్దని, నిర్ణయంపై పునరాలోచించుకోవాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. అయినప్పటికీ, కవిత తన నిర్ణయానికి కట్టుబడి ఉంటారా లేక ఛైర్మన్ సూచన మేరకు వెనక్కి తగ్గుతారా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్ గానే ఉంది. కానీ, సభలో ఆమె బీఆర్ఎస్ పార్టీ విధానాలపై,నాయకత్వంపై పరోక్షంగా నిప్పులు చెరిగిన తీరు చూస్తుంటే.. గులాబీ పార్టీతో ఆమె బంధం తెగిపోయినట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ మొత్తం ఎపిసోడ్ లో కవిత చేసిన ఒక వ్యాఖ్య అత్యంత కీలకమైనది. "వచ్చేఎన్నికల నాటికి 'జాగృతి' ఒక శక్తిగా రూపాంతరం చెందుతుంది, అందరూ ఆశీర్వదించాలి" అని ఆమె కోరడం వెనుక పెద్ద ప్లాన్ ఉందని అర్థమవుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో సాంస్కృతిక సారథిగా ఉన్న
తెలంగాణ జాగృతిని ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే యోచనలో కవిత ఉన్నట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ లో ఇన్నాళ్లుగా ఉన్న అసమ్మతిని, తనకంటూ ఉన్న వ్యక్తిగత క్యాడర్ ను జాగృతి వేదికగాఏకం చేయడం ఆమె తక్షణ కర్తవ్యంగా కనిపిస్తోంది.కవిత కొత్త పార్టీ పెడతారన్న వార్తల నడుమ.. అత్యంత ఆసక్తికరమైన ప్రచారం విలీనం చుట్టూ



తిరుగుతోంది. వైఎస్ జగన్ సోదరి షర్మిల మొదట 'వైఎస్ఆర్టీపీ'పేరుతో పార్టీ పెట్టి, ఆ తర్వాత దాన్ని కాంగ్రెస్ లో విలీనం చేసి, ఇప్పుడు పీసీసీ చీఫ్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు కవిత కూడా అదే బాటలో నడవబోతున్నారనే ఊహాగానాలు బలంగావినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కవిత నేరుగా కాంగ్రెస్ లో చేరడం కంటే, జాగృతిని పార్టీగా మార్చి, ప్రజల్లోకి వెళ్లాక, ఎన్నికల సమయానికి కాంగ్రెస్ లో విలీనం చేయడం వ్యూహాత్మకంగామంచిదనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల అటు సొంత బలం నిరూపించుకోవడంతో పాటు, ఇటు కాంగ్రెస్ హైకమాండ్ వద్ద బార్గేనింగ్ పవర్ పెరుగుతుందన్నది అంచనా.ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తూకాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. కవిత కాంగ్రెస్ లోకి రావచ్చంటూ ఆయన చేసిన ప్రకటన.. తెరవెనుక జరుగుతున్న మంత్రాంగం బయటపడేలా చేసింది. బీఆర్ఎస్ ను,ముఖ్యంగా కేసీఆర్ కుటుంబాన్ని దెబ్బకొట్టడానికి కాంగ్రెస్ పార్టీ కవితను ఒక 'బ్రహ్మాస్త్రం'లా వాడుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. కేసీఆర్ కుమార్తెనే కాంగ్రెస్ గూటికి చేరితే.. అది బీఆర్ఎస్ ఆత్మవిశ్వాసాన్నిదెబ్బతీయడమే కాక, ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీస్తుంది.మొత్తానికి కవిత రాజీనామా ఎపిసోడ్ కేవలం ఒక పదవికి సంబంధించిన విషయం కాదు. ఇది తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసేఒక భారీ ఆపరేషన్ కు నాందిగా కనిపిస్తోంది. రానున్న రోజుల్లో జాగృతి యాక్టివిటీ పెరగడం, బీఆర్ఎస్ పై కవిత విమర్శల దాడి తీవ్రతరం కావడం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ రాజకీయ చదరంగంలోకవిత వేసే ఎత్తులు, దానికి కాంగ్రెస్ అందించే సహకారం.. బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదంగా మారే అవకాశాలను కొట్టిపారేయలేం

# జంగా రాజీనామా వెనుక గెస్ట్ హౌసేనా

**తిరుమల, జనవరి 10, పెన్ పవర్:**
తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు, సీనియర్ నేత జంగా కృష్ణమూర్తి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపారు. గత కొద్ది రోజులుగా తిరుమలలో గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం భూకేటాయింపు వ్యవహారంపై వస్తున్న ఆరోపణలు, కేబినెట్ సమావేశంలో జరిగిన చర్చల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఇటీవల ఓ దినపత్రికలో తనపై వచ్చిన కథనాలపై ముఖ్యమంత్రి వాస్తవాలను పరిశీలించకుండానే, టీటీడీ బోర్డు నిర్ణయాన్ని రద్దు చేస్తామని కేబినెట్ మీటింగ్‌లో ప్రకటించడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.ఈ వివాదానికి మూలాలు దాదాపు రెండు దశాబ్దాల క్రితం నాటివి. పల్నాడు జిల్లాకు చెందిన బలమైన బీసీ నాయకుడైన జంగా కృష్ణమూర్తి, 2005లో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తిరుమల బాలాజీ నగర్‌లో ఒక ప్లాట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో 'కాటేజీ డొనేషన్ స్కీమ్' కింద ప్లాట్ నంబర్ 2ను ఆయనకు కేటాయించినప్పటికీ, డొనేషన్ మొత్తం పది లక్షల నుంచి యాభై లక్షలకు పెరగడంతో ఆయన ఆ సొమ్ము చెల్లించలేదు. ఫలితంగా ఆ కేటాయింపు రద్దయింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021లో మళ్ళీ ప్రయత్నించగా, టీటీడీ కోటి పది లక్షలు చెల్లించాలని కోరింది. అయితే ఆ స్థలాన్ని తన వ్యక్తిగత పేరు మీద కాకుండా 'ఓం శ్రీ నమో వేంకటేశాయ గ్లోబల్ ట్రస్ట్' పేరు మీదకు మార్చాలని ఆయన కోరారు. నిబంధనల సాకుతో అప్పట్లో ఆ అభ్యర్థన తిరస్కరణకు గురైంది.అయితే, ఎన్నికల ముందు టీడీపీలో చేరిన జంగా కృష్ణమూర్తికి కూటమి ప్రభుత్వం టీటీడీ బోర్డులో చోటు కల్పించింది. బోర్డు సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే, గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తన పాత అభ్యర్థనను మళ్ళీ తెరపైకి తెచ్చారు. ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో, ప్రస్తుతం ఆ స్థలం మార్కెట్ విలువ దాదాపు 7 కోట్ల రూపాయల పైచిలుకు ఉన్నప్పటికీ, పాత ధరకే అంటే కేవలం కోటి పది లక్షలకే ఆయన ట్రస్టుకు కేటాయిస్తూ బోర్డు తీర్మానం చేసింది. ఈ నిర్ణయం బయటకు రావడంతో పెను దుమారం రేగింది. ప్రభుత్వం పారదర్శకత గురించి మాట్లాడుతుంటే, బోర్డు సభ్యులు మాత్రం తమ సొంత ప్రయోజనాల కోసం కోట్లాది రూపాయల విలువైన టీటీడీ ఆస్తులను తక్కువ ధరకు పొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి.ఈ అంశంపై కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు సభ్యులుగా ఉండి ఇలాంటి వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. దీంతో అడ్డగోలుగా జరిగిన ఈ భూకేటాయింపును రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తనను వ్యక్తిగతంగా అవమానించినట్లుగా ఉందని జంగా కృష్ణమూర్తి భావించారు. తాను భక్తుల సౌకర్యార్థం ట్రస్ట్ ద్వారా సేవ చేయాలనుకున్నానని, కానీ తనపై అసత్య కథనాలు ప్రచారం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ తీసుకోకుండానే రద్దు నిర్ణయం ప్రకటించడం వల్ల ఆత్మగౌరవం దెబ్బతిందని పేర్కొంటూ ఆయన పదవి నుంచి తప్పుకున్నారు.వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు 2021లో మరోసారి అదే ప్లాట్‌ను ఆయనకు కేటాయించారు. అప్పట్లో కోటి రూపాయల విరాళం చెల్లించాలని టీటీడీ కోరగా, ఆయన కేవలం 10 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన మొత్తానికి గడువు కోరారు. ఆయన ఓం శ్రీ నమో వెంకటేశాయ గ్లోబల్ ట్రస్టు పేరు మీద ఆ ప్లాట్ కేటాయించాలని ఆయన కోరారు. కానీ బోర్డు తిరస్కరించింది. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక, జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరి టీటీడీ బోర్డు సభ్యుడయ్యారు. ఈ క్రమంలో, పాత విరాళం రేట్లకే అదే స్థలాన్ని ఆయన సూచించిన ట్రస్టుకు కేటాయిస్తూ బోర్డు ఇటీవల తీర్మానం చేసింది. అది వివాదాస్పదంఅయి ఉంది.ఈ వివాదం ముదురుతుండటం, ప్రభుత్వంపై విమర్శలు వస్తుండటంతో జంగా కృష్ణమూర్తి తన పదవికి రాజీనామా చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉంటూ భూమి కేటాయింపులు చేసే ఎస్టేట్ కమిటీ లో కూడా ఆయనే ఉండటం పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కిందకు వస్తుందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అందుకే ఆయన తన సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

# వారసుడు ట్యాగ్ ఇప్పుడు లీడర్ ముద్ర

**విజయవాడ, జనవరి 10, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇస్తూ ముందుకు సాగుతున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు పొందారు. ప్రముఖ జాతీయ వారపత్రిక 'ది వీక్' మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయన నిలవడం ఇప్పుడు రాజకీయ, ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న లోకేష్‌ను 'చీఫ్ జాబ్ క్రియేటర్' గా ఆ మ్యాగజైన్ అభివర్ణించడం విశేషం.నారా లోకేష్ విద్యా నేపథ్యం, అంతర్జాతీయ అనుభవం ఆయన పనితీరులో స్పష్టంగా కనిపిస్తోందని 'ది వీక్' పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, కార్నెగీ మెలన్ యూనివర్సిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలను వేగంగా అమలు చేసే నాయకుడిగా ఎదిగారని మ్యాగజైన్ విశ్లేషించింది. పరిశ్రమలతో నేరుగా మాట్లాడటం, విధానాల్లో మార్పులు తీసుకురావటం, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా రాష్ట్రాన్ని ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా మార్చుతున్నారని తెలిపింది.ఇది తొలిసారి కాదు. గతంలో ప్రముఖ ఆర్థిక పత్రిక 'బిజినెస్ స్టాండర్డ్'కూడా నారా లోకేష్‌ను 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్'గా పేర్కొంది. ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య కుదిరిన ఒప్పందం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం 30 రోజుల్లోనే రూ.65 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం వెనుక లోకేష్ కీలక పాత్ర ఉందని ఆ పత్రిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా నిర్వహించింది.ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి పెట్టారని జాతీయ మీడియా చెబుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల ఆమోదం, ఐటీ రంగాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు వేగంగా సాగుతున్నాయని విశ్లేషిస్తోంది. ముఖ్యంగా పెట్టుబడిదారులకు క్లియర్ పాలసీలు, వేగవంతమైన అనుమతులు ఇవ్వడం వల్ల ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి పథంలోకి వస్తోందని వ్యాఖ్యానిస్తోంది. మొత్తానికి, నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా తిరిగి నిలదొక్కుకునే దిశగా ముందుకెళ్తోందని జాతీయ మీడియా స్పష్టంగా చెబుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలే కేంద్రబిందువుగా రాష్ట్ర భవిష్యత్తు రూపుదిద్దుకుంటోందన్న అభిప్రాయం మరింత బలపడుతోంది.నారా లోకేష్ ను నాలుగైదేళ్ల కిందట వారసుడిగా మాత్రమే చూసేవాళ్లు. కానీ తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సమర్థవంతమైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే, వ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు సంచలనం సృష్టిస్తున్నాయి. అటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో, ఇటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఆయన చూపిస్తున్న చొరవతో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. లోకేష్ పనితీరు కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందుతోంది. ముఖ్యంగా 'యోగాంధ్ర' వంటి వినూత్న కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఆయన అభిమానాన్ని కూడా చూరగొన్నారు. యువ నాయకత్వంలో లోకేష్ చూపిస్తున్న పరిణతి, అంకితభావంపై ప్రధానికి ఎంతో నమ్మకం ఏర్పడటం విశేషం. ఇది ఆయన రాజకీయ ద

భవిష్యత్తుకు ఒక బలమైన పునాదిగా మారుతోంది.రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో లోకేష్ ఒక ఇండస్ట్రియల్ హీరో గా అవతరించారు. అంతర్జాతీయ కంపెనీలను ఏపీ వైపు మళ్లించడంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు భారతీయ పారిశ్రామిక రంగాన్ని అబ్బురపరుస్తున్నాయి. తాజాగా ప్రముఖ ది వీక్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయనను ప్రదర్శించడం, ఆయన పెరుగుతున్న ప్రాభవానికి నిదర్శనం.

పెట్టుబడుల విషయంలో ఆయన చూపిస్తున్న వేగం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఏపీ పారిశ్రామిక హబ్‌గా మారడం ఖాయమనిపిస్తోంది.లోకేష్ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాలేదు. బీహార్ వంటి ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు అక్కడ ఆయనకు లభించిన ఆదరణ అసాధారణం. అక్కడి యువత లోకేష్‌ను ఒక రోల్ మోడల్‌గా భావించి బ్రహ్మరథం పట్టడం చూస్తుంటే, ఆయన జాతీయ స్థాయిలో ఎదగగల సత్తా ఉన్న నాయకుడని స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన, ఆధునిక సాంకేతికతపై పట్టు ఉన్న లోకేష్, నిశ్చయంగా దేశ రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగే భవిష్యత్ నాయకుడు అని ఎక్కువ మంది అంచనా వేస్తున్నారు.

# ఏపీలో ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ



**తిరుపతి, జనవరి 10, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సందడి ఈసారి సరికొత్త శోభను సంతరించుకుంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పండుగ అంటే కేవలం కాసినోలు, కోడి పందాలు, జూద వినోదాలే అన్నట్లుగా సాగిన పరిస్థితి నుంచి, నేడు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రం కళకళలాడుతోంది. పాలకుల ఆలోచనా ధోరణి మారితే ప్రజల ఉత్సాహం ఎలా ఉంటుందో ప్రస్తుత ఏపీ వేడుకలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో ప్రభుత్వం ఆవకాయ్-అమరావతి సినిమా, సంస్కృతి, సాహిత్యోత్సవం నిర్వహిస్తోంది. తెలుగువారి ఐకానిక్ రుచి ఆవకాయ పేరుతో జరుగుతున్న ఈ వేడుకల్లో సాహిత్యం, కళలు, సినిమా విశ్లేషణలు , సాంస్కృతిక కార్యక్రమాలతో కృష్ణమ్మ తీరం ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యానికి వేదికైంది. జూదానికే పరిమితం కాకుండా, తెలుగు మేధో సంపత్తిని ప్రపంచానికి చాటాలనే లక్ష్యం ఇక్కడ కనిపిస్తోంది.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురాన్ని పీఠికాపురం పేరిట ఆధ్యాత్మిక, సంప్రదాయ వేడుకలకు కేంద్రంగా మార్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సంక్రాంతి మహోత్సవంలో గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలు, జానపద కళారూపాలతో పాతకాలపు పల్లెటూరి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. పీఠికాపురం పురావైభవాన్ని గుర్తు చేస్తూ సాగుతున్న ఈ వేడుకలు స్థానికుల్లో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపాయి.గతంలో పండుగ రోజుల్లో అశ్లీల నృత్యాలు, అక్రమ జూద కేంద్రాలతో భయానక వాతావరణం ఉండేదన్న విమర్శలు ఉండేవి. కానీ ఇప్పుడు ప్రభుత్వం అధికారికంగా సాంస్కృతిక ఉత్సవాలను ప్రోత్సహిస్తుండటంతో సామాన్య ప్రజలు కుటుంబాలతో కలిసి పండుగను ఆస్వాదిస్తున్నారు. హరిదాసుల దీవెనలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ వంటకాలతో ప్రతి ఇల్లు ఒక కళానిలయంగా మారింది. ఇది కేవలం పండుగ మార్పు మాత్రమే కాదు, రాష్ట్రంలో వచ్చిన పాలనాపరమైన మార్పుకు ప్రతిబింబం.ఏపీలో ఇప్పుడు కనిపిస్తున్న సంక్రాంతి కళ కేవలం వినోదం కోసం మాత్రమే కాదు, అది తెలుగు జాతి మూలాలను గౌరవించే ఒక గొప్ప ప్రయత్నం. పాలకుల ప్రాధాన్యతలు మారినప్పుడు, సమాజంలో నైతిక విలువల కంటే సంస్కృతికి పెద్దపీట వేసినప్పుడు ప్రజల్లో ఇలాంటి నిజమైన పండుగ కళ కనిపిస్తోంది.

## భారత్ ను టార్గెట్ చేసిన ట్రంప్

**న్యూఢిల్లీ, జనవరి 10, పెన్ పవర్:** ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు.వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెల్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు.వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు.ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు.అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదననాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది.ట్రంప్‌మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థాను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు.

## స్పైలుగా చిన్నారులు.. మారని పాకిస్తాన్ వైఖరి

**న్యూఢిల్లీ, జనవరి 10, పెన్ పవర్:** పాకిస్తాన్‌కు ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోవడం లేదు. ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐతో కుట్రలు చేస్తూనే ఉంది. తాజాగా ఐఎస్ఐ కుట్రను మన భద్రతా బలగాలు గుర్తించాయి. అయితే ఇందులో అభం శుభం తెలియని 15 ఏళ్ల పిల్లలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పఠాన్‌కోట్‌లో 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. సాధారణ జీవితం గడుపుతున్న అతను రక్షణ స్థావరాలు, భద్రతా సిబ్బంది ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పంచాడు. ఈ ఘటన ఐఎస్ఐ ఆన్‌లైన్ గ్రూమింగ్ వ్యూహాన్ని బయటపెట్టింది.జమ్మూ సాంబార్ ప్రాంతం నుంచి పఠాన్‌కోట్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన ఈ అబ్బాయి వివిధ చోట్ల తిరిగి ఫొటోలు, వీడియోలు సేకరించాడు. రక్షణ శాఖ ఆఫీసులు, నివాసాలు, వాహనాలు లక్ష్యాలు. పోలీసు విచారణలో సోషల్ మీడియా గ్రూపుల్లో అజ్ఞాతుల సూచనలపై ఇలా చేశాడు. పొటోలు, వీడియోలను ఓ గ్రూపులో పోస్టు చేశాడు. బాలుడి తండ్రి చనిపోయి పేదరికంలో ఉన్నాడు. ఐఎస్ఐ ఏజెంట్లు డబ్బు పంపుతూ సమాచారం సేకరించారు.ఆన్‌లైన్ గ్రూమర్లు పిల్లలను ఆకర్షించి నేరాలకు ప్రేరేపిస్తారు. ఇలాంటి బాలురు ఐఎస్ఐకి మిలిటరీ కదలికలు, ఆయుధాల వివరాలు సరఫరా చేస్తున్నారు. పఠాన్‌కోట్ ఎయిర్ బేస్, సరిహద్దు రక్షణ వ్యవస్థలు కీలకం. 2016 జైష్ దాడి ఇక్కడే జరిగింది.అంబాలాలో ప్రైవేటు ఉద్యోగిని అరెస్టు చేశారు. మిలిటరీ పాస్‌తో లోపలికి వెళ్లి సరుకులు అందించే సందర్భంలో ఐఎస్ఐ హనీట్రాప్, బ్లాక్‌మెయిల్‌తో సమాచారం సేకరించింది. 1516 ఏళ్ల పిల్లలను కూడా ఉపయోగిస్తున్నారు.ఈ ఘటనలు భద్రతా ఏజెన్సీలను హెచ్చరికలో ఉంచాయి. పిల్లల ద్వారా సమాచారం సేకరణ కొత్త ఆందోళన. రక్షణ స్థాపనల చుట్టూ పరిశీలనలు పెరిగాయి. పోలీసులు మైనర్‌పై చర్యలు తీసుకుంటూ గ్రూమర్లను గుర్తించాలని ప్రయత్నిస్తున్నారు. పిల్లలను లక్ష్యంగా చేసుకున్న ఈ వ్యూహం జాతీయ భద్రతకు సవాలు. తల్లిదండ్రులు, సమాజం ఆన్‌లైన్ కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలి. భద్రతా దళాలు సోషల్ మీడియా మానిటరింగ్‌ను బలోపేతం చేయాలి.

## ఇండియాలో సుజుకి సరికొత్త రికార్డ్: 1 కోటి వాహనాల తయారీతో సెన్సేషన్..




**న్యూఢిల్లీ, జనవరి 10, పెన్ పవర్:** ప్రముఖ ద్విచక్ర వాహనాల సంస్థ సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా ఒక గొప్ప మైలురాయిని దాటింది. భారతదేశంలో కంపెనీ ప్రయాణాన్ని మొదలుపెట్టినప్పటి నుండి ఇప్పటివరకు 10 మిలియన్లు అంటే 1 కోటి వాహనాలను తయారు చేసి సరికొత్త రికార్డ్ సృష్టించింది. హర్యానాలోని గురుగ్రామ్ ఫ్యాక్టరీ నుండి 1 కోటివ వాహనంగా సుజుకి యాక్సెస్ 125 (రైడ్ కనెక్ట్ ఎడిషన్) బయటకు వచ్చింది.2006 నుండి మొదటి 50 లక్షల వాహనాలను తయారు చేయడానికి కంపెనీకి 14 ఏళ్లు పట్టింది. కానీ, మిగిలిన 50 లక్షల వాహనాలను కేవలం 6 ఏళ్లలోనే తయారు చేసింది. దీన్ని బట్టి సుజుకి వాహనాలకు ఇండియాలో ఎంత డిమాండ్ పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.
సుజుకి విజయాల్లో యాక్సెస్ 125 (ూాఎెఎవం 125) స్కూటర్ కీలక పాత్ర పోషించింది. ఈ స్కూటర్ ఫ్యామిలీస్ కి బాగా ఇష్టమైన స్కూటర్. దీనితో పాటు యువత కోసం బర్గ్‌మాన్ స్ట్రీట్, అవెనిస్ వంటి మోడల్స్ కూడా మంచి అమ్మకాలను సాధిస్తున్నాయి.

**బైక్ లలో కూడా టాప్:**
స్కూటర్లే కాకుండా బైక్ ప్రియుల కోసం సుజుకి జిక్సర్ (Gixxer) సిరీస్‌లో 150cc, 250cc బైక్‌లను అందిస్తోంది. అలాగే పెద్ద బైక్‌ల విభాగంలో హయాబుసా, వి-స్ట్రోమ్ వంటి పవర్ ఫుల్ బైక్‌లను కూడా అమ్ముతోంది.
సుజుకి ఇండియాలోని గురుగ్రామ్ ప్లాంట్ నుండి దాదాపు 60 దేశాలకు వాహనాలను ఎగుమతి చేస్తోంది. మన దేశంలో సుజుకికి 1,200కి పైగా షోరూమ్‌లు, సర్వీస్ సెంటర్లు ఉన్నాయి. పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా, హర్యానాలోని ఖారో?డాలో రెండవ ఫ్యాక్టరీని కూడా నిర్మిస్తున్నారు.

**త్వరలో ఎలక్ట్రిక్ స్కూటర్:**
పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని సుజుకి ఇప్పటికే ఇథనాల్‌తో నడిచే జిక్సర్ SF 250 ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్‌ను పరిచయం చేసింది. అంతేకాకుండా, త్వరలోనే అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ఇ-యాక్సెస్ (e-Access) పేరుతో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి తీసుకురానుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## అసెంబ్లీలో రప్ఫా...రఫ్ఫా రాజకీయం

**నెల్లూరు, జనవరి 10, పెన్ పవర్:** అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వనిదే సభకు హాజరుకామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. ఇప్పటికీ అదే స్టాండ్ తో ఉంది. మరోవైపు వరుసగా పని దినాలు కలుపుకొని శాసనసభకు 60 రోజులపాటు హాజరు కాకుంటే ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడే అవకాశం ఉంది. ఇప్పటికే శాసనసభ ఎథిక్స్ కమిటీ సమావేశం జరిగింది. వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరుపై చర్చించారు. ప్రభుత్వానికి నివేదించనున్నారు. స్పీకర్ ద్వారా మరోసారి నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. సాధారణంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నవంబర్ నుంచి జనవరి మధ్య జరగాలి. కానీ ఈసారి ఆలస్యం జరిగింది. ఫిబ్రవరిలో సమావేశాలు ఉంటాయని తెలుస్తోంది. దాదాపు పది రోజులపాటు సభను కొనసాగించాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం.అయితే ఈసారి కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి సమగ్రంగా వివరించనున్నారు ఈ సభ ద్వారా. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్, విశాఖలో పరిశ్రమల ఏర్పాటు, ఏపీకి భారీగా వస్తున్న ప్రాజెక్టులు, తయారీ రంగం పరిశ్రమలు.. ఇలా ప్రతి అంశం గురించి సమగ్రంగా చర్చించే వీలుగా సభలు ఉండనున్నాయి. అర్థవంతమైన చర్చకు తెర లేపనున్నారు. ముఖ్యంగా విపక్ష పాత్రను కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలు పోషించనున్నారు. ప్రజల తరపున బలమైన వాయిస్ వినిపించి ప్రభుత్వం నుంచి సమాధానాలు రాబట్టనున్నారు. అందుకే లోతైన అధ్యయనం చేయాలని పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు. మంత్రులు కూడా సమగ్ర వివరాలతో సభకు హాజరుకావాలని ఇప్పటికే సంకేతాలు పంపించారు.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన నాటికి రాష్ట్ర పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ఇచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఇటీవల పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ దేశంలోనే ప్రథమ స్థాయిలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనల్లో.. 25% ఏపీకి రావడం నిజంగా శుభపరిణామం. ఇందులో సగం పెట్టుబడులు వచ్చిన ఏపీ అభివృద్ధి సాధించినట్టే. మరోవైపు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టే ఒకవైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అడుగులు వేస్తోంది. అమరావతి రాజధానితోపాటు పోలవరం ప్రాజెక్ట్ వంటి ప్రాధాన్యతాంశాలను పూర్తిచేసేందుకు గట్టి ప్రయత్నాల్లోనే ఉంది. మొన్ననే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది. అయితే వైసీపీ నుంచి మాత్రం అంతా తామే చేసాం అన్నట్టు వాయిస్ వస్తోంది. అందుకే దాదాపు పది రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి.. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది.

## ఆపిల్ సంక్రాంతి ఆఫర్: సగం ధరకే ఐఫోన్ 17.. పాత ఫోన్ ఇచ్చి కొత్త ఐఫోన్ తీసుకెళ్ళండి!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆపిల్ కొత్త ఐఫోన్ 17 సిరీస్, ఐఫోన్ Air మోడల్స్‌ను గత ఏడాది గ్రాండ్‌గా లాంచ్ చేసిన సంగతి మీకు తెలిసిందే. అయితే కొత్త ఐఫోన్ కొనాలనుకునే వారికి లేదా పాత ఐఫోన్ నుండి అప్ గ్రేడ్ అవ్వాలి అనుకునేవారి కోసం ఆపిల్ వెబ్‌సైట్‌లో ఒక అదిరిపోయే ఆఫర్ ఉంది. నిజానికి ఐఫోన్ 17 256+దీ మోడల్ అసలు ధర రూ. 82,900, ఐఫోన్ 17 ప్రో ధర రూ. 1,34,900, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ ధర రూ. 1,49,900

**రూ. 47,900కే ఐఫోన్ 17 ఎలా:**

ఆపిల్ రెండు ఆఫర్ల ద్వారా మీరు సగం ధరకే కొత్త ఐఫోన్ 17ని సొంతం చేసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్ ఆఫర్ ద్వారా మీ దగ్గర పాత ఐఫోన్ 16 ఉండి, మంచి కండిషన్‌లో ఉంటే.. ఆపిల్ దానికి రూ. 34 వేల వరకు ఎక్స్ఛేంజ్ వాల్యూ ఇస్తోంది. దింతో ఫోన్ ధర రూ. 48,900కి అవుతుంది. ఇంకా బ్యాంక్ డిస్కౌంట్ కింద కొన్ని సెలెక్ట్ చేసిన క్రెడిట్ కార్డులపై రూ. 1,000 ఇన్స్టంట్ క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. చివరికి ఈ రెండు ఆఫర్లు కలిపితే, మీరు కొత్త ఐఫోన్ 17ను కేవలం రూ. 47,900కే సొంతం చేసుకోవచ్చు.

**ఐఫోన్ 17 ఫీచర్స్ :**

పాత మోడల్స్‌తో పోలిస్తే ఐఫోన్ 17లో అదిరిపోయే మార్పులు చేశారు. ఇందులో 120ఎట్ ప్రోమోషన్ డిస్‌ప్లే ఉంది. దీనివల్ల స్క్రీన్ టచ్ చాలా స్మూత్‌గా ఉంటుంది. సినిమాలు చూసినా, గేమ్స్ ఆడినా చాలా క్వాలిటీగా కనిపిస్తుంది. ఇందులో కొత్త ూ19 చిప్‌సెట్ వాడారు. దీనివల్ల ఫోన్ అస్సలు హ్యాంగ్ అవ్వదు, పైగా బ్యాటరీ కూడా ఎక్కువ కాలం పాటు లైఫ్ ఇస్తుంది. సెల్ఫీ కెమెరా చుస్తే ముందు వైపు 18 మెగాపిక్సెల్ కెమెరా ఇచ్చారు. ఇందులో 'సెంటర్ స్టేజ్ణ అనే ఫీచర్ ఉంది, దీనివల్ల వీడియో కాల్స్ మాట్లాడేటప్పుడు మీరు కదులుతున్నా కెమెరా మిమ్మల్ని ఫోకస్ చేస్తూ సెంటర్ లోనే ఉంచుతుంది.

బ్యాక్ వెనుక కెమెరా చూస్తే వెనుక వైపు రెండు కెమెరాలు ఉన్నాయి. మెయిన్ కెమెరా 48వీ, అల్ట్రావైడ్ కెమెరా కూడా 48వీ. తక్కువ వెలుతురులో కూడా ఫోటోలు చాలా స్పష్టంగా వస్తాయి. ఈ ఫోన్ 40ఔ వైర్డ్ ఛార్జింగ్ సపోర్ట్ చేస్తుంది. అంటే ఇంతకుముందు కంటే చాలా వేగంగా ఫోన్ ఫుల్ ఛార్జ్ అవుతుంది.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇక మరింత భారీగా..! ఈపీఎఫ్ఓ వేతన పరిమితి పెంపుతో మారనున్న లెక్కలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ రంగంలో పనిచేసే కోట్లాది మంది ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ నిబంధనల్లో కీలక మార్పులు చేసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా ప్రావిడెంట్ ఫండ్ జమ చేయడానికి ప్రాతిపదికగా తీసుకునే వేజ్ సీలింగ్ ని పెంచే దిశగా అడుగులు పడుతున్నాయి. దేశవ్యాప్తంగా జీతాలు పెరుగుతున్న క్రమంలో పాత నిబంధనల వల్ల చాలా మంది ఉద్యోగులు సామాజిక భద్రతా ప్రయోజనాలను కోల్పోతున్నారనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సమీక్ష చేపట్టింది. సుమారు పదేళ్లుగా ఈ పరిమితిలో ఎలాంటి మార్పు లేవు.

ప్రస్తుతం అమలులో ఉన్న రూల్స్ ప్రకారం.. ప్రావిడెంట్ ఫండ్‌లో తప్పనిసరిగా చేరడానికి గరిష్ట నెలవారీ వేతన పరిమితి రూ.15వేలుగా ఉంది. అంటే రూ.15వేల కంటే తక్కువ జీతం ఉన్నవారు తప్పనిసరిగా పీఎఫ్ కట్టాలి. అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు వారి ఈపీఎఫ్ఓ కట్టాలా వద్దా అనే నిర్ణయం తీసుకోవచ్చు. ఈ పరిమితిని చివరిసారిగా 2014 సెప్టెంబర్‌లో సవరించారు. అయితే గడిచిన పదేళ్లలో జీవన వ్యయం పెరగడమే కాకుండా.. కనీస వేతనాలు కూడా చాలా రాష్ట్రాల్లో రూ.15వేల మార్కును దాటేశాయి.

వేతన పరిమితిని పెంచాలనే ప్రతిపాదన చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. గతంలో దీనిని రూ.25వేలకు పెంచాలని ప్రభుత్వం భావించినప్పటికీ.. కంపెనీలపై అదనపు భారం పడుతుందనే ఉద్దేశంతో వాయిదా పడింది. మరోవైపు ఉద్యోగ సంఘాలు ఈ పరిమితిని రూ.30వేలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఇటీవల సుప్రీంకోర్టు ఈ వేతన పరిమితిని నాలుగు నెలల్లోగా సమీక్షించాలని కేంద్ర కార్మిక శాఖను ఆదేశించడంతో ఈ అంశంపై మళ్లీ కదలిక వచ్చింది. కొత్త లేబర్ కోడ్‌ల అమలుకు సిద్ధమవుతున్న తరుణంలో శాలరీపై స్పష్టతనిస్తూ ఈ పరిమితిని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.ఒకవేళ వేతన పరిమితి పెరిగితే.. లక్షలాది మంది అన్ ఆర్గనైజ్డ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. నెలకు పీఎఫ్ రూపంలో జమ అయ్యే సొమ్ము పెరగడం వల్ల, ఉద్యోగ విరమణ నాటికి వారి చేతికి వచ్చే రిటైర్మెంట్ కార్పస్ కూడా గణనీయంగా పెరుగుతుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 7 కోట్ల 40 లక్షల మంది చురుకైన కంట్రిబ్యూటర్లు ఉండగా.. మొత్తం 32 కోట్ల ఈపీఎఫ్ ఖాతాలు ఉన్నాయి. ఈ మార్పు ద్వారా కోట్లాది మంది మధ్యతరగతి, అట్టడుగు స్థాయి ఉద్యోగులకు భవిష్యత్తులో ఆర్థిక భరోసా లభించనుందని విశ్లేషకులు అంటున్నారు.

# వైసీపీలో అమరావతి రచ్చ



**అమరావతి, జనవరి 10, పెన్ పవర్:** ఏపీ రాజధాని. కోటాది మంది ఆంధ్రుల ఆశల నగరం..అమరావతి చుట్టే ఏపీ రాజకీయం. అప్పటి నుంచి అదే చర్చ. ఇప్పటికీ అదే రచ్చ. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన కామెంట్స్..మరోసారి అమరావతిపై హాట్ డిబేట్‌కు దారితీశాయి. ఏపీ రాజధాని ప్రాంతంగా అమరావతి అనుకూలమైంది కాదన్న జగన్..రాజధానికి మౌలిక సదుపాయాల కొరత ఉందని అన్నారు. లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అని కూడా చెప్పుకొచ్చారు.రాజధాని పేరుతో చంద్రబాబు వేలాది ఎకరాల సేకరణ పేరుతో చేస్తున్నది సరైందని కాదని కూడా జగన్ హాట్ కామెంట్స్ చేశారు. సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మరోసారి రాజధాని అంశాన్ని గెలకడంతో అమరావతి విషయంలో మళ్లీ చర్చ నడుస్తోంది. జగన్ వ్యాఖ్యలు కాస్త పొలిటికల్ డైలాగ్‌వార్‌కు దారితీశాయ్. సీఎం చంద్రబాబుతో సహా మంత్రి నారాయణ..వైసీపీ అధినేత వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడంతో కాక మొదలైంది.అమరావతి రాజధాని విషయంలో వైసీపీ ఆలోచనలు మారుతున్నాయా? లేక మూడు రాజధానుల లైన్‌కే కట్టుబడి ఉన్నారా అనే చర్చ జరుగుతోంది. ఒక్కోసారి ఒక్కో తీరుగా వైసీపీ నేతలు స్పందిస్తున్న తీరు గందరగోళానికి దారితీస్తోందని మండిపడుతున్నాయి కూటమి పార్టీలు. ఓసారి మూడు రాజధానుల ముచ్చటే లేదంటారు. మరోసారి సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటారు. అమరావతే రాజధాని కానీ..విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే డెవలప్‌మెంట్‌కు స్కోప్ ఉంటుందని మరో వైసీపీ నేత వాయిస్ వినిపిస్తుంటారు.ఇంతకు ఏపీ రాజధాని అమరావతిపై వైసీపీ స్టాండ్ ఏంటో క్లారిటీ ఇవ్వాలని..జగన్ మాటల్లో కూడా ఈ క్లారిటీ మిస్ అయిందని అంటున్నారు. రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని వ్యతిరేకిస్తున్నారా? రాజధాని నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలను ప్రస్తావిస్తున్నారా? లేక మూడు రాజధానుల నినాదానికే కట్టుబడి ఉన్నారా? ఇదేది స్పష్టత లేదని అంటోంది టీడీపీ. ఓవైపు రాజధాని రైతుల సమస్యలను ప్రస్తావిస్తారు..మరోవైపు లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అంటారు. ఇంతకు జగన్ ఉద్దేశమేంటనేది ఎవరికి అంతు చిక్కడం లేదంటున్నారు టీడీపీ నేతలు. ఏపీకి అంటూ ఓ రాజధాని ఉండాలని ప్రజలు కోరుకుంటుంటే..జగన్ మాత్రం ఏదో ఒక ట్విస్ట్ ఇస్తూ చర్చకు..రచ్చకు ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు.ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా..అమరావతి రైతుల కోరిక ప్రకారం రాజధానికి చట్టబద్దత కోసం..గెజిట్ తెచ్చేందుకు ఏపీ సర్కార్ ప్రయత్నిస్తోంది. ఇలాంటి టైమ్‌లో మాజీ సీఎం జగన్ మరోసారి కన్ఫ్యూజన్ క్రియేట్ చేసేలా..మాట్లాడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు టీడీపీ నేతలు. మూడు రాజధానుల నినాదంతో ఎన్నికలకు వెళ్లిన వైసీపీ దారుణంగా ఓడిపోయిందని మర్చిపోయారా అంటూ గుర్తు చేస్తున్నారు. విశాఖ ఆర్థిక రాజధాని అంటూ ఉత్తరాంధ్రలో..కనీసం కూటమి అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వలేకపోయిందని విమర్శిస్తున్నారు.వైసీపీ ఘోర పరాజయానికి రాజధాని అంశం కూడా ప్రధాన కారణమనే విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు. గుంటూరు జిల్లా నుంచి విజయవాడ వరకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయిందని..అమరావతిని కాదనుకుని..మూడు రాజధానులు అంటూ కొత్త నివాదం ఎత్తుకోవడమే అందుకు కారణమంటూ వైసీపీపై అటాక్‌కు దిగుతున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా..ప్రజల అభిప్రాయం..ఆకాంక్షలకు విరుద్ధంగా జగన్ మాట్లాడాల్సిన తీరు ఇది కాదంటూ తప్పుబడుతోంది టీడీపీ. రాజధాని విషయంలో వైసీపీనే కన్ఫ్యూజన్‌లో ఉందో..లేక ప్రజలనే కన్ఫ్యూజన్‌లో పెట్టి..హిడెన్ ఎజెండాతో ముందుకు వెళ్తుందో తెలియదు కానీ..ఈ గందరగోళానికి చెక్ పెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్.

**రైతులకు మద్దతుగా**

అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన పై ఒక క్లారిటీ వస్తోంది. ఆ పార్టీకి అమరావతి రాజధాని అనేది శాపంగా మారింది. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చే క్రమంలో.. ఒక్క అమరావతి ప్రజలే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతాల ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎంత మాత్రం మార్పు కనిపించడం లేదు. గత కొద్ది రోజులుగా అమరావతి విషయంలో మళ్లీ కలుగజేసుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే అమరావతి రైతులు ఇప్పుడు భయపడుతున్నారు. రెండో విడత భూ సమీకరణకు రకరకాల షరతులు పెడుతున్నారు. అయితే దీని వెనుక ఉన్న కారణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే 2019 నుంచి 2024 మధ్య వారికి చుక్కలు చూపించింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. అందుకే ఇప్పుడు అమరావతి రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచన చేస్తున్నారు.ఇంకా కూటమి ప్రభుత్వానికి మూడేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడు తీసుకున్న భూములకు బదులు రిటర్నబుల్ ఫ్లాట్స్ అభివృద్ధి చేయాలన్నది ఈ షరతు. అలా చేయకపోతే మూడు సంవత్సరాల్లో ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే ఎన్నికలు జరుగుతాయి. పొరపాటున మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి వారికి తెలుసు. అందుకే కూటమి ప్రభుత్వం ఎదుట ఈ కీలక ప్రతిపాదన పెడుతున్నారు. ఒకటి కూటమి ప్రభుత్వానికి హెచ్చరించినట్లు అవుతుంది. ముందే జాగ్రత్త పడినట్లు అవుతుంది.అమరావతి రైతుల్లో భయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక కారణం. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ కొత్త పల్లవి అందుకుంటుంది. అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి అమరావతి రైతులకు ఎంతలా ఇబ్బంది పెట్టాలో అంతలా పెట్టారు. ఇప్పుడు రైతుల భయాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్వాన్స్ గా తీసుకుంటుంది. గత ఎన్నికల్లో ఓటమి ఎదురైన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి ప్రస్తావన తెచ్చేందుకు భయపడేది. కానీ అదనపు భూ సమీకరణకు ప్రభుత్వం దిగడంతో రైతుల నుంచి ఒక రకమైన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అయితే దానిని అసంతృప్తిగా భావిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది అసంతృప్తి కాదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై భయం అన్న విషయం మరిచిపోతోంది. అమరావతి ప్రాంత రైతులు ప్రత్యామ్నాయంగా జగన్మోహన్ రెడ్డిని చూడరు. అవసరం అనుకుంటే ఏ చిన్న పార్టీ కైనా అక్కడ అవకాశం ఇస్తారే కానీ.. అమరావతి రైతులపై ఎంత ప్రేమ వలకబోసినా వారు మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంత మాత్రం ఛాన్స్ ఇవ్వరు. ఇది ముమ్మాటికి వాస్తవం.

# ఏపీలో కారవాన్ టూరిజం ప్రారంభం.. ఎంచక్కా 4 మార్గాల్లో ప్రయాణం

**విజయవాడ, జనవరి 10, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా కారవాన్ టూరిజం ప్రారంభమైంది. ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా వీటిని బుక్ చేసుకుని టీవీ, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి సదుపాయాలతో ప్రయాణించవచ్చు.మీకు కారవాన్ అనగానే సెలబ్రిటీలు, ముఖ్యంగా సినీ ప్రముఖులు గుర్తుకొస్తారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం పర్యారక రంగానికి ఊతమిచ్చేందుకు కారవాన్ టూరిజాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు కూటమి ప్రభుత్వం మొదటిసారిగా కారవాన్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గోవాల వంటి రాష్ట్రాల తరహాలోనే ఏపీలో కూడా పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఓజీ డ్రీమ్ లైనర్స్, ఇండియా లక్సీ కారవాన్ ూౌ అనే రెండు సంస్థలను ఎంప్యానల్ చేసింది. ప్రస్తుతం ఈ సంస్థలు 5, 6 సీట్లు, 10-12 సీట్ల సామర్థ్యం కలిగిన నాలుగు వాహనాలను నాలుగు ప్రధాన మార్గాల్లో నడుపుతున్నాయి. ఆసక్తి గల పర్యాటకులు వీటిని నేరుగా ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నుండి భీమవరం, దిండి వరకు ప్రత్యేకంగా 6 రోజుల ప్యాకేజీని ప్రకటించారు. ఈ ప్యాకేజీ ధర రూ.3.50 లక్షలుగా నిర్ణయించారు. జనవరి 10, 11, 12 తేదీల్లో బుకింగ్ చేసుకున్న వారికి ఆ రోజు నుండి ఆరు రోజుల పాటు ఈ ప్రయాణం సాగుతుంది. పండుగ సెలవుల్లో వినూత్నంగా ప్రయాణించాలనుకునే పర్యాటకుల కోసం హైదరాబాద్ నుండి 4 కారవాన్ వాహనాలు అందుబాటులో ఉంచారు.ఈ కారవాన్ టూరిజంలో భాగంగా పర్యాటకుల సౌకర్యార్థం సకల వసతులు కల్పించారు. పగటిపూట పర్యాటక ప్రాంతాలను సందర్శించి, రాత్రి వేళల్లో కారవాన్‌లోనే నిద్రించేలా సీట్లను పడకలుగా మార్చుకునే వీలుంటుంది. వీటిలో టీవీ, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. భోజనం కోసం పర్యాటకుల కోరిక మేరకు నచ్చిన హోటళ్ల వద్ద వాహనాన్ని ఆపుతారు. అయితే భోజన ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుంది. భద్రత దృష్ట్యా రాత్రి సమయాల్లో ఈ వాహనాలను పర్యాటక శాఖ హోటళ్లు లేదా ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల ప్రాంగణాల్లో పార్కింగ్ చేస్తారని తెలిపారు.

**కారవాన్ టూరిజం నాలుగు రూట్లు ఇవే..**

రూట్ 1: విశాఖపట్నం నుంచి అరకు, లంబసింగి (ఒకటిన్నర రోజు)
ప్యాకేజీ ధర 42,500 రూపాయలుగా నిర్ణయించారు (10- 12 సీట్ల కారవాన్), రూ.31,500 (5 నుంచి 6 సీట్లు)
రూట్ 2: విశాఖపట్నం నుంచి సింహాచలం, అన్నవరం, పిఠాపురం, ద్రాక్షారామం, సామర్లకోట, మీదుగా వాడపల్లి (ఒకటిన్నర రోజు)
ప్యాకేజీ ధర రూ.42,500 గా నిర్ణయించారు (10 నుంచి 12 సీట్ల కారవాన్), రూ.31,500 (5 నుంచి 6 సీట్లు)
రూట్ 3: హైదరాబాద్ నుంచి ఏపీలోని గండికోట (రెండు రోజుల టూర్)
ఈ ప్యాకేజీ ధర రూ.85,000 (10 నుంచి 12 సీట్లు), రూ.64,000గా (5, 6 సీట్లు) నిర్ణయించారు.
రూట్ 4: హైదరాబాద్ నుంచి సూర్యలంక (రెండు రోజులు టూర్) 10 నుంచి 12 సీట్లకు ప్యాకేజీ ధర రూ.85,000 కాగా, 5- 6 సీట్లకు రూ.64,000గా ప్రకటించారు.

ఈ కారవాన్ టూరిజం సక్సెస్ అయితే త్వరలో మరిన్ని కారవాన్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. మరిన్ని మార్గాల్లో కారవాన్ టూరిజాన్ని ప్రోత్సహించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.

# హాట్ టాపిక్ గా వైసీపీ నేతల ఆస్తులు

**విజయవాడ, జనవరి 10, పెన్ పవర్:**

గత పదేళ్ల కాలంలో ఎంపీల ఆస్తుల్లో జరిగిన మార్పులపై ఏడీఆర్ సంస్థ చేసిన తాజా అధ్యయనం దేశ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా 2014 నుంచి 2024 వరకు వరుసగా మూడు సార్లు గెలిచిన 102 మంది ఎంపీల ఆస్తుల వివరాలను ఈ సంస్థ విశ్లేషించింది. ఈ అధ్యయనంలో అత్యంత వేగంగా ఆస్తులు పెరిగిన ఎంపీల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కీలక స్థానాల్లో నిలవడం విశేషంగా మారింది.టాప్ మూడు ఎంపీల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారే కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు, ఆ ఇద్దరూ ఒకే రాజకీయ పార్టీ అయిన వైసీపీకి చెందిన వారు కావడం మరింత ఆసక్తికర అంశం. రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మిథున్ రెడ్డి ఆస్తులు పదేళ్లలో ఏకంగా 550 శాతం పెరిగినట్లు ఏడీఆర్ వెల్లడించింది. 2014లో ఆయన ఆస్తులు సుమారు రూ.22 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.66 కోట్లకు చేరాయి. 2024లో ఇవి రూ.146 కోట్లకు పెరిగినట్లు అఫిడవిట్‌లో నమోదైంది. ఈ వేగవంతమైన పెరుగుదలతో దేశవ్యాప్తంగా అత్యధికంగా ఆస్తులు పెరిగిన ఎంపీల్లో ఆయన మూడో స్థానంలో నిలిచారు.ఇక కడప లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయి. 2014లో ఆయన ప్రకటించిన

ఆస్తుల విలువ రూ.7 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.18 కోట్లకు చేరింది. 2024 ఎన్నికల సమయంలో ఇవి రూ.40 కోట్లుగా నమోదయ్యాయి. ఆస్తుల పెరుగుదల పరంగా చూస్తే ఆయన దేశంలో 15వ స్థానంలో నిలిచినట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.ఈ ఇద్దరిని మించి టాప్ స్థానంలో నిలిచిన ఎంపీ జార్ఖండ్‌కు చెందిన విజయ్ కుమార్ హన్సదక్ అని అధ్యయనం స్పష్టం చేసింది. జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీకి చెందిన ఈ నేత రాజ్ మహల్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014లో ఆయన ఆస్తులు కేవలం రూ.68.63 లక్షలుగా ఉండగా, 2024 నాటికి రూ.6 కోట్లకు పెరిగాయి. ఇది దాదాపు 804 శాతం పెరుగుదలగా ఏడీఆర్ లెక్కించింది.తెలంగాణకు చెందిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆస్తులు కూడా పదేళ్లలో 488 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో ఆయన 24వ స్థానంలో నిలిచారు. ఇక ఏపీ నుంచి టీడీపీ తరఫున గెలిచిన ఏకైక ఎంపీ, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆస్తులు 177 శాతం పెరిగాయి. పెరుగుదల పరంగా ఆయన 28వ స్థానంలో ఉన్నారు.ఇదిలా ఉండగా, ఆస్తులు తగ్గిన అరుదైన ఉదంతంగా కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ పేరు వినిపిస్తోంది. గుజరాత్‌లోని నవ్‌సారి నుంచి హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఆయన ఆస్తులు పదేళ్లలో 47 శాతం తగ్గినట్లు తేలింది. 2014లో రూ.74.47 కోట్లుగా ఉన్న ఆయన ఆస్తులు 2024 నాటికి రూ.39.49 కోట్లకు తగ్గాయి. మొత్తంగా దేశవ్యాప్తంగా ఎంపీల ఆస్తుల సగటు పెరుగుదల 110 శాతంగా ఉందని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. టాప్ 10లో ఐదుగురు బీజేపీ ఎంపీలు ఉండగా, వైసీపీ రెండో స్థానంలో నిలవడం గమనార్హంగా మారింది.

## ఇన్వెస్టర్లకు హెచ్చరిక: 5 ఏళ్లుగా మంచి లాభాలు సంపాదించారా..? అయితే మునిగిపోతారు జాగ్రత్త




**హైదరాబాద్ పెన్ పవర్:** జీవితంలో డబ్బు సంపాదించడం ఒక ఎత్తు అయితే.. ఆ వచ్చిన డబ్బును నిలబెట్టుకోవడం మరో పెద్ద పని. ప్రపంచంలో చాలా మంది డబ్బు సంపాదిస్తారు కానీ కొందరి వద్దే అది నిలబడటానికి కారణం దాన్ని వృద్ధి చేసే అలాగే హోల్డ్ చేసే టాలెంట్ చాలా మంది వద్ద లేకపోవటమే. చాలా మందికి ఆర్థిక రంగంలో కొన్ని ఏళ్ల అనుభవం రాగానే తాము అంతా నేర్చేసుకున్నామనే అతివిశ్వాసం మొదలవుతుంది. సరిగ్గా ఇదే పాయింట్ వద్ద ఇన్వెస్టర్లు తమ జీవితంలో అతిపెద్ద ఫైనాన్షియల్ మిస్టేక్స్ చేస్తుంటారని అన్నారు జాక్టర్ మనీ వ్యవస్థాపకులైన సీఏ అభిషేక్ వాలియా. 5 ఏళ్ల పాటు వరుసగా లాభాలు రావడం లేదా ఆదాయం పెరగడం అనేది ఒక ఇన్వెస్టర్‌కు అత్యంత ప్రమాదకరమైన సమయమని సీఏ హెచ్చరిస్తున్నారు.సాధారణంగా ఒక వ్యక్తి ఐదేళ్ల పాటు మార్కెట్లో మంచి రాబడిని చూసినప్పుడు.. తన నిర్ణయాలన్నీ సరైనవేనని బలంగా నమ్ముతుంటాడు. మార్కెట్ పరిస్థితులు అనుకూలించడం వల్ల వచ్చిన లాభాలను తన మేధస్సు వల్ల వచ్చినవిగా భావించడం ఇక్కడే మొదలవుతుంది. ఈ దశలో ఇన్వెస్టర్లు తమ శక్తికి మించి రిస్క్ తీసుకోవడం ప్రారంభిస్తారు. ఆదాయం స్థిరంగా పెరుగుతోంది కదా అన్న ధీమాతో భారీగా అప్పులు చేయడం, లగ్జరీ వస్తువుల కోసం ఖర్చు చేయడం లేదా అత్యంత రిస్క్ ఉన్న పథకాల్లో భారీగా పెట్టుబడి పెట్టడం వంటివి చేస్తుంటారని సీఏ హెచ్చరించారు. భవిష్యత్తు కూడా గడిచిన ఐదేళ్లలాగే సాఫీగా సాగుతుందని వారు భ్రమపడి ఆర్థిక చిక్కుల్లో ఇరుక్కుంటుంటారని అన్నారు.కానీ ఫైనాన్షియల్ మార్కెట్లు ఎప్పుడూ ఒకే దిశలో పయనించవని ఇన్వెస్టర్లు గురించారన్నారు సీఏ. మార్కెట్ సైకిల్ మారినప్పుడు లేదా ఆదాయ వనరులు తగ్గినప్పుడు, అప్పటివరకు సౌకర్యవంతంగా అనిపించిన అప్పులే భారంగా మారుతాయన్నారు. ఓవర్ కాన్ఫిడెన్స్ తో చేసిన పెట్టుబడులు నష్టాలను మిగిల్చినప్పుడు ఇన్వెస్టర్లు కోలుకోలేని దెబ్బ తింటారని పేర్కొన్నారు. ఐదేళ్ల విజయం వచ్చే ఇరవై ఏళ్ల భవిష్యత్తును నిర్ణయించలేదని చాలా మంది ఆలస్యంగా గుర్తిస్తారని.. ముఖ్యంగా ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియో అగ్రెసివ్‌గా ఉన్నప్పుడు మార్కెట్ కరెక్షన్ కు లోనైతే ఆ షాక్‌ను తట్టుకునే కుషన్ లేకపోవడం వల్ల భారీగా నష్టపోతారని వివరించారు.నిజమైన విజయవంతమైన ఇన్వెస్టర్లు భిన్నంగా ఆలోచిస్తారని అభిషేక్ వాలియా వివరిస్తున్నారు. విజయాన్ని చూసి పొంగిపోరు, అలాగే ఓవర్ కాన్ఫిడెన్స్ తో అప్పులు పెంచుకోరని చెప్పారు. మార్కెట్లు ఎంత లాభాలను ఇస్తున్నప్పటికీ వారి ప్రవర్తన మాత్రం చాలా కన్జర్వేటివ్ గానే ఉంటుందన్నారు. వారు ఎప్పుడూ అనుకోని పరిస్థితులకు సిద్ధంగానే ఉంటారన్నారు. ఆర్థిక రంగంలో 'వినయం' అనేది మెమెంటం కంటే ఎక్కువ కాలం నిలుస్తుందని తేల్చి చెప్పారు. వేగం ఎప్పుడైనా ఆగిపోవచ్చు.. కానీ వినయం ఉన్న ఇన్వెస్టర్ మార్కెట్ ఒడిదుడుకులకు లోనైనప్పుడు పానిక్ అవ్వకుండా.. దీర్ఘకాలిక లక్ష్యాల వైపు స్థిరంగా పయనించగలడన్నారు. ఐదేళ్ల విజయం మీకు పాఠాలు నేర్పవచ్చు, కానీ అంతా నేర్చేసుకున్నామనే భ్రమలో ఉంటే మాత్రం అది భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకునేలా చేస్తుందని ఇన్వెస్టర్ల మైండ్ సెట్ మిస్టేక్స్ వల్ల నష్టపోతున్న తీరు గురించి చెప్పారు

## డిజిటల్ ఎకానమీ దిశగా నేపాల్.. కొత్త క్యాష్ పేమెంట్ రూల్స్.. మారిన లిమిట్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** నేపాల్ ప్రభుత్వం తన ఆర్థిక వ్యవస్థలో పారదర్శకతను పెంచే దిశగా సంచలన నిర్ణయం తీసుకుంది. జనవరి 15 నుంచి డబ్బు వినియోగం గురించి కొత్త రూల్స్ అమలులోకి తీసుకొస్తోంది నేపాల్. వస్తుసేవల క్రయవిక్రయాలకు సంబంధించి నగదు లావాదేవీలపై పరిమితిని విధించింది. ఇకపై నేపాల్‌లో ఏ వ్యక్తి అయినా.. లేదా సంస్థ అయినా ఒక ట్రాన్సాక్షన్ లో 5 లక్షల నేపాలీ రూపాయలకు మించి క్యాష్ నేరుగా చెల్లించడానికి వీలుండదు. దీనికంటే పెద్ద మెత్తంలో చెల్లింపులు చేయాలంటే తప్పనిసరిగా బ్యాంకింగ్ వ్యవస్థ లేదా డిజిటల్ పేమెంట్ వ్యవస్థలను ప్రజలు వాడాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.నేపాల్ ఈ కఠిన నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం అంతర్జాతీయ ఒత్తిడితో పాటు అంతర్గత ఆర్థిక భద్రత సమస్యలే. ప్రస్తుతం నేపాల్ అంతర్జాతీయ మనీ లాండరింగ్ నిరోధక సంస్థ గ్రే లిస్ట్లో ఉంది. దేశంలో ఆర్థిక కార్యకలాపాల్లో మనీ లాండరింగ్, ఉగ్రవాద నిధుల సరఫరాను అరికట్టడానికి 'మనీ లాండరింగ్ నిరోధక చట్టం, 2008' కింద ఈ నగదు పరిమితిని విధించారు. గతంలో ఈ నగదు లావాదేవీల పరిమితి 10 లక్షల రూపాయలుగా ఉండగా.. ప్రస్తుతం దానిని సగానికి తగ్గిచటం జరిగింది. నేపాల్ సెంట్రల్ బ్యాంక్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. కంపెనీలు, సంస్థలు లేదా కార్యాలయాల పేరుతో జారీ అయ్యే చెక్కులు తప్పనిసరిగా 'అకౌంట్ పేయీ' మాత్రమే అయి ఉండాలి. అంటే ఆ నగదు నేరుగా సంబంధిత వ్యక్తి లేదా సంస్థ ఖాతాలోకే జమ అవుతుంది. అయితే ఈ రూల్ నుంచి ప్రభుత్వం కొన్ని మినహాయింపులు కూడా ఇచ్చింది. బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేయడం, తీసుకున్న రుణాల అసలు వడ్డీ చెల్లించడం, ఆర్థిక సంస్థల మధ్య జరిగే అంతర్గత లావాదేవీలకు ఈ 5 లక్షల పరిమితి వర్తించదని నేపాల్ వెల్లడించింది.అంతేకాకుండా సరైన కారణంతో పాటు డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే వివరాలు చూపిస్తే దేశంలో భారీగా నగదును తీసుకెళ్లేవారికి ఎటువంటి ఆంక్షలు ఉండవు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా డిపాజిటర్ పరిమితికి మించి నగదు కావాలని దరఖాస్తు చేసుకుంటే.. బ్యాంకులు ఆ కారణం సరైనదిగా భావిస్తే డబ్బు ఇవ్వొచ్చు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు నేపాల్ వేగంగా అడుగులు వేస్తోందనడానికి తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. క్యాష్ వినియోగాన్ని తగ్గించి.. ప్రతి పైసా లెక్కలోకి వచ్చేలా చేయడం ద్వారా దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేయాలని నేపాల్ ప్రభుత్వం భావిస్తోంది.

## రష్యా అధ్యక్షుడు పుతిన్‌ని కూడా వెనిజులా మదురోలా ఎత్తుకెళతారా..? ట్రంప్ కీలక కామెంట్స్..

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బలగాలు బంధించి.. విచారణ పేరుతో అమెరికాకు తరలించిన సంగతి తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విషయంలోనూ అటువంటి సాహసోపేతమైన చర్య తీసుకునే అవకాశం ఉందా? రష్యా లాంటి దేశంపై ట్రంప్ ఇలాంటి ఆలోచన కలలో కూడా చేయగలరా అనే ప్రశ్నలు కూడా సోషల్ మాడియాలో ఉన్న సంగతి తెలిసిందే. ఇలాంటి ప్రశ్నలకు ట్రంప్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. పుతిన్‌ను బంధించేందుకు ఎటువంటి ప్రత్యేక సైనిక చర్య అవసరం ఉంటుందని తాను అనుకోవడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. గతంలో పుతిన్‌తో తనకు ఉన్న సంబంధాలను గుర్తు చేసుకుంటూ.. ఆయనతో నాకు ఎప్పుడూ మంచి సంబంధాలే ఉండేవి అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుత రష్యా తీరుపై ఆయన అసంతృప్తిని కూడా వ్యక్తం చేశారు. పుతిన్ ప్రవర్తన నాకు చాలా నిరాశ కలిగించిందంటూనే.. పుతిన్‌ను పట్టుకోవాల్సిన అవసరం రాకపోవచ్చని ట్రంప్ అన్నారు. అమెరికా, రష్యాల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న కోల్డ్ వార్ తరహా పోటీ నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మరోవైపు.. వెనిజులాలో మదురో అధికారం కోల్పోయిన తర్వాత అక్కడి క్రూడ్ ఆయిల్ నిల్వలపై అమెరికా తన పట్టును బిగిస్తోంది. ఈ క్రమంలోనే భారత్‌కు ఒక శుభవార్త వినిపించింది. అమెరికా నియంత్రణలో ఉండే కొత్త నిబంధనల ప్రకారం భారత్ మళ్లీ వెనిజులా నుంచి ముడి చమురును కొనుగోలు చేసేందుకు వాషింగ్టన్ అంగీకరించింది. భారత్ వంటి ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థకు ఇంధన అవసరాలు భారీగా ఉన్నాయని గుర్తించిన అమెరికా.. రష్యా నుంచి దిగుమతులకు దూరం చేసేందుకు ఈ వెసులుబాటు కల్పించిందని తెలుస్తోంది. దీనిపై చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే తుది నిర్ణయం వెలువడుతుందని వైట్ హౌస్ అధికారులు స్పష్టం చేశారు.అమెరికా ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్టోఫర్ రైట్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ.. అమెరికా ప్రతిపాదించిన విధానం ప్రకారం దాదాపు అన్ని దేశాలకు వెనిజులా క్రూడ్ ఆయిల్ అమ్మటానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల రష్యాపై చమురు కోసం ఆధారపడటం తగ్గుతుందని, భారత్ వంటి దేశాలకు ప్రత్యామ్నాయ మార్గం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలకు తాజా పరిస్థితులు నిదర్శనంగా మారాయి.

# భోగి పండుగ జనవరి 14.. మళ్లీ 2040 దాకా ఇలాంటి రోజు రాదు..!

**సంక్రాంతి పండుగ వచ్చిందంటే సిటీ జనాలు ఊళ్ల బాట పడతారు. 24 గంటలు రద్దీగా ఉండే పట్టణాలు ఒక్కసారిగా వెలవెలబోయి సిటీల్లో మార్పు కనిపిస్తుంది. ఒక్క సిటీలోనే కాదు సంక్రాంతి పండుగ సమయంలో ప్రకృతిలో కూడా మార్పులొస్తాయి. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన సమయం ఆధారంగా సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. ఆ రోజుకు ముందు రోజు భోగి పండుగను ఎంతో వైభవంగా జరుపుకుంటారు. కాని ఈ ఏడాది భోగి రోజు ( జనవరి 14)కు చాలా విశిష్టత ఉందని పండితులు చెబుతున్నారు. మళ్లీ ఇలాంటి రోజు 2040 వరకు రాదని చెబుతున్నారు. ఈ ఏడాది భోగి రోజుకు ఉన్న విశిష్టత గురించి తెలుసుకుందాం...!**



**హైదరాబాద్ పెన్ పవర్:** సంక్రాంతి పండుగ కాలంలో సూర్యుడు దక్షిణయానం నుంచి ఉత్తరాయానంలోకి ప్రవేశిస్తాడు. ఈ మార్పుతో పాటు వాతావరణంలో చలి తీవ్రత పెరుగుతుంది. చలిని ఎదుర్కొనే సంప్రదాయంగా భోగి మంటలు వేయడం ద్వారా సంక్రాంతి ఉత్సవాలు మొదలవుతాయి. ఈ రోజునే భోగి పండుగగా జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ఈ ఆచారం ఎక్కువగా కనిపిస్తుంది. చలి తగ్గాలని కోరుకోవడం మాత్రమే కాకుండా పాతవి వదిలి కొత్త జీవితానికి స్వాగతం పలకడం అనే భావన కూడా ఈ మంటల వెనుక ఉంది.

2026 సంవత్సరంలో భోగి పండుగకు మరింత ప్రత్యేకత ఏర్పడింది. ఈ ఏడాది భోగి రోజునే పుష్య మాసం కృష్ణ పక్షం ఏకాదశి తిథి ప్రారంభమవుతుంది. జనవరి 13 సాయంత్రం 3 గంటల 18 నిమిషాల నుంచి ఈ ఏకాదశి తిథి ప్రారంభమై జనవరి 14 సాయంత్రం 5 గంటల 53 నిమిషాల వరకు కొనసాగుతుంది. ఈ ఏకాదశిని షట్తిల ఏకాదశిగా పిలుస్తారు. భోగి పండుగ మరియు ఏకాదశి ఒకే రోజున కలసి రావడం చాలా అరుదైన సంఘటనగా పండితులు చెబుతున్నారు..

### భోగి రోజే షట్తిల ఏకాదశి

భోగి రోజున కొన్ని నియమాలు పాటించడం ఆనవాయితీ. కానీ ఈసారి ఏకాదశి కూడా కలసి రావడంతో ఈ దినానికి మరింత ఆధ్యాత్మిక విలువ ఏర్పడింది. ఉపవాసం ఉండడం, విష్ణు పూజ చేయడం వంటి ఆచారాలు ఈ రోజున చేయడం శుభప్రదంగా భావిస్తారు.

### తులసి వనంలో గోదాదేవి..

భోగి పండుగకు గోదాదేవి చరిత్ర కూడా బలంగా ముడిపడి ఉంది. సూర్యుడు ధనుర్మాసంలో ప్రవేశించిన రోజునే తులసి వనంలో గోదాదేవి అవతరించినట్లు పురాణ కథనం. ఆమె బాల్యంలోనే విష్ణుమూర్తి పట్ల భక్తి పెంచుకుని, పెద్దయ్యాక ఆయనను తప్ప మరెవ్వరినీ వివాహం చేసుకోనని నిర్ణయించుకుంది. పెద్దలు ఆమె సంకల్పాన్ని గౌరవించి విష్ణుమూర్తికే వివాహం చేయాలని నిర్ణయించారు.

గోదాదేవి తన కోరిక నెరవేరాలనే భావంతో ధనుర్మాసం మొత్తం 30 రోజుల పాటు ప్రతిరోజూ పాశురాలు పాడుతూ, పొంగలి మాత్రమే నైవేద్యంగా స్వీకరిస్తూ తపస్సు చేసినట్లు చెబుతారు. ఈ విధంగా 30 రోజులు గడిచిన తరువాత రంగనాథుడు ప్రత్యక్షమై ఆమెను వివాహం చేసుకుంటానని వరమిచ్చాడు. పెద్దల సమ్మతితో రంగనాథపురంలో రంగనాథుడు ... గోదాదేవిల వివాహం ఘనంగా జరిగిందని పురాణాల ద్వారా తెలుస్తుంది. ఈ సంఘటన భోగి పండుగ రోజున జరిగినట్లు సంప్రదాయం చెబుతుంది. అందుకే భోగి రోజున అనేక ఆలయాల్లో గోదా కళ్యాణం నిర్వహిస్తారు.

### ఉపవాస నియమం..

ఈ ఏడాది ( 2026) భోగి రోజునే షట్తిల ఏకాదశి రావడంతో కొన్ని ప్రత్యేక ఆచారాలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ రోజున ఉపవాస నియమం పాటించడం ఎంతో శుభప్రదమని చెబుతారు. అలాగే నువ్వుల పిండి లేదా నువ్వుల నూనెను శరీరానికి పూసుకుని స్నానం చేయడం, స్నాన జలంలో నల్ల నువ్వులు కలపడం మంచి ఫలితాలు కలుగుతాయని శాస్త్రాల ద్వారా తెలుస్తుంది. ఈ విధంగా చేయడం వల్ల జాతకంలోని దోషాలు తొలగి అంతా శుభం కలుగుతుందని పండితులు చెబుతున్నారు.

### భోగి మంటలకు..

ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే భోగి మంటలకు ప్రత్యేక అర్థం ఉందని పండితులు చెబుతారు. దక్షణయాన కాలంలో ఎదురైన కష్టాలు తొలగి, ఉత్తరాయాణంలో మంచి రోజులు ప్రారంభమవాలని కోరుకుంటూ ఈ మంటలు వేస్తారని విశ్వాసం. అందుకే భోగి పండుగను కేవలం ఆచారంగా కాకుండా ఆత్మశుద్ధి దినంగా కూడా భావిస్తారు.

షట్తిల ఏకాదశి రోజున నువ్వులను ఏదో ఒక రూపంలో ఆహారంగా తీసుకోవడం ప్రత్యేకంగా చెప్పబడింది. అలాగే నువ్వులను దానం చేయడం కూడా ఈ రోజున విశిష్టంగా భావిస్తారు. విష్ణు సహస్రనామ పారాయణం చేయడం, విష్ణుమూర్తిని స్మరించడం ఈ ఏకాదశి రోజున మరింత పుణ్యదాయకమని పండితులు సూచిస్తున్నారు.

### వామన అవతారంలో..

భోగి మంటల వెనుక పురాణ గాథ కూడా ప్రసిద్ధి చెందింది. వామన అవతారంలో వచ్చిన శ్రీమహావిష్ణువు బలి చక్రవర్తిని పాతాళానికి పంపిన తరువాత అతనికి ఒక వరం ఇచ్చినట్లు పురాణాలు చెబుతాయి. ఆ వరం ప్రకారం బలి చక్రవర్తి పాతాళానికి రాజుగా ఉండాలి. అలాగే ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగకు ముందు అంటే భోగి రోజున భూలోకానికి వచ్చి ప్రజలను దర్శించి ఆశీర్వదించాలి అని విష్ణువు అనుగ్రహించినట్లు కథనం. అందుకే సంక్రాంతికి ముందు రోజు భోగి మంటలు వేసి బలి చక్రవర్తిని ఆహ్వానించే సంప్రదాయం ఏర్పడిందని పురాణాల ద్వారా తెలుస్తుంది. . !


# పూణే రియల్ ఎస్టేట్ బబుల్.. రూ.కోటి 80లక్షలు ఉన్న ఫ్లాట్ రెండు వారాల్లో రూ.2 కోట్లు అయ్యింది




**హైదరాబాద్ పెన్ పవర్:** పూణేలో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెరుగుతున్న రేట్లు, స్పీడు ఇప్పుడు సామాన్యులకు చుక్కలు చూపిస్తోంది. కేవలం 15 రోజుల్లోనే ఒక ఫ్లాట్ ధర ఏకంగా రూ.20 లక్షల వరకు పెరగడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కునాల్ గాంధీ అనే నెటిజన్ ఎక్స్ వేదికగా పంచుకున్న తన అనుభవం మెట్రో నగరాల్లో రియల్ ఎస్టేట్ బబుల్ ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతోంది.

కునాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పూణేలో ఒక కొత్త ప్రాజెక్ట్ లాంచ్ అయిన సమయంలో 3బీఎచ్‌కే ఫ్లాట్ కోసం వెళ్లినప్పుడు బిల్డర్ రూ. కోటి 80లక్షలు కోట్ చేశారని వెల్లడించారు. సరిగ్గా రెండు వారాల తర్వాత మళ్ళీ వెళ్తే.. అదే ఫ్లాట్ ధర రూ.కోటి 95లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. నిన్న మరోసారి వాకబు చేస్తే ఆ ధర రూ. 2 కోట్లకు చేరుకుందని.. వచ్చే నెలకల్లా అది రూ.2కోట్ల 15 లక్షలు అవుతుందని రియల్టర్లు చెబుతున్నట్లు తన ట్వీటులో వివరించారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు ఇది నిజమైన డిమాండ్ వల్ల జరుగుతోందా లేక కృత్రిమంగా సృష్టించిన కొరత అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది నెటిజన్లు బిల్డర్ల మాయాజాలాన్ని తప్పుపడుతున్నారు. కేవలం 80 శాతం ప్రాజెక్ట్ అమ్ముడైపోయిందని తప్పుడు ప్రచారం చేస్తూ.. లేని డిమాండ్ సృష్టించి రేట్లు పెంచుతున్నారని ఆరోపిస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు పెరగడం లేదు కానీ.. ఆస్తుల విలువ మాత్రం రాకెట్ వేగంతో దూసుకుపోతోందని, ఇది సామాన్యుడిని కోలుకోలేని అప్పుల ఊబిలోకి నెట్టేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం అధిక జీతాలున్న వారి కొనుగోలు శక్తి పెరగడం వల్లే ఇలా ఎడాపెడా రేట్లు పెరిగిపోతున్నాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద పూణే రియల్ ఎస్టేట్ రేట్ల వేగం ఇప్పుడు దేశవ్యాప్త చర్చకు దారితీసింది.

# శ్రీధర్ వెంబు విడాకుల కేసు.. భార్య ఆరోపణలు.. జోహో వెంబు వివరణ.. అసలేం జరుగుతోంది?



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ టెక్ కంపెనీ జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు.. ఆయన భార్య ప్రమీలా శ్రీనివాసన్ మధ్య జరుగుతున్న విడాకుల పోరాటం ప్రస్తుతం కార్పొరేట్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు 5 బిలియన్ డాలర్లు దాదాపు రూ. 45వేల కోట్లకు పైగా విలువైన సాఫ్ట్‌వేర్ సామ్రాజ్యంలో వాటాలకు సంబంధించి జరుగుతున్న ఈ న్యాయపోరాటం.. ఇప్పుడు రూ.15వేల కోట్ల విలువైన బాండ్ల చుట్టూ తిరుగుతోంది. సామాన్యులకు సైతం ఆశ్చర్యం కలిగించే రీతిలో.. ఒక విజయవంతమైన బిజినెస్ మెన్ పర్సనల్ లైఫ్ అలాగే కంపెనీ ఆస్తుల మధ్య జరుగుతున్న ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

అసలు వివాదంలోకి వెళితే.. శ్రీధర్ వెంబు తన వద్ద ఉన్న జోహో కంపెనీ షేర్లను తన భార్యకు తెలియకుండా రహస్యంగా తన బంధువులకు, ఇతరులకు ట్రాన్స్ ఫర్ చేశారని ప్రమీల ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కంపెనీలో ఆమెకు రావాల్సిన వాటాను దక్కనివ్వకుండా చేసేందుకే ఈ ఆర్థిక లావాదేవీలు జరిగాయని అమెరికా కోర్టులో వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే సుమారు రూ.15వేల కోట్ల విలువైన ఆర్థిక లావాదేవీలు, బాండ్ల బదిలీ అంశం తెరపైకి వచ్చింది. ఒకప్పుడు ఆదర్శ దంపతులుగా పేరున్న వీరి మధ్య.. ఇప్పుడు ఆస్తుల పంపకం, నమ్మకద్రోహం అనే అంశాలపై తీవ్రమైన చర్చ జరుగుతోంది.

మరోవైపు శ్రీధర్ వెంబు ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తాను ఎప్పుడూ తన భార్యకు లేదా తన కుమారుడికి అన్యాయం చేయలేదని కేవలం తనపై బురదజల్లేందుకే ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వాదిస్తున్నారు. తన సోదరులు, ఇతర కుటుంబ సభ్యులకు షేర్ల బదిలీ అనేది చట్టబద్ధంగానే జరిగిందని ఆయన సమర్థించుకుంటున్నారు. కంపెనీ ఎదుగుదల కోసం తీసుకున్న నిర్ణయాలను వ్యక్తిగత కక్షలకు వాడుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ గొడవ వల్ల జోహో వంటి ప్రతిష్టాత్మక కంపెనీ ప్రతిష్ట దెబ్బతింటోందని ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసు అమెరికాలోని కాలిఫోర్నియా కోర్టులో విచారణలో ఉంది. ఆటిజంతో బాధపడుతున్న తన కుమారుడి భవిష్యత్తు కోసం తాను పోరాడుతున్నానని ప్రమీల చెబుతుండగా.. ఇది కేవలం డబ్బు కోసం జరుగుతున్న డ్రామా అని వెంబు వర్గం కొట్టిపారేస్తోంది. సోషల్ మీడియాలో నెటిజన్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయి చర్చిస్తున్నారు. ఒక స్టార్టప్ వ్యవస్థాపకుడి వ్యక్తిగత జీవితం కంపెనీ భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తుందనే దానికి ఈ వివాదం ఒక నిదర్శనంగా నిలిచింది. రూ.15వేల కోట్ల 'బాండ్ల వివాదం చివరకు ఎటు వైపు మలుపు తిరుగుతుందో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# శ్వాస సంబంధిత అలర్జీలు ఉన్నాయా..?

## అయితే ఈ చిట్కాలను పాటించండి..!



సాధారణంగా చాలా మందికి అనేక రకాల అలర్జీలు ఉంటాయి. వాటిల్లో శ్వాస సంబంధిత అలర్జీ కూడా ఒకటి. వాతావరణం మారినప్పుడు లేదా సీజన్ మారినప్పుడు, చలికాలంలో శ్వాస సంబంధిత అలర్జీలు ఉన్నవారికి తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. గాలిలో ఉండే కాలుష్య కారకాలు, దుమ్ము, ధూళి కణాలు, పుప్పొడి రేణువులను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత అలర్జీలు వస్తుంటాయి. దీంతో చర్మంపై దద్దుర్లు వచ్చి దురదగా ఉంటుంది. అలాగే కొందరికి దగ్గు, జ్వరం, ఆస్తమా, ముక్కు దిబ్బడ వంటి అనారోగ్య సమస్యలు సైతం వస్తాయి. అయితే శ్వాస సంబంధిత అలర్జీలు ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మందులను వాడాల్సి ఉంటుంది. అలాగే పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల కూడా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. కొన్ని చిట్కాలను పాటిస్తే శ్వాస సంబంధిత అలర్జీలు తగ్గుతాయి.



**హెర్బల్ టీ..**

శ్వాస సంబంధిత అలర్జీలు తగ్గాలంటే అందుకు హెర్బల్ టీలు అద్భుతంగా పనిచేస్తాయి. మీకు నచ్చిన ఏదైనా హెర్బల్ టీని సేవించవచ్చు. లేదా అశ్వగంధతోనూ హెర్బల్ టీ తయారు చేసి తాగవచ్చు. అశ్వగంధ, బల, విదరి అనే మూలికలను సమాన భాగాలుగా తీసుకుని పొడి చేయాలి. ఒక కప్పు నీటిలో ఆ పొడిని 1 టీస్పూన్ మోతాదులో వేసి 3 నిమిషాల పాటు మరిగించాలి. తరువాత అందులో 5 నుంచి 10 చుక్కల మహా నారాయణ తైలం వేసి బాగా కలపాలి. ఈ హెర్బల్ టీని 15 నిమిషాలకు ఒకసారి ఒక సిప్‌లా చేసి తాగాల్సి ఉంటుంది. అలా అయిపోయే వరకు దీన్ని తాగాలి. ఇలా చేస్తుంటే అలర్జీలు తగ్గుతాయి. అయితే మహా నారాయణ తైలం లేకపోతే దానికి బదులుగా నెయ్యిని సైతం వాడుకోవచ్చు. అలాగే శ్వాస సంబంధిత అలర్జీలు తగ్గేందుకు త్రిఫల చూర్ణం కూడా బాగానే పనిచేస్తుంది. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో అర టీస్పూన్ త్రిఫల చూర్ణం కలిపి తాగాలి. దీని వల్ల అలర్జీలు తగ్గుతాయి. అలాగే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది.

**నెయ్యి..**

శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా అలర్జీలు ఉన్నవారు చల్లని వాతావరణంలో ఉండకూడదు. బయట తిరగాల్సి వస్తే మాస్క్ ధరించడం మేలు చేస్తుంది. దీని వల్ల కాలుష్య కారకాలు, దుమ్ము, ధూళి కణాలు, పుప్పొడి రేణువులు ముక్కులో చేరి అలర్జీలను కలిగించకుండా అడ్డుకోవచ్చు. శ్వాస సంబంధిత అలర్జీలు ఉన్నవారికి నెయ్యి కూడా బాగానే పనిచేస్తుంది. రాత్రి పూట నిద్రించడానికి ముందు కొద్దిగా నెయ్యిని తీసుకుని కరిగించి ఒక్కో ముక్కు రంధ్రంలో ఒకటి లేదా రెండు చుక్కల చొప్పున నెయ్యి వేయాలి. ఇలా చేస్తున్నా కూడా సమస్య తగ్గుతుంది. అలాగే శ్వాస అలర్జీలు ఉన్నవారు ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కూడా అలర్జీలు వస్తాయి. కనుక ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

**ఆహారాలు..**

శ్వాస అలర్జీలు ఉంటే తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తీసుకోవాలి. పాలు, పాల ఉత్పత్తులను చలికాలంలో లేదా సీజన్ మారినప్పుడు తీసుకోవడం తగ్గించాలి. లేదా పూర్తిగా మానేస్తే మంచిది. కొవ్వు తీసిన ఉత్పత్తులను అయినా సరే తీసుకోవచ్చు. అలర్జీలు ఉన్నవారు పాలు, పాల ఉత్పత్తులకు వీలైనంత వరకు దూరంగా ఉండడం మేలు. కొందరికి డ్రై ఫ్రూట్స్, ఊరగాయలు, వెనిగర్, బ్రెడ్ వంటి ఆహారాలు పడవు. కొందరికి పల్లీలు తింటే అలర్జీలు వస్తాయి. ఫుడ్ అలర్జీలు ఉన్నవారు కూడా శ్వాస అలర్జీ పట్ల జాగ్రత్తగా ఉండాలి. విటమిన్ సి ఉండే ఆహారాలను తింటుంటే ఈ సమస్య కొంత వరకు తగ్గుతుంది. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న ఆహారాలను తీసుకుంటున్నా మేలు జరుగుతుంది. ఈ విధంగా ఆయా చిట్కాలను పాటిస్తూ ఆహారాలను తీసుకుంటుంటే అలర్జీ సమస్య నుంచి దూరంగా ఉండవచ్చు.



# ఉదయం పూట చాలా మంది చేసే తప్పులు ఇవే..

## వీటి వల్ల బరువు తగ్గాలనుకునే లక్ష్యం నెరవేరదు..!

అధిక బరువు తగ్గడం అన్నది ప్రస్తుతం ఎంత కష్టంగా మారిందో అందరికీ తెలిసిందే. ఒకప్పుడు ప్రజలు రోజూ శారీరక శ్రమ చేసేవారు. కనుక వారు చాలా దృఢంగా ఉండేవారు. అధిక బరువు పెరిగేవారు కాదు. వయస్సు మీద పడినప్పటికీ ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండేవారు. కానీ ప్రస్తుతం అలా కాదు. చిన్నారులు సైతం ఊబకాయంతో బాధపడుతున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అయితే అధికంగా బరువు ఉన్నవారు దాన్ని తగ్గించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. డైట్‌ను పాటించడం, వ్యాయామం చేయడం వంటివి అనుసరిస్తారు. కానీ అనుకున్న రీతిలో బరువు తగ్గడం లేదని వాపోతుంటారు. అయితే చాలా మంది ఉదయం పలు రకాల తప్పులు చేస్తుంటారు. దీని వల్ల కూడా బరువు పెరుగుతారు. ఆయా తప్పులు ఏమిటో తెలుసుకుని జాగ్రత్త పడితే అధిక బరువును సులభంగా తగ్గించుకునేందుకు అవకాశాలు ఉంటాయి.

**టీ, కాఫీ..**

చాలా మంది ఉదయం నిద్ర లేచిన వెంటనే పరగడుపునే టీ, కాఫీలను సేవిస్తారు. అలా తాగనిదే వారికి రోజు ప్రారంభం కాదు. అయితే వాస్తవానికి బరువు పెరిగేందుకు ఇది ప్రధాన కారణంగా చెప్పవచ్చు. బరువు తగ్గాలనే ప్రణాళికలో ఉన్నవారు అయినా సరే ఉదయం పరగడుపునే టీ, కాఫీలను తాగడం వల్ల బరువు తగ్గలేకపోతుంటారు. టీ, కాఫీలలో ఉండే చక్కెర కారణంగా బరువు పెరుగుతారు. కనుక బరువు తగ్గాలనుకునే లక్ష్యాన్ని చేరుకోలేకపోతారు. కనుక ఉదయం పరగడుపున ఆ పానీయాలను తాగకూడదు. వాటికి బదులుగా గోరు వెచ్చని నీళ్లను తాగితే ఫలితం ఉంటుంది. ఉదయం పరగడుపునే గోరు వెచ్చని నీళ్లను తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి తాగితే ఇంకా మేలు చేస్తాయి. దీని వల్ల బరువు త్వరగా తగ్గేందుకు అవకాశాలు ఉంటాయి.

**పండ్ల రసాలు..**

చాలా మంది ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసిన తరువాత చక్కెర అధికంగా ఉండే పండ్ల రసాలను తాగుతారు. లేదా టీ, కాఫీలలోనూ చక్కెర అధికంగా కలిపి తాగుతారు. ఇలా చేయడం వల్ల కూడా బరువు తగ్గాలనుకునే లక్ష్యం నెరవేరదు. పైగా బరువు పెరుగుతారు. టీ, కాఫీలను చక్కెర కలపకుండా తాగాలి. బ్లాక్ టీ లేదా బ్లాక్ కాఫీ అయితే ఇంకా మేలు జరుగుతుంది. అలాగే పండ్ల రసాలు కూడా ఇంట్లో తయారు చేసుకున్నవి తాగాలి. బయట చక్కెర వేసి తయారు చేసినవి తాగకూడదు. వీటి వల్ల బరువు పెరుగుతారు. అలాగే ప్యాక్ చేయబడిన పండ్ల రసాలను సైతం ఉదయం తాగకూడదు. వీటిల్లోనూ చక్కెర అధికంగా ఉంటుంది. ఇది మన శరీరానికి హాని చేస్తుంది. బరువు పెరిగేలా చేస్తుంది. అలాగే అధిక బరువు వేగంగా తగ్గాలని చెప్పి కొందరు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేస్తారు. నేరుగా మధ్యాహ్నం లంచ్ తింటారు. కానీ ఇది ఆరోగ్యానికి అసలు మంచిది కాదు. అలా చేయడం వల్ల రోజులో ఇతర సమయాల్లో జంక్ ఫుడ్‌ను అధికంగా తింటారని, దీంతో అధికంగా బరువు పెరుగుతారని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. కనుక ఉదయం తప్పనిసరిగా బ్రేక్‌ఫాస్ట్ చేయాల్సి ఉంటుంది. మానేయకూడదు.


**జంక్ ఫుడ్..**

చాలా మంది బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్నప్పటికీ ఉదయం జంక్ ఫుడ్‌ను తింటారు. నూనె పదార్థాలను తరచూ తింటుంటారు. వీటి వల్ల శరీరంలో కొవ్వు అధికంగా చేరుతుంది. దీంతో బరువు పెరుగుతారు తప్ప తగ్గరు. దీని వల్ల బరువు తగ్గాలనుకునే లక్ష్యం నెరవేరదు. కనుక ఉదయం తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాలు, శక్తినిచ్చే ఆహారాలను తినాల్సి ఉంటుంది. ఉదయం కోడిగుడ్లు, ఓట్స్, తృణ ధాన్యాలను తింటుంటే మేలు జరుగుతుంది. ఇవి శక్తిని, పోషకాలను అందిస్తాయి. రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి. దీంతో చురుగ్గా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. అలాగే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది. ఇక కొందరు ఉదయం నిద్ర లేచిన తరువాత కూడా చాలా సేపు బెడ్ మీద అలాగే పడుకుని ఉంటారు. ఫోన్ ఆపరేట్ చేస్తుంటారు. ఇది చాలా అనారోగ్యకరమైన చర్య. బరువు తగ్గాలనుకునే వారు ఉదయం చేసే పొరపాట్లలో ఇది కూడా ఒకటి. ఉదయం నిద్ర లేచిన వెంటనే బెడ్ మీద నుంచి దిగి కాలకృత్యాలను మొదలు పెట్టాలి. యాక్టివ్‌గా ఉండేందుకు ప్రయత్నం చేయాలి. ఇలా చేస్తే బరువు త్వరగా తగ్గడమే కాదు, ఆరోగ్యంగా కూడా ఉంటారు. ఇలా ఉదయం ఆయా తప్పులను చేయకుండా ఉంటే బరువు తగ్గాలనుకునే లక్ష్యం చాలా త్వరగా నెరవేరుతుంది.

# గర్భిణీల్లో విటమిన్ డి లోపం ఉంటే..

## పుట్టబోయే పిల్లల్లో ఎలాంటి వ్యాధులు వస్తాయంటే..?

గర్భం ధరించిన మహిళలు తినే ఆహారం విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలన్న విషయం అందరికీ తెలిసిందే. అన్ని పోషకాలు ఉండే ఆహారాలను వారు రోజూ తీసుకుంటేనే గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఉంటుంది. పుట్టుకతో ఎలాంటి లోపాలు, వ్యాధులు రాకుండా ఉంటాయి. అయితే ప్రస్తుతం చాలా మంది గర్భిణీలు తమకు తెలియకుండానే పోషకాహార లోపంతో బాధపడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. స్త్రీలు సాధారణ సమయంలో కన్నా గర్భం దాల్చినప్పుడు రోజూ కాస్త ఎక్కువ ఆహారాన్ని తినాల్సి ఉంటుంది. అలాగే నీళ్లను కూడా కాస్త ఎక్కువగానే తాగాలి. దీని వల్ల శిశువుకు అన్ని పోషకాలు అంది ఆరోగ్యంగా జన్మించేందుకు అవకాశాలు ఉంటాయి. ఇక గర్భిణీలు అన్ని పోషకాలు ఉండే ఆహారాలను రోజూ తీసుకున్నట్లే విటమిన్ డి ఉండే ఆహారాలను కూడా రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. చాలా మంది గర్భిణీలు విటమిన్ డి ఆహారాన్ని సరిగ్గా తినడం లేదు. దీని కారణంగా శిశువులకు అనేక వ్యాధులు, అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.




**అధిక బరువు సమస్య..**

గర్భిణీలు సరైన పౌష్టికాహారం తినకపోతే దాని ప్రభావం పుట్టబోయే బిడ్డపై పడుతుంది. గర్భిణీలు చాలా మందిలో విటమిన్ డి లోపం సమస్య ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల పిల్లలు పుట్టిన తరువాత అనేక సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. గర్భిణీల్లో విటమిన్ డి లోపం ఉండడం వల్ల శిశువులు మరీ అధిక బరువుతో జన్మిస్తున్నారని, వారు స్థూలకాయం బారిన పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. అలాగే అలాంటి చిన్నారులకు 6 ఏళ్ల వయస్సు వచ్చిన తరువాత నడుం చుట్టు కొలత విపరీతంగా పెరిగి ఊబకాయులుగా మారుతున్నారని హెచ్చరిస్తున్నారు. గర్భిణీల్లో విటమిన్ డి లోపం ఉంటే దాని ప్రభావం పుట్టబోయే శిశువుపై తీవ్రంగా పడుతుందని అంటున్నారు. అలాంటి చిన్నారుల్లో అనేక సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు.

**గుండె జబ్బులు, క్యాన్సర్ వచ్చే అవకాశం..**

విటమిన్ డి లోపం గర్భిణీల్లో ఉంటే పుట్టబోయే శిశువులకు గుండె జబ్బులు, మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి సమస్యలు వస్తున్నాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అలాగే అలాంటి చిన్నారుల్లో క్యాన్సర్, టైప్ 1 డయాబెటిస్ వచ్చే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. ప్రస్తుతం చాలా మంది మహిళల్లో విటమిన్ డి లోపం ఉంటోంది. వారు గర్భం దాల్చిన తరువాత కూడా ఆ లోపం అలాగే కొనసాగుతుందని, అది తెలియకపోవడం వల్ల చాలా మంది సమస్యలను ఎదుర్కొంటున్నారని అంటున్నారు. విటమిన్ డి లోపం మహిళల్లో ఉంటే వెంటనే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాలని అంటున్నారు. అయితే విటమిన్ డి లోపం ఉన్నవారు ఆ విటమిన్‌ను చాలా సులభంగా పొందవచ్చు. రోజూ కాసేపు సూర్య రశ్మి తగిలేలా ఉదయం పూట ఎండలో నిలుచుంటే చాలు. విటమిన్ డిని శరీరం దానంతట అదే తయారు చేసుకుంటుంది. అలాగే కోడిగుడ్లు, చేపలు, పాలు, చీజ్, పెరుగు వంటి ఆహారాలను తీసుకుంటున్నా కూడా విటమిన్ డి లభిస్తుంది.

**66 శాతం మంది మహిళలు..**

మన దేశంలో సుమారుగా 66 శాతం మంది మహిళలు విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారని అధ్యయనాల్లో తేలింది. గర్భిణీలకు 3వ నెల తరువాత ఈ సమస్య ఎక్కువగా వస్తుందని గుర్తించారు. కనుక గర్భిణీలే కాదు, గర్భం దాల్చని మహిళలు కూడా విటమిన్ డి ఉన్న ఆహారాలను రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే డాక్టర్లు సూచించిన మేర విటమిన్ డి ట్యాబ్లెట్లను కూడా వాడవచ్చు. దీని వల్ల మహిళలు విటమిన్ డి లోపం నుంచి బయట పడవచ్చు. అలాగే శిశువుల్లో పుట్టుక లోపాలు, వ్యాధులు రాకుండా కాపాడవచ్చు.

# తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టిన అనుష్క శర్మ.. ట్రెండింగ్‌లో RCB






**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో అనుష్క శర్మ తన అరంగేట్ర మ్యాచ్ లో అద్భుతంగా రాణించింది. అనుష్క శర్మ అంటే వెంటనే కోహ్లీ భార్య అని గుర్తుకొస్తే పొరపాటే. ఆమె మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళా క్రికెటర్. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో భాగంగా శనివారం (జనవరి 10) గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్జ్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ మ్యాచ్ లో గుజరాత్ తరపున ఆడుతున్న అనుష్క తన ఐపీఎల్ డెబ్యూ మ్యాచ్ లో 30 బంతుల్లోనే 44 పరుగులు చేసి సూపర్ ఇన్నింగ్స్ ఆడింది. ఆమె ఇన్నింగ్స్ లో 7 ఫోర్లున్నాయి. మూనీ ఔటైన తర్వాత క్రీజ్ లోకి వచ్చిన అనుష్క.. గార్డ్ నర్ తో కలిసి భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. వీరిద్దరి జోడీ ఏకంగా 103 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు భారీ స్కోర్ అందించారు. ఈ క్రమంలో అనుష్క ఎలాంటి చెత్త షాట్లకు వెళ్లకుండా చూడచక్కని షాట్లతో అలరించింది. వాస్తవానికి ఐపీఎల్ మెగా ఆక్షన్ లో అనుష్కను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కొనుగోలు చేయాల్సి ఉంది. రూ. 10 లక్షల కనీస ధరతో వేలల్లోకి వచ్చిన అనుష్కను కొనడానికి రాయల్ ఛాలెంజర్స్ బాగా ఆసక్తి చూపించింది. రూ.40 లక్షల వరకు బిడ్ కొనసాగించింది. చివరికి రూ.45 లక్షలకు గుజరాత్ జెయింట్స్ కొనుగోలు చేసింది. ఈ సీన్ మెగా ఆక్షన్ లో హైలెట్ గా మారింది.ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేస్తున్న గుజరాత్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్ 65 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచింది. అనుష్క శర్మ 40 పరుగులు చేసి రాణించగా.. సోఫీ డివైన్ 38 పరుగులు చేసి పవర్ ప్లే లో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. చివర్లో జార్జియా వేర్‌హామ్ 10 బంతుల్లోనే 3 సిక్సర్లతో 27 పరుగులు చేసి జట్టు స్కోర్ ను 200 పరుగులు దాటించింది. యూపీ బౌలర్లలో సోఫీ ఎక్లెస్టోన్ రెండు వికెట్లు పడగొట్టింది.

### ఎవరీ అనుష్క శర్మ..?

కోహ్లీ సతీమణి అనుష్క శర్మ కావడం.. అదే పేరున్న ప్లేయర్ అనుష్క శర్మ మహిళల ఆర్సీబీ జట్టులోకి వస్తే ఆమె పేరు బాగా పబ్లిసిటీ అవ్వడం ఖాయం. కానీ గుజరాత్ టైటాన్స్ అనుష్కను దక్కించుకుంది. ఆమె అసలు పేరు అనుష్క బ్రిజ్మోహన్ శర్మ. అక్టోబర్‌లో జరిగిన సీనియర్ ఉమెన్స్ ఇంటర్–జోనల్ టీ20 ట్రోఫీలో లిస్ట్ ఏ లో సెంట్రల్ జోన్ తరపున ఆడుతూ 63 యావరేజ్.. 125 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేసింది. సీనియర్ ఉమెన్స్ టీ20 ట్రోఫీలో మధ్యప్రదేశ్ తరపున అద్భుతంగా రాణించింది. దూకుడుగా ఆడుతూ తన స్పిన్ బౌలింగ్ లోనూ రాణిస్తుంది. ఈ 22 ఏళ్ళ మధ్యప్రదేశ్ ప్లేయర్ ఒకవేళ ఆర్సీబీ జట్టులో ఉంటే "అనుష్క శర్మ" అని పేరు పెట్టుకున్న ఆమె బాగా వైరల్ అయ్యేది. ఎందుకంటే ఆర్సీబీ జట్టు అంటే విరాట్ కోహ్లీ పేరు మారుమ్రోగుతుంది. కోహ్లీ సతీమణి అనుష్క శర్మ కావడంతో ఆమె పేరు కూడా ట్రెండింగ్ లో నిలిచేది.

# డీవై పాటిల్ స్టేడియంలో పరుగుల ప్రవాహం... గుజరాత్ జెయింట్స్ దే గెలుపు

- డబ్ల్యూపీఎల్ 2026లో గుజరాత్ జెయింట్స్ శుభారంభం
- యూపీ వారియర్జ్‌పై 10 పరుగుల తేడాతో ఉత్కంఠభరిత విజయం
- గుజరాత్ బ్యాటర్ ఆష్లే గార్డ్‌నర్ అద్భుత హాఫ్ సెంచరీ
- యూపీ బ్యాటర్ ఫోబ్ లీచ్‌ఫీల్డ్ మెరుపు ఇన్నింగ్స్ వృథా



**హైదరాబాద్ పెన్ పవర్:**ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ గెలుపుతో శుభారంభం చేసింది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో యూపీ వారియర్జ్‌పై 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల బ్యాటర్లు చెలరేగడంతో అసలైన టీ20 మజా లభించింది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన యూపీ వారియర్జ్ బౌలింగ్ ఎంచుకోగా, గుజరాత్ జెయింట్స్ బ్యాటింగ్‌కు దిగింది. ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ (41 బంతుల్లో 65) అద్భుత హాఫ్ సెంచరీతో జట్టును ముందుండి నడిపించింది. ఆమెకు సోఫీ డివైన్ (20 బంతుల్లో 38), అనుష్క శర్మ (30 బంతుల్లో 44) చక్కటి సహకారం అందించారు. చివరిలో జార్జియా వేర్‌హామ్ (10 బంతుల్లో 27 నాటౌట్), భారతి ఫుల్మాలి (7 బంతుల్లో 14 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో గుజరాత్ భారీ స్కోరును నమోదు చేసింది.అనంతరం 208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన యూపీ వారియర్జ్ గట్టిగానే పోరాడింది. ఫోబ్ లీచ్‌ఫీల్డ్ (40 బంతుల్లో 78 పరుగులు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో గుజరాత్ బౌలర్లకు చుక్కలు చూపించింది. ఆమె ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. అయితే, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో యూపీ లక్ష్యానికి దూరమైంది. చివర్లో శ్వేతా సెహ్రావత్ (25), ఆశా శోభన (27 నాటౌట్) రాణించినా ఫలితం లేకపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 197 పరుగులు మాత్రమే చేయగలిగింది. గుజరాత్ బౌలర్లలో రేణుకా సింగ్, సోఫీ డివైన్, జార్జియా వేర్‌హామ్ తలో రెండు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

# టాప్-5 ఫిక్స్.. సిరాజ్‌కు ఛాన్స్.. తొలి వన్డేకి టీమిండియా ప్లేయింగ్ 11 ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు 2026లో తొలి సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. న్యూజిలాండ్ తో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ లో భాగంగా తొలి వన్డే ఆదివారం (జనవరి 11) జరగనుంది. ఈ మ్యాచ్ లో టీమిండియా హాట్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతోంది. వడోదర వేదికగా దీజూా స్టేడియం ఈ మ్యాచ్ కు ఆతిథ్యమిస్తోంది. తొలి వన్డేలో భారత జట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. సొంతగడ్డపై ఆడుతుండడంతో పాటు కెప్టెన్ శుభమాన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ జట్టులో చేరారు. సీనియర్ ప్లేయర్ సిరాజ్ కూడా జట్టులో స్థానం దక్కించుకున్నాడు. స్టార్ ప్లేయర్స్ అందరూ అందుబాటులో ఉండడంతో తొలి వన్డేలో టీమిండియా ఆడబోయే జట్టుపై ఆసక్తి నెలకొంది.

కెప్టెన్ శుభమాన్ గిల్ జట్టులోకి చేరడంతో రోహిత్ శర్మతో ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్ కు గాయం కారణంగా దూరమైన గిల్.. జైశ్వాల్ స్థానంలో ప్లేయింగ్ 11 లోకి రానున్నాడు. మూడో స్థానంలో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చేస్తాడు. నాలుగో స్థానంలో శ్రేయాస్ అయ్యర్ స్థానానికి తిరుగు లేదు. ఆస్ట్రేలియా సిరీస్ లో గాయపడిన అయ్యర్.. గైక్వాడ్ స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. ఐదో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ గా కేఎల్ రాహుల్ ఆడతాడు.

టాప్ –5 వరకు ఒ

టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ లో ఎలాంటి మార్పులు ఉండవు.వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తో పాటు యశస్వి జైశ్వాల్ బెంచ్ కే పరిమితం కానున్నారు. ముఖ్యంగా జైశ్వాల్ తన చివరి మ్యాచ్ లో సెంచరీ కొట్టినా తుది జట్టులో లేకపోవడం బ్యాడ్ లక్. ఆరో స్థానంలో నితీష్ కుమార్ రెడ్డి లేదా వాషింగ్ టన్ సుందర్ లలో ఒకరికి ఛాన్స్ దక్కనుంది. స్పిన్ వికెట్ కావడంతో సుందర్ వైపే మొగ్గు చూపొచ్చు. ఏడో స్థానంలో జడేజా స్థానానికి ఎలాంటి డోకా లేదు. ఏకైక స్పిన్నర్ గా కుల్దీప్ యాదవ్ 8వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. పేసర్లుగా అర్షదీప్ సింగ్ జట్టులో ఉంటాడు. సిరాజ్, హర్షిత్ రానా, ప్రసిద్ కృష్ణలలో ఇద్దరికి చోటు దక్కనుంది. రిపోర్ట్స్ ప్రకారం ప్రసిద్ బెంచ్ కు పరిమితం కావొచ్చు.

**న్యూజిలాండ్ తో తొలి వన్డేకు ఇండియా ప్లేయింగ్ 11 (అంచనా):**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్

# సీనియర్స్ లో బాలయ్య ఒక్కడే అలా!

ఫిట్ నెస్ విషయంలో సెలబ్రిటీలు ఎంత కేర్ ఫుల్ గా ఉంటారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. రోజులో రెండు గంటలు తప్పక వ్యాయామానికి కేటాయిస్తారు. ఒకప్పుడు ఫిట్ నెస్ పరంగా బాలీవుడ్ తారలు హైలైట్ అయ్యేవారు. ఇప్పుడు వాళ్లను మించిన ఫిట్ నెస్ ఫ్రీక్ లుగా టాలీవుడ్ స్టార్లు తయారవుతున్నారు. ఫిట్ నెస్ విషయంలో ఎంత మాత్రం అజాగ్రత్తగా ఉండటం లేదు. కేవలం పాత్ర అవసరం మేరకే కాకుండా ఫిట్ నెస్ పై ప్రత్యేక శ్రద్దతో శ్రమిస్తున్నారు. దీంతో రెండు రకాల లాభాలు పొందుతున్నారు. మంచి ఆరోగ్యంతో పాటు కావాల్సిన లుక్ లోకి మారిపోతున్నారు. సీనియర్ హీరోలు వెంకటేష్, నాగార్జున ఈ విషయంలో ఎప్పటి నుంచో ముందుంటున్నారు. వెంకటేష్ మంచి బాడీషేప్ మెయింటెన్ చేయడం అన్నది కొన్ని దశాబ్దలుగా జరుగుతోంది. ఇప్పటికీ నాగార్జున అదే స్మార్ట్ లుక్ లో అలరిస్తున్నారు. వీరిద్దరిని చూసి...ప్రత్యేకించి నాగార్జున స్ఫూర్తితో మెగాస్టార్ చిరంజీవి కూడా స్మార్ట్ లుక్ లోకి మారిపోయారు. ఇప్పటి వరకూ లుక్ పరంగా పెద్దగా పట్టించుకోలేదు గానీ తాను కూడా మారాలని చిరంజీవి కసరత్తులు మొదలు పెట్టి రూపంలో చాలా మార్పులే తీసుకొచ్చారు. వింటేజ్ లుక్ లో వైరల్ అవుతోన్న చిరంజీవి తాజా ఫోటోలే అందుకు నిదర్శనం. ఈ స్మార్ట్ లుక్ లోనే శంకర ప్రసాద్ లో అలరించనున్నారు. ఇకపై అన్నయ్య ఇదే లుక్ ని మెయింటెన్ చేయాలని అభిమానులు కోరుతున్నారు. వాళ్ల కోరిక సహా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చిరు కసరత్తులు వదిలే ఛాన్సే ఉండదు. ఇక సీనియర్లలో మిగిలింది ఎవరు? అంటే నటసింహ బాలకృష్ణ. ఇంత వరకూ బాలయ్య జిమ్ వీడియోలు ఎక్కడా బయటకు రాలేదు. ఫిట్ నెస్ పరంగా ఆయన ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు? అన్న డేటా కూడా లేదు. ఆన్ స్క్రీన్ పై బాలయ్య లుక్ కోసం ప్రత్యేక కసరత్తులు అవసరం లేదు. బాలయ్య స్వాగ్ తోనే చెల్లిపోతుంది. కానీ ఇంత వరకూ బాలయ్య లుక్ పరంగా మార్పులు తీసుకొచ్చే పాత్రల్లో కనిపించలేదు. ఆ జానర్ స్టోరీలు బాలయ్యకు రాకపోవడంతో? ఆయనా ఛాన్స్ తీసుకోలేదు. కానీ వస్తే బాలయ్య కూడా అంతకుమించి శ్రమిస్తారు. అతడెప్పుడు దర్శకుల హీరోనే. వెండి తెరపై దర్శకుల హీరోగా కనిపించడం కోసం ఎంతైనా కష్టపడతారు. మరి ఆ ఛాన్స్ 11వ సినిమాకు ఉంటుందా? ఉండదా? అన్నది చూడాలి. ఇప్పటికే గోపీచంద్ మలినేనితో 111వ చిత్రం ప్రకటించిన సంగతి తెలిసిందే.



**పరాశక్తి ఈవెంట్‌లో శ్రీలీల టైమ్‌లెస్ బ్లాక్ శారీ మ్యాజిక్**



**షెరీనా కపానీ కస్టమ్ క్రిమ్సన్ చీరలో సిమ్రాన్ కౌర్ మండిపడింది**



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965